
1

# ఆంధ్రజ్యోతి

ఖరీదు
0-6-0




విజయ వారి...
పాతాళ భైరవి
డైరెక్షన్
K.V. రెడ్డి, Bsc (HONS)
Produced by - NAGI REDDI...CHAKRAPANI...




ఆంధ్రా, సీడెడ్, నైజాంలో

**పూర్ణా రిలీజు**

మైసూరు:

**అమృత పిక్చర్స్**

బెంగుళూరు

# మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే

**బాధపడుచున్న యెడల వెంటనే**

**పాత్రుడు గారి**

# బాలసంజీవిని

**యీయండి**

**ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.**

**వివరములకు:**

## డా॥ పిళ్లా పాపయ్యా పాత్రుడు & బ్రదరు,

**11, దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.**

**కుంభకోణం బ్రాంచి:**
**నెం. 7, సారంగపాణి కోవిల్,**
**తూర్పువీధి.**

**తిరుచినాపల్లి బ్రాంచి:**
**నెం. 15, పుగళై పిళ్ళై వీధి,**
**తెప్పకొలం.**






# రు. 500 బహుమానము

# ఉమా గోల్డు కవరింగు వర్క్సు

**ఉమా మహల్ :: మచిలీపట్నము**

ఉమా గోల్డు కవరింగు వర్క్సు పోస్టాఫీసు.

అసలు బంగారు రేకు లోహముపైన అంటించి (Gold Sheet Welding on Metal) తయారు చేయబడినవి. కాదని రుజువు చేసినవారికి రు. 500 బహుమానమివ్వబడును. మేము తయారు చేయు ప్రతివస్తువు ప్యాకింగు పైన "ఉమా" అను ఇంగ్లీషు అక్షరములు గుర్తించి కొనవలెను. బంగారు వన్నె 10 సంవత్సరములు గ్యారంటీ.

* * *

పరీక్ష చేయగోరువారు ఉమా ఆభరణములను మహా ద్రావకములో వేసిన 5 నిమిషములకే బంగారము రేకు వెడలివచ్చును. ఈ విధముగా పరీక్ష చేసినవారు అనేకమంది మాకు సర్టిఫికేట్లు యిచ్చియున్నారు. 800 డిజయినుల క్యాటలాగు ఉచితముగా పంపబడును. ఇతర దేశములకు క్యాటలాగు ధరలమీద 25% అధికము.

*N.B.*—వస్తువుల వి. పి. పార్శిలు చార్జి 0-15-0 మాత్రమే అగును.

Tel : "UMA" MASULIPATAM

ఆంధ్రదేశమంతటా దిగ్విజయముగా నడచుచున్నది !





కాకర చెట్టుకు కాయలందమ్ము
ఆడవారందరకి బిడ్డలందమ్ము
ఆసౌఖ్యమెరుగని అతివబ్రతుకేమి!



వెర్రికాని,-ఉయ్యాలలో బొమ్మ
అద్దాలలో బిడ్డ ఔతుందా?"
ముందు ఆరోగ్యం చూచుకో



ఆరోగ్యప్రదాయిని
సంతానకల్పవల్లి

లోధ్ర

కేసరీ కుటీరం లిమిటెడ్,
రాయపేట :: మద్రాసు 14.



అందమునకు ! ఆరోగ్యమునకు !



బుల్ బ్రాండు సబ్బులు

ప్రసిద్ధి గాంచిన

కస్-రాజ్ సబ్బు

వివరాలకు : సావరిన్ ఏజెన్సీస్,
84, గిడ్డంగి వీధి, మదరాసు-1






డోంగ్రేగారి

బాలామృతం

బలహీనమైన బిడ్డలకు పుష్టియున్ను,
పళ్లు మొలిచేటప్పుడు అయ్యే విరేచనములు
నిలిపి, బలమును, ఆరోగ్యము నిచ్చును.

K. T. Dongre & Co. BOMBAY-4


మీరు మెక్లీన్‌తో
నేడు పళ్లు తోముకున్నారా?
నెలరోజుల క్రిందట మీ పెరాక్సైడ్ టూత్ పేస్టు వాడుక ప్రారంభించాను. అది నాకెంతో బాగుంది. ఇది వరకు నా పళ్లు గారెక్కి వుండేవి. కాని, మీ టూత్ పేస్టును వాడుతున్నప్పటి నుంచీ అవి ముత్యాలవలె మెరుస్తున్నవి.
నోటిని పరిమళభరిత మొనర్చి దుర్వాసనను నివారిస్తుంది
ఆమ్లాలను విరిచివేసి మీ ఇగుళ్లను సంరక్షిస్తుంది
పళ్లమీది మరకలను తొలగించి వాటిని ధవళతర మొనర్చుతుంది
సామాన్యమైన వాటికన్న భిన్నమైన టూత్ పేస్టు కావలసివస్తే, మెక్లీన్స పెరాక్సైడ్ టూత్‌పేస్టును వాడండి, దంతాలను ధవళతర మొనర్చే శక్తిగల పెరాక్సైడు ఈ మెక్లీన్సులో మాత్రమే ఉన్నది. ఇది విశిష్టమైన సూత్రం ప్రకారం తయారైనది గనుక, నోటిలోని అదనపు ఆమ్లాలను విరిచివేయడం మూలంగా దంతక్షయాన్ని అరికట్టడానికి, దంతశోభను మరుగుపరిచే మరకలను తొలగించడానికి, దంతాలను ముత్యాలవలె మెరిసే మెరుగు పెట్టడానికి, రమ్యమైన పెప్పర్ మింట్ రుచితో శ్వాసను పరిమళభరిత మొనర్చి, ఆహ్లాదం కలిగించడానికి ఇది తోడ్పడుతుంది.
నేడే మెక్లీన్స కొనండి!
MACLEANS
PEROXIDE
TOOTH PASTE

# నిరంతర సహవాసి



మీరు మకాం చేస్తున్నా, లేక ఇంటి
లోనే ఉన్నా, ఇటియల్ మీకు
నిరంతర సహవాసిగా ఉంటుంది.
దానిని నమ్మకంగా మీరు వాడవచ్చును.

సెప్టిక్ కానివ్వదు, క్రిమివిధ్వంసిని, అహ్లాదకరమైనది, విషంకాదు.

ఉత్పత్తిదారులు :

ది మైసూర్ ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లాబరేటరీ లిఁ.,
మల్లేశ్వరం, బెంగుళూరు.

I.T.I.




సెల్లింగ్ ఏజెంట్లు :

బెస్ట్ అండ్ కంపెనీ లిమిటెడ్,
పోస్ట్ బాక్స నం. 63, మద్రాసు.

---

# ఇంకా తగ్గింపు ధరలు!

కంచాలకూ, పళ్ళెములకూ ధరలు తగ్గినవి

గ్యారంటీ స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు
మాసిపోవు. ఎప్పుడూ కాంతిగా నుండును

ఆరోగ్యానికి

I.M.M.C
MADRAS

శాశ్వతత్వానికి

ప్రతి ఇంటికి, హొటెలుకు, హాస్టలుకు, హాస్పిటల్
కాస్టీన్సుకు కావలసిన పరికరములన్నియు దొరకును

విలాసయుతమైన చవుక సామగ్రి

★

ఆంధ్ర జిల్లాలకు ఏజంట్లు :

శ్రీ ప్రభూజీ ఏజన్సీస్,
జాంపేట :: రాజమండ్రి

తయారుచేయువారు

ఇండియన్ మెటల్ & మెటలర్జికల్ కార్పొరేషన్
498, మింట్‌స్ట్రీట్ :: మద్రాసు - 3

# మీ డబ్బును పెట్టుబడి పెట్టండి

| | |
|---|---|
| **3½%** రాబడిపన్ను లేదు | భారత ప్రభుత్వపు పది సంవత్సరముల ట్రెజరీ సేవింగ్స్ డిపాజిట్‌లో |

**భద్రతకు :**

డిపాజిట్లను బొంబాయి, కలకత్తా, ఢిల్లీ, మద్రాసులలోగల ఇండియా రిజర్వు బ్యాంకుల లోనూ, ఇతరత్ర ట్రెజరీ లావాదేవీలు గల ఇంపీరియల్ బ్యాంకు బ్రాంచీలలోను పుచ్చుకుంటారు.

**మంచి ప్రతిఫలానికి :**

వడ్డీని. సొమ్ము డిపాజిట్ చేసిన తేదీమొదలు ప్రతి పన్నెండు నెలలకొకసారి సాలీనా 3½% వంతున అయిన వడ్డీమొత్తాన్ని ఏ ప్రభుత్వ ట్రెజరీనుండి అయినా పొందవచ్చును. లేక డిపాజిట్ చేసిన ఆయన/ఆమె యొక్క విలాసానికి పబ్లిక్ డెట్ ఆఫీసువారు పంపగలరు.

**మూలధనాన్ని సులభంగా తిరిగి పొందుటకు :**

10 ఏళ్ళు పూర్తికాగానే డిపాజిట్ మొత్తాన్ని పొందవచ్చు కాని, అంతలోగానే అవసరమైనచో, డిపాజిట్ చేసిన ఒక సంవత్సరం తరవాత, ఎప్పుడైనాసరే, లాభసాటియైన డిస్కౌంట్ రేటువంతున, డిపాజిట్ కాలపరిమితిబట్టి వృద్ధియైన నికరమొత్తాన్నిపొందవచ్చును.

## మీరు మరువవద్దు సుమండీ!

రాబడి పన్ను మినహాయింపు. డిపాజిట్లపై లభించు వడ్డీపై రాబడి పన్ను లేదు. రాబడి పన్ను లెక్కలకొరకు డిపాజిట్‌వారు మొత్తం ఆదాయన్ని లెక్కించునపుడు ఈ పైవడ్డీ మొత్తం అందులో చేర్చబడదు.

**ఈ డిపాజిట్‌ను ప్రభుత్వంవారు మున్ముందు ప్రకటించే తేదీవరకే పుచ్చుకుంటారు.**

డిపాజిట్లను రు. 100 మొత్తాలలో క్రింద సూచింపబడిన గరిష్ఠ పరిమితులలో పుచ్చుకొంటారు.

రు. 25,000/- డిపాజిట్‌దారు ఒక్కడేఅయితే
రు. 50,000/- ఇద్దరుగా చేరియున్న లేక సంస్థలవిషయంలో
రు. 1,00,000/- ధర్మసంస్థలవిషయంలో

**జ్ఞాపకం ఉంచుకోండి :**

మీరు ట్రెజరీ డిపాజిట్ చేయడంతో, మీ మూలధనాన్ని సురక్షితంగా చేసుకొనడంతోపాటు, 3½% వంతున, రాబడిపన్ను మినహాయించిన ఆదాయాన్ని పది సంవత్సరాలవరకు పొందుతామనే గట్టినమ్మకం ఉంటుంది.

**ఇప్పుడే డిపాజిట్ చేయండి**

క్రింది వివరాలతో అర్జీ పెట్టుకోండి :

మీ పూర్తి పేరు, విలాసం, డిపాజిట్ మొత్తం, ఒక్కరుగానీ, లేక జంటగానీ, వడ్డీని పొందగోరే ట్రెజరీ పేరు, లేక రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారిచే సొమ్ము పంపబడదగిన విలాసము : జంటగానైనచో మూలధనం చెల్లింపబడు విధానము లేక, అప్లికేషన్‌ఫారం పంపవలసినదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి, లేక మీకు సమీపంగానున్న ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచికి వ్రాసుకొనండి.

భారత ప్రభుత్వపు నేషనల్ సేవింగ్స్ కమిషనరు, ఆర్థిక మంత్రి కార్యాలయం, గోర్టన్ కాజిల్, సిమ్లావారి ప్రకటన

AC-232 TG

# ఆంధ్రబ్యాంకు లిమిటెడ్

స్థాపితము: 1923

## హెడ్డాఫీసు - మచిలీపట్టణము

| | | | |
|---|---|---|---|
| అధికారము పొందబడిన మూలధనము | — | రు. | 1,00,00,000 |
| చందా వేయబడి, జారీచేయబడిన మూలధనము | — | రు. | 48,99,000 |
| చెల్లింపబడిన మూలధనము | — | రు. | 25,00,000 |
| రిజర్వు ఫండు | — | రు. | 11,35,000 |
| అమలులోనున్న వ్యాపారము మొత్తము | — | రు. | 6,00,00,000 |

మద్రాస్ బ్రాంచి: బాంబే మ్యూచుయల్ బిల్డింగు, 378, ఎస్ప్లనేడు.

త్యాగరాయనగర్ ఆఫీసు: 81|82, పాండీ బజారు

మైలాపూరు ఆఫీసు: 49, కచేరీ రోడ్డు

ఇతర బ్రాంచీలు, సబ్ ఆఫీసులు:

మచిలీపట్టణము, నెల్లూరు, తెనాలి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణము, విజయనగరము, గూడూరు (నెల్లూరుజిల్లా), ఒంగోలు, చీరాల, దుగ్గిరాల, నరసారావుపేట, వినుకొండ, అరండల్ పేట (గుంటూరు), గవర్నరుపేట (విజయవాడ), గుడివాడ, పాలకొల్లు, భీమవరము, సామర్లకోట, రామారావుపేట (కాకినాడ), పిఠాపురం, తుని, అనకాపల్లి, చికాకోల్ (వైజాగ్), పెద్దాపురం, అమలాపురం, ఆముదాలవలస, తిలారు, సాలూరు, పెడన, (కృష్ణా), చల్లపల్లి, మహారాణి పేట (విశాఖపట్టణము), జగ్గయ్యపేట (కృష్ణా), గొల్లప్రోలు (తూర్పుగోదావరి), పార్వతీపురం, బాపట్ల (గుంటూరు జిల్లా), తిరుపతి (చిత్తూరు జిల్లా), కర్నూలు.

**ఫిక్సెడ్ డిపాజిట్లు:** నూరు రూపాయలకు తక్కువ గాని మొత్తములను 3, 6, 12, 24 మాసములకు అన్నిబ్రాంచీలలోను తీసుకొనబడుచున్నవి.

మూడు సంవత్సరముల క్యాషు సర్టిఫికేట్లు యీ బ్యాంకులో ప్రత్యేక సౌకర్యము.

అన్నిరకముల చెక్కులు, డ్రాఫ్టులు, డివిడెండు వారంట్లు, హుండీలు, వసూలుచేసి పెట్టబడును. గవర్నమెంటు పత్రములు, షేర్లు కొనుట, అమ్ముట మొదలగు వ్యాపారములు గూడ చేయబడును.

వివరము లే ఆఫీసులోనైనను తెలిసికొనవచ్చును.

ఏలేశ్వరపు రామచంద్రమూర్తి,
యం. ఏ., సి. ఏ. ఐ. ఐ. బి.,
జనరల్ మేనేజరు.

తాడేపల్లి శ్రీరాములు,
మేనేజింగ్ డైరెక్టరు.

SERVING AGRICULTURISTS THROUGH CHEMISTRY

# సమృద్ధి ఐన పంటను ఏల సమకూర్చుకొనరాదు?



మైసూర్ ఫర్టిలైజర్ కంపెనీవారు తయారు చేసే సాఫల్యమునిచ్చు ఎరువులను ఉపయోగించి మీ భూములను సారవంతము చేసికొనుడు.

పుష్కలమైన పంటకు

**“లోటస్ మార్కు”**

ఎరువులనే వాడండి!

LOTUS BRAND MF

**THE MYSORE FERTILISER COMPANY.** POST BOX No. 1206, MADRAS. I.

Offices : BANGALORE, KUPPAM, ERODE, METTUPALAYAM, COONOOR & OOTY.

FEDERALS-582



పద్మ : పిన్నిగారూ ! నేను యింటికి పోవాలి. మావారు ఆఫీసు నుండి వచ్చేవేళైయింది. నేను యింట్లో ఉన్నప్పుడే కోపంగా ఉంటారు. తలుపులు మూసియుంటే ఎంత చీకాకు పడతారో చెప్పలేను. ఎప్పుడూ అలసిపోయి వచ్చి కుర్చీలో కూర్చుంటారు.

సీత : మీ బాబుగారుకూడ అలాగే ఉండేవారు.

పద్మ : అతనూ మీపై అంత చీకాకుగా ఉండేవారా ?

సీత : అవును. కాని యిప్పుడు ఆఫీసునుండి రాగానే ఒక కప్పు తాజా "టీ" త్రాగిన తరువాత షికారుకు వెళ్ళుచున్నాము.

పద్మ : ఆఫీసులో అంత పని ఉండదనుకుంటాను.

సీత : ఊహూ....ఒక కప్పు టీ త్రాగగానే ఆయనకు అలసట పోయి ఉత్సాహము కలుగుతుంది. నీవుకూడా మీవారికిచ్చి ప్రయత్నించి చూడు.

# టీ

ఏమిటి ! ఈ 'టీ' ! అది ఖర్చు తక్కువగు దేశీయ పానీయము. అది అలసటను పోగొట్టును. సులభముగా తయారు చేయవచ్చును. అన్ని చోట్లా దొరకును. ఒక కప్పు త్రాగుతే దాని విలువ మీకే తెలుస్తుంది.

CTB 37

సెంట్రల్ "టీ" బోర్డువారివల్ల ప్రచురింపబడినది.

ఆంధ్రజ్యోతి

......సచిత్ర మాస పత్రిక......

సంపుటి 15 ] మార్చి 1951 [ సంచిక 3

# బడ్జట్‌లు — ఆర్థికమంత్రులు

అధికారాలు తక్కువ; బాధ్యతలు ఎక్కువ—ఇదీ అర్థిక మంత్రుల స్థితి.

ప్రజల నిత్యజీవితంపై అర్థికమంత్రుల చర్యలకుఉండే ప్రభావం విపరీతం. ప్రజాహితకార్యాలకు డబ్బు సేకరించి ఆ కార్యక్రమాలను నిర్వహించే వివిధశాఖలకు నిధులు ఏర్పాటుచేయాలి. పన్నులు విధిస్తేతప్ప ఇందుకు కావాల్సిన డబ్బు రాదు. పన్నులువిధిస్తే ప్రజల్లో అసంతృప్తి ప్రబలుతుంది. అర్థికమంత్రిమీదనే ఇదంతా కేంద్రీకృతం అవుతుంది.

పన్నులు విధించకపోతే ఈ కార్యక్రమాలకు డబ్బురాదు సరికదా ఏపని జరక్క పోయినా అందుకు బాధ్యులైన అధికారులు అర్థికమంత్రి బడ్జట్‌లో ఇందుకు ఏర్పాటుచేయలేదని తప్పుకుంటారు. పనులు జరగనందువల్ల కలిగే అసంతృప్తి కూడా మళ్ళా అర్థికమంత్రిమీదనే కేంద్రీకృతం అవుతుంది. వెనక్కిపోతే నుయ్యి, ముందుకుపోతే గొయ్యి అన్నమాదిరిగా ఉంటుంది అర్థికమంత్రుల స్థితి.

మనకు స్వరాజ్యం వచ్చినతరవాత కేంద్రంలో ఇప్పటికి ముగ్గురు అర్థిక మంత్రులు మారారు. మొట్టమొదట అవిభక్త స్వపరిపాలిత భారతదేశానికి లియాఖత్ అలీఖాన్ అర్థికమంత్రిగా పనిచేశారు. కేవలం ప్రజాభిమానాన్ని చూర గొనాలనే ఆవేశంతో తన మొదటి బడ్జట్‌ను తయారుచేశారు. సామాన్య ప్రజలు చెల్లించే పన్నుల ప్రమాణాన్ని తగ్గించారు. అందువల్ల ఏర్పడిన లోటును భర్తీ చేయడానికి వర్తకలాభాలపన్ను ప్రవేశపెట్టారు. పెట్టుబడిలాభాలపన్ను హెచ్చు

చేశారు. ఈవిధంగా పారిశ్రామిక వ్యాపారసంస్థల పన్నుభారాన్ని హెచ్చించారు. ఫలితం—పారిశ్రామిక వస్తూత్పత్తి తగ్గిపోయింది. పెట్టుబడికి డబ్బు దుర్లభమైంది. ఈ విషాదస్థితినుంచి ఇప్పటికీ దేశం పూర్తిగా కోలుకోలేదు.

వీరి తరవాత శ్రీ ఆర్. కె. షణ్ముఖంచెట్టిగారు ఆర్థికమంత్రి అయినారు. స్వతంత్ర భారత మొదటి బడ్జెట్‌ను వీరు తయారుచేశారు. మధ్యతరగతివారి పన్నుభారాన్ని తగ్గిస్తేగాని దేశఆర్థికస్థితి క్రమంగా అభివృద్ధిచెందదని గుర్తించి ఆ ప్రకారం వారు చెల్లించే ఆదాయపు పన్ను ప్రమాణాన్ని తగ్గించారు. పన్ను విధింపు కనిష్ఠమొత్తాన్ని పెంచారు. లియాఖత్ అలీఖాన్‌గారి బడ్జెట్‌వల్ల తారుమారైన దేశార్థికవ్యవస్థను చక్కచేయడానికి ప్రయత్నించారు. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరంగాక, అధమం అయిదేళ్ల కాలానికి బడ్జెట్‌ను తయారుచేయడం వాంఛనీయం అని సిద్ధాంతీకరించారు. ఆ దృష్టితోనే వీరు తమ రెండవ బడ్జెట్‌ను తయారు చేశారు.

తరవాత వారూ రాజీనామా యివ్వాల్సివచ్చింది. వారిస్థానే డాక్టర్ మత్తాయ్ ఆర్థికమంత్రి అయినారు. వీరు, షణ్ముఖంచెట్టిగారు మధ్య తరగతివారికి కల్పించిన సదుపాయాలను అలాగేవుంచి పారిశ్రామికులకు అదనపు సౌకర్యాలను కల్గించారు. వస్తూత్పత్తి పెరిగితేకాని ద్రవ్యోల్బణ ప్రమాదం పూర్తిగా తొలగదనీ, ప్రజల ఆర్థికస్థితి చక్కబడదనీ వీరి భావం. అది సరియైంది కాదనేందుకు వీల్లేదు. సామాన్య ప్రజలు చెల్లించే ప్రచ్ఛన్న, పరోక్షపన్నులను ఎంతమాత్రం తగ్గించక, వర్తక పారిశ్రామికపన్ను భారాన్నిమాత్రం తగ్గించారు. పారిశ్రామికోత్పత్తిలో వృద్ధి కన్పించకపోయినా ప్రభుత్వంలో పారిశ్రామికులకూ వ్యాపారస్థులకూ క్రమంగా విశ్వాసం ఏర్పడుతూ వచ్చింది. ఇందువల్ల పోయిన సంవత్సరం ప్రభుత్వం కోరిన ఋణధనం చాలా భాగం లభించింది.

వీరూ తిరిగి రాజీనామా ఇవ్వాల్సివచ్చింది. వీరిస్థానే, చాలాకాలం రిజర్వు బ్యాంకు గవర్నరు, డిప్యూటీ గవర్నరుగా పనిచేసిన చింతామణి ద్వారకనాధ్ దేశముఖ్ ఆర్థికమంత్రి అయినారు. వీరు కేవలం సంప్రదాయబద్ధమైన ఆర్థికవిధానాన్నే ఎక్కువగా అవలంబిస్తున్నారు. వీరు ఆర్థికమంత్రిగావచ్చిన తరవాత జరిగిన ప్రధాన సంఘటన ఫిబ్రవరి మాసాంతాన జరిగిన భారత పాకిస్థాన్ వ్యాపార పునరుద్ధరణ ఒడంబడిక. ఈ ఒడంబడికకు సంబంధించి సంప్రతింపులు చాలా కాలంగా జరుగుతూ ఉన్నవి. 1949 సెప్టెంబరులో ఈ వ్యాపారం ఆగిపోయినప్పట్నుంచీ తిరిగి ప్రారంభించాలని ప్రముఖ పారిశ్రామికులు వర్తకప్రముఖులు,

అధికారులు ఆందోళన చెందుతూనే ఉన్నారు. ఈ వ్యాపారం నిల్చిపోవడంవల్ల భారతదేశం ఎంతగా నష్టపడిందో పాకిస్తాన్‌కూడ అంతగా నష్టపడింది. అయినా భారతదేశానికి ఉన్నంత అర్థం ఆ దేశానికి లేదు. కాబట్టే పాకిస్తాన్ రూపాయి మారకపు విలువను గుర్తించనని దాదాపు రెండేళ్లు భారతప్రభుత్వం పట్టుబట్టినా చివరికి పాకిస్తాన్ నిర్ణయించిన విలువనే అంగీకరించి వ్యవహారం పరిష్కరించుకోవలసి వచ్చింది.


ఈ సందర్భంలో భారత ఆర్థికమంత్రి విధానంపై దేశంలో కొంత విమర్శ బయల్దేరడం సహజం. ఆర్థికమంత్రి దేశముఖ్ పట్టుదలవల్లనే ఈ ఒడంబడిక సాధ్యమైందని నిస్సందేహంగా చెప్పవచ్చు. దేశముఖ్‌గారు ఈ విషయంలో ఇంత పట్టుబట్టడానికి కారణాలులేకపోలేదు. పాకిస్తాన్‌నుంచి పత్తి, జనుము నష్లయి కానంతకాలం బొంబాయి, కలకత్తా మిల్లులు క్రమంగా పని మానివేయవలసి వస్తుంది. అంటే ఉత్పత్తి తగ్గడం, వ్యాపార లావాదేవీలు స్థంభించిపోవడం అందు వల్ల ప్రభుత్వానికి రాగల ఆదాయపుపన్ను తగ్గిపోవడం, పారిశ్రామిక కూలీలలో నిరుద్యోగం ప్రబలడం జరుగుతుంది. ఆర్థికమంత్రి క్రొత్త పన్నులు ఎన్నివేసినా ఈ పరిస్థితిని చక్కచేయలేరు. కాబట్టి డాలర్లను సంపాదించగల జనము పరిశ్రమను, ప్రభుత్వానికి ఆదాయపుపన్నును, ఎక్సైజు పన్నును సంపాదించిపెట్టగల నూలు, వస్త్రపరిశ్రమను యథాస్థితికి తీసుకురావడం చాలా ముఖ్యం. అంతేగాదు; భారత, పాకిస్తాన్ వ్యాపార లావాదేవీలు నిల్చిపోవడంవల్ల సుంకముల విధింపువల్ల ప్రభుత్వానికి వస్తున్న ఆదాయంకూడా తగ్గిపోయింది. ఇప్పుడీ వ్యాపారాన్ని తిరిగి ప్రారంభించడంవల్ల సుంకములద్వారా 1951-52 లో ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం వస్తుంది. అందువల్ల కొత్తగా పన్నులు విధించవలసిన అవసరం లేకుండానే ప్రజాహితకార్యక్రమాలకు అవసరమైన డబ్బును ఆర్థికమంత్రి సేకరింపగలరు.

రైల్వే మంత్రి శ్రీ యన్. గోపాలస్వామి అయ్యంగార్ ప్రయాణపు చార్జీలను పెంచి దేశముఖ్‌గారికి మరికొంత సహాయంచేశారు. మూడోతరగతి ప్రయాణపు ఛార్జీలుకూడా పెంచడం అందరి విమర్శలకూ గురిఅయినా రైల్వేమంత్రి చెప్పినట్టు ఈవిధంగా రైలు ఛార్జీలు పెంచకపోతే మరోవిధమైన ప్రత్యక్షపన్నులను ప్రభుత్వం విధించవలసి వస్తుంది. పరోక్షపు పన్నుల్లోఉన్న లాభమేఇది. అసలు కిటుకు ఎక్కడుందో ప్రజలకు తెలియకుండా ప్రభుత్వానికి కావాల్సిన డబ్బంతా లభిస్తుంది.

రైల్వేమంత్రి 19 కోట్ల రూపాయిలవరకూ ఈవిధంగా ఆదాయాన్ని పెంచినా ప్రయాణీకులకు ఇందులో పదోవంతు మాత్రమే సౌకర్యాల రూపేణ ముడుతుంది. ఆంధ్రలో ఎత్తివేయబడిన బొబ్బిలి - సాలూరు రైలును పునరుద్ధరించాలని బోర్డు తీర్మానించినా మంత్రి ఇందుకు ఏమీ కేటాయించలేదు. ఆంధ్రులకు అన్నింటా యిలాగేఉంది!

కేంద్రంలో ఇంతమంది ఆర్థికమంత్రులు మారినా మనరాష్ట్రంలో మాత్రం 1947—48 బడ్జట్‌నుంచి 1951—52 బడ్జట్‌వరకూ శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారే ఆర్థికమంత్రిగా ఉంటున్నారు. వీరు ఆర్థికమంత్రిగా వచ్చినప్పట్నుంచీ రాష్ట్రంలో ప్రజాభ్యుదయ కార్యక్రమాలకు ఎక్కువగా డబ్బు చూడాల్సివచ్చింది. మద్యనిషేధంవల్ల రాష్ట్రఆదాయంలో దాదాపు 17 కోట్ల రూపాయిలు తగ్గిపోయింది. అయినా మొత్తంమీద రాష్ట్రప్రభుత్వ ఆదాయం తగ్గలేదు. అమ్మకాలపన్ను, వినోదాల పన్నువల్ల ఈలోటు పూర్తిగా భర్తీ అయింది. కేంద్రప్రభుత్వం అంతర్రాష్ట్రీయ వ్యాపారంపై అమ్మకాలపన్ను విధించరాదన్నందువల్ల 1951—52లో దాదాపు 75 లక్షల రూపాయిల ఆదాయం తగ్గుతుందని గోపాలరెడ్డిగారన్నారు. అయినా ఆదాయపుపన్నులో మాత్రం 44 లక్షల రూపాయిలు అదనంగా ఈరాష్ట్ర భాగానికి వస్తుంది కాబట్టి వస్తూందనుకున్న 67 లక్షల రూపాయిల లోటు 23 లక్షల రూపాయిలకు తగ్గిపోయింది.

గోపాలరెడ్డిగారు ఆర్థికమంత్రిగా రాష్ట్రఆదాయవ్యయ స్థితిని సంతృప్తికరంగా పట్టుకువచ్చారనే చెప్పచ్చు. విద్యాసంస్థలపై ఖర్చు బాగాపెరిగింది. ఎన్నో కొత్త కళాశాలలు ఏర్పాటైనవి. ఎన్నో ప్రాజెక్టుల పరిశీలన పూర్తిఅయింది. విద్యుచ్ఛక్తి సంస్థల నెన్నిటినో ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్నందువల్ల ప్రభుత్వాస్తి పెరిగింది. ఈసంవత్సరం కొత్తగా పన్నులు విధించక, ఉన్న పన్నులను పెంచక ప్రజోపయోగ కార్యక్రమాలకు మాత్రం అంతరాయ మేర్పడకుండాచేసిన మన ఆర్థిక మంత్రి అభినందనీయులు.






ఉడుంపట్టుకూడా ఉక్కుదెబ్బకు తాళలేదన్న సంగతి పోయిన కొద్దిరోజులలో కొరియా రంగంలో రుజువైంది. "స్వచ్ఛందంగా మీరు సాగారిపోకపోతే బలప్రయోగంతో బయటికి నెట్టివేస్తాము" అని తాము అమెరికనులకు చేసిన హెచ్చరికను పాలించడానికి పెకింగ్ పరిపాలకులు కొరియా రంగానికి విశేషంగా సైన్యాలను ఉరికించారు. ఈ సైన్యాలు ప్రాణాలకు తెగించి పోరాడి, ఆదిలో కొన్ని ఘనవిజయాలను సాధించాయి. కాని, రానురాను అమెరికనుల ఆయుధబల సంపత్తికి తటుకోవడం కష్టమైపోయింది. సంకల్పం వజ్రసన్నిభమైనదైనా కాయం రక్తమాంసాలతో కూడిందే. ఉక్కుగుండె ఉక్కుటాంకుకు ఉజ్జీకాలేదు. ధైర్యం కోటగావున్నా, అది గాలికోట విమానానికి ఈడురాలేదు. లక్షయోధులైనా నూరు భారీఫిరంగులపెట్టు కాలేరు. ఈ కారణానే కొరియాకు పెకింగ్ ఎంత హెచ్చుగా తన సైనికులను పంపివున్నా, వారెంతగా ప్రాణాలకు తెగించి పోరాడుతున్నా, పరాజయపరంపర తప్పడంలేదు. పోయిన పక్షంరోజుల పోరులో వేలాదిగా చైనాసైనికులు దుర్మరణంచెందినట్లు వార్తలు వచ్చినవి. తమ ఉద్దేశాలు సఫలంచెందినట్టు అమెరికనులు చంకలు గుద్దుకొంటున్నారు. ఉత్తరకొరియనుల పీనుగలు గుట్టలాదిగా పడివుండడాన్ని చూచి ఆ దృశ్యం తన ముసలికళ్లకు మహచల్లగావున్నదని మెకార్థర్ అన్నట్లు రెండు, మూడు నెలలనాడు వార్త పొక్కగా, అది పచ్చి అబద్ధమని అమెరికనులన్నారు. కాని, ఫిబ్రవరి 20వ తేదీ "న్యూయార్క్ టైమ్స్" పత్రిక "ఇంటర్‌నేషనల్ ఎడిషన్" 2-వ పేజీని చూస్తే, కొరియాలోని అమెరికన్ అష్టమసైన్యాన్ని నడిపిస్తున్న లెఫ్టినెంట్-జనరల్ మాథ్యూ బి. రిడ్జివే గుట్టమిట్టలుగా పడివున్న చైనీస్ సైనికుల శవాలను చూచి, ఆ దృశ్యం మనోజ్ఞమైందిగా వున్నటు అన్నాడని స్పష్టంగా వ్రాసివున్నటు కనబడుతుంది. తాము కొరియాలో కొనసాగిస్తున్న చిత్రవధకు అమెరికనులు ఎంతగా సంతసిస్తున్నదీ దీనినుంచి స్పష్టం. అసలు కొరియా యుద్ధలక్ష్యమే చైనాసైన్యాలను "నమలివెయ్యడ"మని అమెరికన్ పత్రికలు వ్రాస్తున్నవి. ఈ మాటనే కొందరు అమెరికన్ రాజకీయవేత్తలుకూడా చెబుతున్నారు. అయితే, తమ కడుపునిండినట్లు వారు సంతృప్తిచెందగలవరకు ఈ నమలితినడాన్ని చైనా సహించ

పోతున్నదా? ఒకవేళ చైనా ఈ విషయంలో నిస్సహాయస్థితిలోపడినా, రష్యా మిన్నకుండ గలదా? ఇప్పటికే చైనా సహాయార్థం టాంకులు, భారీఫిరంగులు వగైరాలను మాస్కో పంచివుండకపోతే, ఇక ముందైనా వాటిని ఉరికించబోదా?

పరోక్షంగా, లేదా, ప్రత్యక్షంగానేకూడా, కొరియా యుద్ధంలో సోవియెట్ జోక్యంమాట ఏమైనా, చైనాకున్న అంగబలం అంతులేనిది. ఇటీవల దాని సేనానులు తొందరపడినటు ఎదురుముట్టడులకు తొందరపడక, కొరియా కొండలను చాటుచేసుకుని, గెరిల్లా యుద్ధాన్ని కొనసాగి స్తే విశేషవష్టాలను తాము పొందకుండా పదేళ్ళవరకైనా పోరాడి, చైనా అమెరి కనులను ముప్పతిప్పలుపెట్టి మూడుచెరువుల నీళ్ళను త్రాగించగలదు. ఇందువల్ల నేటికైనా కొరియా వ్యవహారాన్ని రాజీపద్ధతివి పరిష్కరించుకోవడమే మేలుకాగలదని పెక్కుమంది నమ్ముతున్నారు. బ్రిటిష్‌ప్రభుత్వం విశ్వాసం సయితం ఇంతే. విన్న (ఫిబ్రవరి 28 వ తేదీని) మిత్రరాజ్యసమితి కొత్త మధ్యవర్తి సంఘంతో సహకరించవలసిందిగా పెకింగ్ ప్రభుత్వానికి బ్రిటన్ విజ్ఞప్తిచేసింది. ఈ కొత్త మధ్యవర్తి సంఘంకూడా—మిత్రరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు, ఇరాన్ ప్రతినిధి మిస్టర్ ఎంటెకామ్ ఈ కొత్త మధ్యవర్తి సంఘం అధ్యక్షుడు; మెక్సికో ప్రతినిధి డాక్టర్ పాడిల్లానెర్వో, స్వీడన్ ప్రతినిధి మిస్టర్ గ్రాఫ్‌స్ట్రామ్ దీనిలో సభ్యులు—ఫిబ్రవరి 28 వ తేదిని ఒక జనాంతిక సమావేశం జరిపి, పెకింగ్‌కు ఏవో కొన్ని రాజీ ప్రతిపాదనలు చేసినట్టుకూడా వినికిడి. కొరియాలో దురాక్రమణ పరాయణత్వాన్ని ప్రదర్శించినటు పెకింగ్‌ను మిత్రరాజ్యసమితిలో ఖండించిన పిమ్మట కొత్త రాజీప్రతిపాద నలకు పెకింగ్ ఎంతవరకు సమ్మతిస్తుందో సందేహాస్పదమే. అయితే, రెండు కారణాలపై పరిష్కారానికి అవకాశలదేమోనని ఇప్పటికి భావిస్తున్నట్టున్నారు. వీటిలో మొదటిది, ప్రస్తుతం తమదే పైచెయ్యిగావున్నా, కొరియాలో 38 వ అక్షాంశ రేఖను తిరిగి దాటడం, దాటకపోవడం ఆరంగంలో ఆధిపత్యం వహిస్తున్న సైన్యాధ్యక్షుడు నిర్ణయించవలసిన విషయమని ప్రెసి డెంట్ ట్రూమన్ చెప్పినా, రాజకీయ కారణాలవల్ల దాటకపోవడమే మేలైతే తాను తొందర పడబోనని మెకార్థర్ చెప్పడం. రెండవది, కొరియాలో తాము గట్టిదెబ్బలను కొన్నింటిని తిన్నందున పెకింగ్ పట్టుదల కొంత సడలగలదన్న అంచనా. ఏమైనా. కొరియా యుద్ధమే కాక, కొరియా సమస్యకూడా "నానుడు వ్యాపారం" కిందికి దిగింది. ఇది ఎలా పరిణమించ నున్నదో చెప్పడం సాహసం కాగలదు.

కొరియాసమస్య "నానుడువ్యాపారం" కాగా, జర్మనీ, జపానులు తిరిగి ముగ్గులోకి వచ్చాయి. అట్లాంటిక్ రాజ్యాలకూటమిని ఏర్పరచడంతో సంతృప్తిచెందక పశ్చిమయూరప్

సైన్యనిర్మాణ సన్నాహాలను అమెరికా పూర్తిచేసింది. ప్రస్తుతం సోవియెట్ రష్యాలో యూరోపియన్ ప్రాంతానికి, సోవియట్‌కూటమిలోని యూరోపియన్ రాజ్యాలకుచేరి ఇంచుమించు 160 డివిజనుల సైన్యంవున్నదని అంచనా వేస్తున్నారు. (ఒక డివిజన్‌లో దాదాపు 16,000 మంది సైనికులుంటారు.) కాగా, ప్రస్తుతం అట్లాంటిక్ కూటమిలోని యూరోపియన్ రాజ్యాలకున్న సైన్యం 12 డివిజనులు మాత్రం వున్నవట. ఈ రాజ్యాలు సాధ్యమైనంత త్వరలో మరొక 75 డివిజనుల సైన్యాన్ని కూర్చుకొనడానికి ప్రస్తుతం చురుకుగా ప్రయత్నాలు జరుగుతున్నవి. అట్లాంటిక్ కూటమిలో చేరకపోయినా, ఆకూటమి రాజ్యాలకు సుముఖంగా వున్నవాటికి ఈనాడు షుమారు 100 డివిజనుల సైన్యంకలదట. ఈ బాపతురాజ్యాలు టర్కీ, గ్రీసు, యుగోస్లావియా, స్పెయిన్‌లు. అట్లాంటిక్ కూటమిలో పేరుకు చేరకపోయినా, గ్రీసు టర్కీలు అమెరికా కనుసన్నల మెలగుతున్నవే. గ్రీసుకు ఎనిమిది, టర్కీకి 30 డివిజనుల సైన్యం కలదట. ఈ 38 డివిజనుల సైన్యం అట్లాంటిక్ కూటమిదేనని మనం భావించవచ్చు. పోతే, యూగోస్లావియాకు 32 డివిజనుల సైన్యం వున్నది. బెల్‌గ్రేడ్, మాస్కోలకు ప్రస్తుతం బద్ధవైరంగా వున్నందున, టిటోను సమర్థించి, అతడి 32 డివిజనుల సైన్యాన్నికూడా తమది చేసుకోడానికి అట్లాంటిక్ కూటమిరాజ్యాలు శతవిధాల ప్రయత్నంచేస్తున్నవి. యూగోస్లావియాకు అమెరికా ఇప్పటికే విశేషంగా ఆర్థికసహాయంచేసింది; ఇంకా చేస్తుంది. యూగోస్లావియాపై రష్యాకాని, దాని ఉపగ్రహరాజ్యాలుకాని ముట్టడి జరిపితే తాము మిన్నకుండమని అమెరికన్ ప్రభుత్వం హెచ్చరించింది. బ్రిటిష్ ప్రభుత్వంపక్షాన ఈ మధ్య కామన్సులో విదేశాంగ వ్యవహారాలపై చర్చజరిగిన సందర్భంలో కార్మికమంత్రి మిస్టర్ బెవాన్ ఇట్టి హెచ్చరికనే చేశారు. అయితే, బహిరంగంగా అట్లాంటిక్ కూటమితో చేరడం సోవియెట్‌కూటమితో కయ్యాన్ని ఆహ్వానించడమే కాగలదని మార్షల్ టిటో అందుకు సంకోచిస్తున్నాడు. ఇక, స్పెయిన్‌కు 30 డివిజనుల సైన్యంవున్నది. స్పెయిన్ పరిపాలకుడు జనరల్ ఫ్రాంకో పచ్చిఫాసిస్టు. సోవియెట్ కూటమికి వ్యతిరేకంగా అతడిని ఇతరు లెవ్వరు నిలబెట్టనక్కరలేదు; తానై నిలవబడగలడు. అతడి 30 డివిజనుల సైన్యం ఏనాడు కోరితే ఆనాడే అట్లాంటిక్ కూటమిది. కాని, పోయిన యుద్ధంలో అతడు హిట్లర్, ముసొలినీలపట్ల పక్షపాతం వహించినవాడు కనుక, అతడిని ఇంతవరకు వెలివెయ్యడం తటస్థించింది. ఆ వెలిని రద్దుచేసి, అతడిని తన నీడక్రిందకు తీసుకోడానికి ఇప్పుడు అమెరికా విశేషంగా ప్రయత్నిస్తున్నది. అతడి ప్రభుత్వానికి అమెరికా విశేషంగా అప్పుపెట్టింది. అతడి రాజధానికి తన రాయబారిని పంపించింది. అతడికి మిత్రరాజ్యసమితిలో స్థానమిప్పించడానికి పూనిక

చూపుతున్నది. బ్రిటన్, ఫ్రాన్సులు ఫ్రాంకోను ఇంకా క్షమించలేకుండా వుండబట్టిగాని, ఈసరికి ఫాసిస్టుస్పెయిన్‌కు అట్లాంటిక్ కూటమిలో సభ్యత్వం లభించివుండేదే! కొంత విరామం తప్పకపోయినా, ఈవిషయంలో చివరికి అమెరికా పంతమే నెగ్గవచ్చు. గ్రీసు, టర్కీ, యూగోస్లావియాల నూరు డివిజనులసైన్యం అట్లాంటిక్ కూటమిదేనని భావిస్తే, ఇప్పటికే దాని మొత్తంసైన్యం 112 డివిజనులు. దీనికి అవి త్వరలో నిర్మించుకోనున్న 75 డివిజనుల సైన్యాన్నికూడా కలిపితే, మొత్తం 187 డివిజనులు. అప్పటికి అది సోవియెట్ కూటమి యూరోపియన్ సైన్యానికి ఏమాత్రమో హెచ్చే కాగలదు.

అయితే, ఇంతమాత్రంతో తృప్తిపడక పశ్చిమ జర్మనీలో సైన్యాలను కూర్చుకోడానికి అట్లాంటిక్‌కూటమి రాజ్యాలు (కొంత భయసంకోచాలను వెలిబుచ్చుతున్న ఒక్క ఫ్రాన్సువినా) పట్టుదల చూపుతున్నవి. ఆయుధోత్పత్తికి సంబంధించి జర్మనీపై విధించబడిన నిషేధాలను కొన్నింటిని పాశ్చాత్యరాజ్యాలు అప్పుడే సడలించాయి. ఖైదులోనున్న నాజీసైన్యాలను, హిట్లర్‌కు పూర్తిగా తోడ్పడిన జర్మన్ పారిశ్రామిక ప్రముఖులను కొందరిని విడుదల చేయడంకూడా జరిగింది. ఇంతేకాక, పశ్చిమ యూరోపియన్ సర్వసైన్యాధ్యక్షుడుగా జనరల్ ఐసెన్‌హోవర్ నియామకం జరిగింది. ఆయన ప్రధాన కార్యస్థానసంస్థాపన కార్యకలాపం సమాప్తిచెందింది. అట్లాంటిక్‌కూటమి నౌకాదళాల సర్వాధిపతిగా ఒక అమెరికన్ అడ్మిరలును, విలియం యం. ఫెచ్‌టెలర్‌ను, నియమించారు. ఈ నియామకాన్ని మిస్టర్ చర్చిల్, ఆయన పక్షంవారు మాత్రమే కాకుండా కొందరు లేబర్‌పార్టీ వారుకూడా బ్రిటిష్ కామన్సు సభలో తీవ్రంగా ఖండించగా, నౌకాదళాధిపత్యానికి సంబంధించినంతవరకు అట్లాంటిక్ ప్రాంతాన్ని రెండుగా చీల్చి, బ్రిటిష్‌దీవుల తీరాలను, పశ్చిమయూరప్ తీరాలను, మెడిటరేనియన్ తీరాలను బ్రిటిష్ అడ్మిరల్ ఆధిపత్యంకింద పెట్టడానికి అంగీకరించినా, మొత్తం అట్లాంటిక్‌కూటమి నౌకాబలాలపై పెత్తనం అమెరికన్ అడ్మిరల్‌దే కావలెనన్నారు. (అమెరికా ధాటి ముందు రానురాను "తద్దినంపెట్టేవాని తమ్ముడి"స్థితికి బ్రిటన్ దిగజారిపోవడానికి ఇది మరొక తార్కాణం.) ఈ విధంగా పాశ్చాత్యరాజ్యాలు పునరాయుధధారణసన్నాహాలను విశేషంగా—త్వరితంగా—చేస్తుండగా సోవియెట్ రష్యా మిన్నకుండలేదు కాబట్టి, అది తన ఆక్షేపణ తెలపడమే కాకుండా, జర్మనీ, ఆస్ట్రియా సమస్యలను గురించి చర్చించడానికి అగ్రరాజ్యచతుష్టయ విదేశాంగమంత్రుల సమావేశం జరగాలని ప్రతిపాదించింది. ఈ విషయమై ఆరోపణలు, ప్రత్యారోపణలు జరిగిన పిమ్మట, ప్రతిపాదనలు, ఎదురు ప్రతిపాదనలు కొనసాగిన పిమ్మట చివరికి సమావేశం జరగాలనే నిర్ణయానికి వచ్చారు. ఎజెండాను

గురించి తుదినిర్ణయాల నిమిత్తం అగ్రరాజ్యాల విదేశాంగమంత్రుల డిప్యూటీలు మార్చి 5-వ తేదీని పారిస్‌లో సమావేశం కానున్నారు.

అగ్రరాజ్యచతుష్టయ విదేశాంగమంత్రుల సమావేశం విషయమై ఒకవైపున తర్జనభర్జనలు జరుగుతుండగానే యుద్ధానికి కాలుదువ్వుతున్నవని పాశ్చాత్యరాజ్యాలను, ప్రత్యేకించి బ్రిటన్‌ను, అందులో విశేషించి బ్రిటిష్ ప్రధాని మిస్టర్ అట్లీని, మార్షల్ స్టాలిన్ దుయ్యబట్టాడు. గతయుద్ధానంతరం సోవియెట్ రష్యా తన సాయుధబలాలను తగ్గించనేలేదని అట్లీ చేసిన విమర్శ సత్యదూరమైందని స్టాలిన్ పేర్కొన్నాడు. తాము సైనికబలనిర్మాణంలో నిమగ్నమైవుండడమే నిజమైతే, పెద్దపెద్ద ప్రాజెక్టులను పూర్తిచేయడం, పరిశ్రమలను పునరుద్ధరించడం, ధరలను తగ్గించడం, ఒక్కమాటలో, జాతీయపునర్నిర్మాణాన్ని సాధించడం ఏ విధంగా సాధ్యపడేదని ప్రశ్నించాడు. యుద్ధసన్నాహాలను, జాతీయపునర్నిర్మాణ కార్యక్రమాన్ని ఒకే సమయంలో ఏ దేశమైనా సాధించగలదని అట్లీ చాటిస్తే, అది ఆర్థిక శాస్త్రపరిజ్ఞానం ఆవంతైనా లేకపోయినందునే అని వ్యక్తిగత విమర్శ చేశాడు. ఇంతటితోనైనా ఆగక, అట్లీని యుద్ధోన్మాదిగా పేర్కొని వ్యక్తిగతసాధనకుకూడా దిగినాడు.

యుద్ధం ముగిసినంతనే సోవియెట్ రష్యా మరొక పంచవర్షప్రణాళికను ప్రారంభించి, దాన్ని 1950 నాటికి జయప్రదంగా సమాప్తిచేసిన మాట నిజం. ఈ అయిదేళ్లలో పునరుద్ధరించబడిన, లేదా, నూతనంగా సంస్థాపించబడిన పారిశ్రామికసంస్థలు దాదాపు 6,000. యుద్ధానికి పూర్వం ఉత్పత్తిచేసిన ప్రతి 100 టన్నుల ముడియినుముకు ఇప్పుడు సోవియెట్ రష్యా 128 టన్నులను తయారుచేస్తున్నది. ఇదే విధంగా అప్పటి ప్రతి 100 టన్నుల ఉక్కుకు ఇప్పుడు 148 టన్నులు, అప్పటి ప్రతి 100 టన్నుల బొగ్గుకు ఇప్పుడు 157 టన్నులు, అప్పటి ప్రతి 100 టన్నుల పెట్రోల్‌కు ఇప్పుడు 121 టన్నులు ఉత్పత్తిచేస్తున్నది. యుద్ధాత్పూర్వంకంటె ఇప్పుడు సోవియెట్ పవర్‌స్టేషన్‌లు నూటికి 87 వంతులు హెచ్చు పవర్‌ను సప్లయిచేయగలుగుతున్నవి. యంత్రాలను సిద్ధపరచే యంత్రాగారాలలోని ఉత్పత్తి నూటికి 120 రెట్లు పెరిగిపోయింది. ధాన్యోత్పత్తికూడా ఇంత విశేషంగానూ హెచ్చింది. సర్వతోముఖమైన ఈ జాతీయజీవన పునర్నిర్మాణకార్యక్రమం యుద్ధసన్నాహాలతోపాటు కొనసాగడానికి వీలులేదనడం నిర్వివాదమైనా, సాయుధబలాలకు సంబంధించినంతవరకు యూరప్‌ఖండానికి సంబంధించినంతవరకు ఎంతో కొంత సోవియెట్ రష్యాచెయ్యే ప్రస్తుతం పైదిగావున్నదనడంలో సందేహంలేదు. సోవియెట్ రష్యా సైనికపాటవంకంటెకూడా అన్యదేశాల ఆర్థిక, సాంఘిక, రాజకీయవ్యవస్థలలోని బలహీనాలను ఆసరాచేసుకుని, వాటిలో

ఆంతరంగిక విప్లవాలను రెచ్చగొట్టడంలో రష్యాప్రజ్ఞ పాశ్చాత్యరాజ్యాలకు ఎక్కువ బెదురు పుట్టిస్తున్నదనికూడా చెప్పవచ్చు. ఇంతేకాక, ప్రపంచయుద్ధంవల్ల విశేషంగా లాభాలను పొంది, మరింత కోటీశ్వరులుకాగల వర్గాలవారు ఆంగ్లో-అమెరికన్ రాజ్యాలలో కలరని స్టాలిన్ చేసిన నింద నిరాధారమైందని త్రోసిపుచ్చడానికి వీలులేదు. ఈ అన్ని విషయాలను అంగీకరించినా, మార్షల్ స్టాలిన్ వినియోగించిన పరుషమైన భాష—ముఖ్యంగా ఆయన చేసిన వ్యక్తిగతనింద—ఎంతమాత్రం హర్షనీయంకాదు. ప్రపంచయుద్ధ నివారణబాధ్యత ప్రస్తుతం ప్రపంచ ప్రజలపైకలదని చెప్పిన స్టాలిన్ కనీనం ఒకదేశ ప్రజలను (బ్రిటన్)వారి నాయకుని (అట్లీ) నిందించడంద్వారా తనకు విముఖులను చేసుకున్నాడు.

స్టాలిన్ అనవసరంగా నోరు పారవేసుకున్నమీదటకూడా బ్రిటిష్‌ప్రభుత్వం రాయబారాల ద్వారా ప్రపంచసమస్యల పరిష్కారానికి ఆతురతను కనబరుస్తున్నది. ఇది ముదావహం. జర్మనీ, ఆస్ట్రియాల భవితవ్యం రాయబారాలద్వారా పరిష్కారం కాగలపక్షంలో త్వరలో జరగనున్న అగ్రరాజ్య చతుష్టయ సమావేశం జయప్రదంకావడానికి తాను చేయగల సమస్తాన్నీ బ్రిటన్ చేస్తుందనే ఆశించవచ్చు. ఆస్ట్రియాతో శాంతి సంధివిషయమే ఇది వరలో ఒకసారి అగ్రరాజ్యచతుష్టయంమధ్య ఒడంబడిక కుదిరినట్టే చెప్పబడింది. అయితే, చివరిక్షణంలో ఏవోకొన్ని "టెక్నికల్" పేచీలువచ్చి సంతకాలు జరగలేదు. ఇందువల్ల ఉభయపక్షాలు పరిష్కారకాంక్షను ఏమాత్రం కనబరచినా, అది ఒక క్లిష్టసమస్య కానేకాదు. పోతే, జర్మనీ విషయంలోనే ఉభయులు పట్టుకంటె విడుపును ఎక్కువగా కనబరచాలి. మొన్నటి తన ప్రకటనలో మార్షల్ స్టాలిన్ జర్మనీ ఊసునైనా తీసుకురాకపోయినా, పశ్చిమ జర్మనీని తిరిగి సాయుధం చేయడానికి పాశ్చాత్య రాజ్యాలుచేస్తున్న సన్నాహాలే ఆయనకు అంతగా మితిమీరిన కోపాన్ని తెప్పించివుండాలి. తూర్పు జర్మనీలో పోలీసుల దళాలపేరుతో రష్యా దాదాపు లక్షమంది సైనికులను సమాయత్తపరిచిందని పాశ్చాత్యరాజ్యాలు ఆరోపిస్తున్నవి. ఈదళాలను నిరాయుధంచేయడానికి రష్యనులు సమ్మతించగల పక్షంలో పశ్చిమ యూరప్ రక్షణకు పశ్చిమ జర్మన్‌సైన్యాలను సన్నద్ధపరచడాన్ని పాశ్చాత్యరాజ్యాలు విరమించవచ్చు. ఆతర్వాత మొత్తం జర్మనీలో దాని భవితవ్య నిర్ణయానికి స్వేచ్ఛాపూర్వకంగా ఎన్నికలు జరిపించడంవిషయమై ఒక ఒడంబడిక కుదుర్చుకోవలసి వుంటుంది. ఈవిధంగా పేర్కొన్నప్పుడు సమస్య నాతిక్లిష్టమైందిగా కనబడినా, ప్రస్తుత వాతావరణాన్నిబట్టి అగ్ర రాజ్య చతుష్టయ విదేశాంగ సభ జయప్రదంకావడం సందేహాస్పదం.

*　　　*　　　*

యూరప్‌లో పశ్చిమ జర్మనీని సాయుధంచేయడానికి చూపుతున్న పట్టుదలనే దూర ప్రాచ్యంలో జపాన్ విషయమై అమెరికా చూపుతున్నది.

జపానుకులేని తొందరను ఈవిషయంలో అమెరికా చూపుతున్నదన్నప్పటికీ తప్పులేదు. ఇంకా పెక్కుమంది జపానువారు రష్యనులచేతిలో యుద్ధఖైదీలుగా వున్నారనీ, తాము తిరిగి ఆయుధధారణకు ఇప్పుడే పూనుకున్న పక్షంలో జాపనీస్ యుద్ధఖైదీలపై రష్యనులు తమ కసి తీర్చుకోవచ్చుననీ, ఏమైనా పునరాయుధాధారణపై జపాన్‌ప్రజలలో తీవ్రవిభేదాభిప్రాయాలు కలవనీ, ఈ కారణాలవల్ల, ఇతర కారణాలవల్ల ఇప్పటిలో పునరాయుధాధారణను, తాను వ్యతిరేకిస్తున్నాననీ ఈమధ్యకూడా జపాన్ ప్రధాని యోషిడా స్పష్టంగా ప్రకటించారు. అయినా, అమెరికామాత్రం జపాన్ చేతిలో తిరిగి ఎప్పుడు కత్తిపెట్టడమా అని తహతహలాడుతున్నది.

జపాన్‌ను తిరిగి సాయుధంగా చేయడం విషయమై విభిన్నాభిప్రాయాలున్నా (చైనా, రష్యాలేకాక, ఒకసారి జపాన్ చేతిలో దెబ్బతినివున్న ఆస్ట్రేలియా, న్యూజిలెండ్‌లుకూడా ఇందుకు విముఖంగావున్నాయి) జపాన్‌తో శాంతిసంధి త్వరలోనే జరగాలన్న విషయమై భేదాభిప్రాయం దాదాపు లేదనే చెప్పాలి. ఇంకా కొంతకాలంపాటు జపాన్ అమెరికాసేనల ఆక్రమణకిందనేవుంటే, అక్కడ కమ్యూనిజం తలయెత్తగల ప్రమాదం స్థిరమని కొందరి నమ్మకం. ఎన్నటికైనా జపాన్ వ్యాపారంవల్ల బ్రతకవలసిన దేశమే. అందువల్ల దానితో వెంటనే ఒక సంధిని చేసుకుని, యుద్ధాంతరపరిశ్రమలను అది పూర్తిగా పెంపొందించుకొనడానికేమి, వాణిజ్యనౌకాదళాన్ని తిరిగి కూర్చుకొనడానికేమి అవకాశమివ్వాలని అందరి నమ్మకం. ఏమైనా జపాన్‌తో యుద్ధం ముగిసి అయిదేళ్లు దాటినవి. అందువల్ల దానితో శాంతి సంధిని ఇంకా విలంబన చెయ్యడం భావ్యంకాదు.

జపాన్‌తో శాంతిసంధి జరగాలంటే, శాంతిసంధి సమావేశం జరగాలి. ఈ సమావేశం విషయమై ఇదివరకే ఒక ఒడంబడిక కుదరలేదు. ఈ సమావేశాన్ని పిలవడం విషయమై బ్రిటన్, అమెరికా, చైనా, సోవియెట్ రష్యా విదేశాంగమంత్రులు మున్ముందుగా చర్చలు జరపాలని మాస్కో పట్టుదల చూపింది. అమెరికా ఇందుకు ససేమిరా అంగీకరించలేదు. జపాన్‌పై యుద్ధంలో పాల్గొన్న మిత్రరాజ్యాలన్నింటితో కూడిన ఒక సంస్థ—దూరప్రాచ్య సంఘం—వున్నది. ఈ సంఘంలో జపాన్‌తో శాంతిసంధికి సంబంధించిన సమావేశంపై తొలిచర్చలు జరగవచ్చునని అమెరికా వాదం. అయితే, ఈ ప్రాథమికసమావేశం దూరప్రాచ్యసంఘం హోదాతో జరగరాదనికూడా దాని పట్టుదల. అగ్రరాజ్యచతుష్టయాని కేమి (దూరప్రాచ్యానికి సంబంధించినంతవరకు ఫ్రాన్సును తగ్గించి, చైనాను ఈ చతుష్టయంలో

చేర్చుకోవాలి) దూరప్రాచ్యసంఘానికేమి వీటో అధికారంవున్నది. అంటే, మెజారిటీ ప్రకారం నిర్ణయాలు చెయ్యడానికి వీలులేదు. ఏ ఒక్క రాజ్యమైనా తక్కినవాటి నిర్ణయం చెల్లరాదనవచ్చు. ఇందువల్లనే దూరప్రాచ్యసంఘంలో ఆ హోదాలేకుండా (అనగా, వీటో అధికారం దానికిలేకుండా) జపాన్‌తో శాంతిసంధి సమావేశాన్ని గురించి చర్చించాలని అమెరికా పట్టుదల. ఇదివరకే ఇది తెగనిసమస్యకాగా ఇప్పుడు మరింత క్లిష్టమైపోయింది. ప్రస్తుతం ఒక చైనాకాక రెండు (కమ్యూనిస్ట్ చైనా, నేషనలిస్ట్ చైనా) వున్నాయి. ఇంతేకాక, కొత్తచైనాను, బర్మా, పాకిస్థాన్‌లను కలుపుకుని దూరప్రాచ్యసంఘ సభ్యులసంఖ్య పదకొండునుంచి పద్నాలుగు పెరిగింది. అయితే, కొత్తచైనాకు మిత్రరాజ్యసమితిలోనే సభ్యత్వాన్ని నిరాకరించిన అమెరికా దూరప్రాచ్యసంఘంలో దానికి స్థానమివ్వడంవల్ల, ఈ పరిస్థితిలో జపాన్‌తో శాంతిసంధి సమష్టిగా పొసగడం దుర్ఘటం. అక్కడ తిష్ఠవేసివున్న కారణాన జపాన్‌లో తనకుగల పైచేతిని పురస్కరించుకుని దానితో అమెరికా విడిగానే (అంటే, చైనా, రష్యాలను విడదొక్కి) సంధిచేసుకోడానికి ఆయత్తపడుతున్నది.

ప్రెసిడెంట్ ట్రూమన్ ప్రత్యేక ప్రతినిధిగా అమెరికన్ రిపబ్లికన్ పార్టీలో ప్రముఖుడు మిస్టర్ డల్స్ టోకియోకు, కాన్‌బెర్రాకువెళ్ళి, జపాన్‌తో శాంతిసంధి విషయమై మంతనాలు జరిపి, వారంరోజుల ఈమధ్య తిరిగి వాషింగ్టన్ చేరుకున్నాడు. జపాన్‌ను తిరిగి సాయుధం చేయడంవిషయమై ఆస్ట్రేలియా, న్యూజిలెండ్‌ల భయసందేహాలను నివారించడానికి ఆయన కాన్‌బెర్రాకు వెళ్ళివుండాలి. ఆ రెండు రాజ్యాలకు అభయమివ్వడానికికాబోలు, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలెండ్‌లమధ్య—బహుశా ఫిలిప్పీన్స్‌నుకూడా కలుపుకొని—పసిఫిక్ సంధి జరగవచ్చునని డల్స్ సూచించినట్టున్నారు. ఏమైనా జపాన్‌తో శాంతిసంధి అనుకున్న దానికంటె బహూ త్వరితంగా జరగనున్నట్టు వాషింగ్టన్ వార్తలు సూచిస్తున్నాయి. ఇంతే జరిగితే, దూరప్రాచ్య సమస్యలు మరింత తీవ్రస్వరూపాన్నిధరించి, తృతీయ ప్రపంచ యుద్ధాన్ని మరింత అనివార్యంచెయ్యగలవు. (1-3-'51)



# శ్రద్ధాంజలి

విజ్ఞాననిధి, పండితప్రకాండుడు, రసజ్ఞశేఖరుడు, సాహిత్యోపాసకుడు, కళాకోవిదుడు డాక్టర్ కట్టమంచి రామలింగా రెడ్డిగారు 70-వ ఏట చెన్నపురిలో కన్నుమూశారు.

వీరి నిర్యాణం ఆంధ్రదేశానికే గాక, సమస్త భారతావనికి తీరనిలోటు.

కాని, సామాన్య ప్రజలలో సానుభూతి తప్ప, ఆవేదన కానరాదు. దీనికి కారణం రెడ్డిగారు సామాన్య ప్రజలకు సన్నిహితుడు కాకపోవడమే.

ప్రజలతో కలసి మెలగుతూ, వారి కష్టసుఖాలను పంచుకొంటూ, వారి శ్రేయస్సుకు

## స్వర్గీయ కట్టమంచి రామలింగారెడ్డి

జననం :

1880

★

నిర్యాణం :

1951

★



పాటుపడి సౌఖ్యాన్ని త్యాగంచేస్తూవుండే రాజకీయ నాయకులకు మాత్రమే వారి ప్రేమాభిమానాలను పొందడం సాధ్యం.


సర్వదా భవిష్యత్తునే చూస్తూ, తాత్కాలిక సుఖదుఃఖాలను లాభనష్టాలను, కీర్తి ప్రతిష్ఠలను లక్ష్య పెట్టక, శాశ్వతం, సౌఖ్యప్రదం, అభ్యుదయకరం కాగల మార్గాల అన్వేషణలోనే సతమత మవుతూ తా నెవరి ఉద్ధరణకై ఆరాట పడుతున్నాడో, అట్టి ప్రజల మన్ననలనుకూడా పొందజాలక పోవడం విజ్ఞానధనులకు సహజం. కొన్ని యుగాల తరువాత ఆ మహనీయుల కృషి ఫలితాలను అనుభవిస్తూ ఆ విజ్ఞానధనులను ఆరాధించడం ప్రపంచానికిసహజం.

రాజకీయవేత్తగా మనలేకపోవడానికి, రెడ్డిగారు విజ్ఞాననిధి కావడమే కారణం. సమకాలీనులు ఊహించని దానిని లక్షించి, దాని సాధనకై తపించేవారు కనుకనే తనతరం వారి ఆదరాన్ని పొందతగినంత ఎక్కువగా రెడ్డిగారు పొందలేకపోయారు.

ఆయనలో మూర్తీభవించి వున్న రసజ్ఞతకు, సాహిత్యపిపాసకు, కళావైదగ్ధ్యానికి ప్రతిచిహ్నమే ఆంధ్ర విశ్వకళా పరిషత్తు. మైసూరు విశ్వవిద్యాలయమూ ఆయన కృషివల్లనే ఉద్భవించి, నేటికి సర్వ స్వతంత్ర సంస్థగా వెలయగలిగింది.

మహాపురుషులు గతించినంతనే వారి స్మారక చిహ్నాల నిర్మాణానికి కృషి ప్రారంభించి, విరమించి, వర్ధంతులలో ఆ ప్రసక్తిని తెస్తూ వుండడం మనకు పరిపాటి. ఈ కష్టాన్నికూడా మనకు ఇవ్వకుండా తనకుతానే శాశ్వతచిహ్నాన్ని రెడ్డిగారు రూపొందించుకున్నారు. అదే ఆంధ్ర విశ్వ విద్యాలయం. రెడ్డిగారి స్మృతి చిహ్నంగా మనం దానిని కాపాడుకొన గలిగితే అదేపదివేలు!

అమరజీవి రెడ్డిగారి కిదే మా శ్రద్ధాంజలి.




[గతసంచిక తరువాయి]

## పదమూడో ప్రకరణం

శేషగిరి మామయ్య వచ్చాడు. ఆయన వేషమంతా మారిపోయింది. మామూలుగా ఉండే ఉద్యోగి అవతారమే లేదు. ముతకఖద్దరు బట్టలు వేసుకున్నాడు.

"ఉద్యోగం మానేశానమ్మా!" అన్నాడు శేషగిరి సీతమ్మగారితో.

"అయ్యో అదేమిట్రా?" అన్నదావిడ.

"ఆఁ, ఎవరుచేస్తారు బాడఖోపని? దేశంకన్నానా? అందుట్లోనూ గవర్నమెంటు ఉద్యోగం!"

"అందరూ చెయ్యటంలా? కాక పోయినా స్వరాజ్యం అయిపోయిందిటగా?" అన్నది సీతమ్మగారు.

శేషగిరి పెద్దగా నవ్వి, "స్వరాజ్యం అయిపోవటమేమిటి? అది వచ్చేదాకా ఈ కొరివి చల్లారుతుందా? రావణాసుడి కాష్టంకాదూ? అదేమో నిమిషాలమీద వచ్చేదనుకున్నవాళ్లు జావకారిపోయారు గాని ఈ ఉద్యమం అయిపోవటమంటూ ఉండదు. ఇక ముందు దేశాన్ని ఎట్లా నడిపిస్తాడో ఆ మహాత్ముడిమీద ఆధార పడిఉంది. మనం ఆయన చెప్పినట్టు చెయ్యవలిసిందే," అన్నాడు.

"ఏముందీ చెయ్యటానికి?"

"ఏంలేకేం? ఇంటింటా రాటం తిరగాలి. ఊరూరా జాతీయవిద్యాలయాలు నడవాలి. అస్పృశ్యతపోవాలి. జనమంతా ఏకం కావాలి. నలభైకోట్ల గొంతులూ 'వందేమాతరం! మందే రాజ్యం!' అని అరిస్తే స్వరాజ్యం వస్తుందా, దానితల్లో జేజెకూడా వస్తుందా," అన్నాడు శేషగిరి.

ఆతరవాత తాను వచ్చినపనికూడా చెప్పాడు. ఇంకోవారంరోజుల్లో తానూ, మరికొందరూ చేరి జాతీయవిద్యాలయం నెలకొల్పుతున్నారు వాళ్ళఊళ్లో. దానికి సీతమ్మగారూ, పిల్లలూ రావాలి.

సీతమ్మగారు ముక్కుమీద వేలేసుకుంది. తన అన్న తన జీవితంలో ఎంత పెద్దమార్పు తెచ్చిపెట్టుకుంటున్నాడో ఆవిడకి కొంచెం కొంచెంగ అర్థం కాసాగింది. ఈ పరిణామం ఎక్కడికి దారితీసేదీ ఆమె ఊహించుకోలేకపోయింది. శేషగిరిఇల్లు దర్జాగా ఉద్యోగస్తుడి ఇల్లల్లే ఉండేది. ఆకళ ఇకముందుంటుందా? ఎట్లా ఉంటుంది?

ఎవరో శపించినట్టుగా ఆయన ఎందుకీ పనులు చేస్తున్నాడు?

డిసెంబరు శలవలు గనక సుందరం చదువు చెడుతుందన్న భయంలేదు. సీతమ్మగారూ, సుందరం, వాడి చెల్లెలు జానకీ కలిసి శేషగిరివెంట వెళ్ళారు.

సీతమ్మ పుట్టింటివారిగ్రామం చాలా చిన్నది. అంతాచేరి రెండొందలగడప. పెద్దకాలవకిందనే ఉన్నది గనక ఊరు చుట్టూ సుక్షేత్రమైన మాగాణీభూములు. ఊరికి నాలుగుమిద్దెలున్నాయి. మిగిలిన వాటిలో సగం పెంకుటిళ్లూ సగం పూరిళ్లూనూ. ఊరికితగ్గట్టు పశుసంపద కూడా ఉన్నది. సుభిక్షమైన గ్రామాల్లో ఇదొకటి. అయినప్పటికీ ఈ ఊరి కింత వరకు ఒక ఆసుపత్రిగాని, బడిగాని, లైబ్రరీగాని లేదు. ఇటీవలనే ఊరికి దినపత్రిక రావటం నలుగురూ జేరి పత్రికాపఠనంచెయ్యటం ప్రారంభమైంది.

సీతమ్మ పెత్తండ్రిగారు ఏనాడో ఒక సత్రం కట్టించాడు. కాని ఆ వూళ్లో సత్రం అటే ఉపయోగకరమైనదిగాదు. రహదారి ఊరికి అయిదారుఫర్లాంగుల దూరంలో ఉంది. దానినుంచి ఊళ్ళోకి ఒక కంకరరోడ్డు ఊళ్ళోవాళ్ళే వేసుకున్నారు. అది ఊళ్లోవాళ్ళకూ, వారిని వచ్చిచూసేవాళ్ళకూమాత్రమే ఉపయోగపడుతుంది. అందువల్ల సత్రానికి రాకిడేమీలేదు-ఎప్పుడన్నా పెళ్ళివిడిదిగా ఉపయోగపడటం తప్పిస్తే.

ఊరిమధ్య చెరువుగట్టునఉన్న ఈ సత్రంలో శేషగిరీ, ఊళ్ళోగల ఇతర విద్యావంతులూ, ధనవంతులైన ఆసాములూ చేరి ఒకలైబ్రరీ, జాతీయ విద్యాలయమూ పెట్టాలని నిర్ణయించారు. ప్రేరేపణ శేషగిరిదే. దీనికి ఊళ్లోఉన్న భజనమందిరంవాళ్ల అభ్యంతరం చెప్పారు. (వాళ్లు ప్రతి శనివారమూ అక్కడ భజనచేస్తూ ఉంటారు.) అయితే వాళ్ళ అభ్యంతరాలను పెద్దవాళ్ళు సాగనివ్వలేదు. భజనల మీద పెద్దవాళ్ళకు విశ్వాసంపోయింది. మామూలు మనుష్యులకు ఇంకా పోలేదు గనక, శనివారం శనివారం భజన సత్రంలో లైబ్రరీలోనే జరగవచ్చునన్నారు.

శేషగిరికిప్పుడు ఊళ్ళో మిద్దె తప్ప చెప్పుకునే సంపద అటే లేకపోయినప్పటికీ మూడుతరాలుగా వస్తున్న పెద్దరికానికి మాత్రం ఏలోపమూలేదు. అదివరకల్లా ఆయన ఎక్కడెక్కడో ఉద్యోగం చేసుకుంటుంటే పరాయివాణ్ణిగా భావించిన గ్రామస్థులు తిరిగి ఆయన గ్రామంలో కాపరం పెట్టగానే ఆప్తుణ్ణిగా స్వీకరించారు. శేషగిరి తమ గ్రామాన్ని ఎంతో పైకి తీసుకురానున్నాడని కూడా వాళ్లు అర్థంచేసుకున్నారు.

శేషగిరికి తోడుగా వకీలు సీతారామయ్య కూడా ఉన్నారు. జాతీయ విద్యాలయ స్థాపనకూ, లైబ్రరీకీ ఆయన కూడా అయిదువందలిచ్చాడు. సీతారామయ్యా ఈ గ్రామంవాడే. కాని ఆయన బస్తీలో ప్లీడరు వృత్తిలో పాతుకుపోయినాడు. శేషగిరితో కలిసి ఈ పని చేస్తున్న మిగిలిన నలుగురైదుగురూ గ్రామంలోని మోతుబర్లు. వాళ్ళు విద్యావంతులుకారు. శేషగిరి చెప్పిన

మాట శిరసావహించేవారే. అందుచేత ఈ ఉద్యమంలో శేషగిరి గ్రామానికి ఏకైకనాయకుడై పోయినాడు.

* * *

సుందరం ఈ గ్రామానికి వెనక ఒక్కసారే వచ్చాడు. అదికూడా చాలా చిన్నతనంలో. అయినా ఊరు కళ్ళకు కట్టినట్టే ఉంది. దీనికి కారణం ఇన్ని ఏళ్ళలోనూ గ్రామంలో ఆవగింజంతైనా మార్పు లేకపోవటమే.

శేషగిరి భార్య కామేశ్వరి జానకిని చూసి ముందు గుర్తు పట్టలేదు. తరవాత ఆశ్చర్యపోయి, "ఓసీ, ఎంత పెద్దదానివైనావే?" అన్నది. సుందరం కృష్ణవేణిని గుర్తించలేదు. తల్లిజ్ఞాపకం చేసిన తరవాత దాన్ని పలకరించటానికి కాస్సేపు బిడియపడ్డాడు.

"ఏం రా, నీ పెళ్లాన్ని చూసుకున్నావా?" అన్నది కామేశ్వరత్తయ్య.

"ఛా!" అన్నాడు సుందరం.

ఆ సమయంలో వాడికొక మాట జ్ఞాపకం వచ్చింది. తన క్లాసులో తన ఈడువాడే, పన్నెండో ఏడు జరుగుతున్నవాడు, ఒకడున్నాడు. వాడికప్పుడే పెళ్ళయి ఏడాది అయింది. పెళ్ళానికి తొమ్మిదోఏడు! వాణ్ణిచూస్తే సుందరానికి ఏమిటో దిగులుగా ఉండేది.

నరుసు మాత్రం పది నిమిషాలసేపు బెట్టుగా ఉండి చివరకు తనంతట తనే జానకితో స్నేహం చేసుకుని దాన్ని అవతలింటోకి తీసుకుపోయి తనకు రాటం మీద నూలువడకటం ఎంత బాగా చాతవునో చూపించసాగాడు. జానకి



కెవ్వన ఏడిచేదాకా ఈ సంగతి ఎవరూ గమనించలేదు. తిరిగే కదురు మొన మీద జానకి వేలుపెట్టింది. జానకి ఏడుస్తుంటే నరుసు బిక్కమొహం వేశాడు.

"పిల్లలిద్దరి చదువూ మానిపించారు గదా!" అన్నది కామేశ్వరి. "నరుసు ఇంకా రెండేళ్ళకల్లా స్కూలుఫైనలు పేసు కావాలిసినవాడు. ఇదేమిటండీ అంటే, 'స్వరాజ్యం వచ్చినాక ఈ చదువెందుకే?' అంటారు. ఆడపిల్ల చదివేదేమిటి? ఈ స్వరాజ్యం వచ్చేదెప్పుడో, వాడు కొత్తచదువు నేర్చుకునేదెప్పుడో? ప్రస్తుతం ఈ గంతలు మొయ్యలేక చస్తున్నాం, నేనూ పిల్లలూనూ."

"ఈ పెట్టే బళ్ళో వాడికి చదువుండదా ఏం?" అన్నది సీతమ్మగారు.

"నయం! ఇప్పుడు మూడు క్లాసులు పెడుతున్నారు. మేస్టర్లు కావద్దా. అదీ గాక ఈ కొత్త చదువు పెద్దక్లాసులదాకా రావద్దా? ఈ స్వరాజ్యం బళ్ళలో చెప్పే చదువు వేరుగా మరీ?"

సీతమ్మగారికి "స్వరాజ్యం చదువు" అంతుచిక్కలేదు. ఆ జాని కావిడకు హైస్కూలు చదువుగురించి కూడా తెలీదు. కాని దాన్నిగురించి తెలీకుండానే దానియం దావిడకు విశ్వాసం ఉన్నది. ఆ చదువు చదివి తనకొడుకు పరీక్షలు పాసయినట్టూ, డిగ్రీలుపొందినట్టూ, చదువుకున్నవాడుగా అందరిచేతా గుర్తించబడినట్టూ, పెద్ద ఉద్యోగాలు సంపాదించినట్టూ సీతమ్మగారు ఊహించుకోగలిగింది. కాని ఈ స్వరాజ్యం చదువుమాట? దాన్నిగురించి శేషగిరి చాలా చెప్పాడు.

"ఇప్పుడు మనపిల్లలు చదువుకునే చదువు ఎందుకైనా పనికొస్తుందా? వీళ్ళకి తెలుగురాదు. తెలుగుపుస్తకాలు చదవరు. తెలుగులో గొప్పకవులెవరో, ఏం రాశారో ఎరగరు. పదిహేనేళ్ళు చచ్చేట్టు ఇంగ్లీషుభాషా, ఇంగ్లీషుపుస్తకాలూ, ఇంగ్లీషుకవిత్వమూ చదువుతారు. చదివి ఏమన్నా చెయ్యటానికుందా? ఒక వృత్తివిద్య ఉందా? ఏమీలేదు. ట్రెయినింగయితేగాని మేష్టరీరాదు. 'లా' చదివితేగాని ప్లీడరీ లేదు. ఇంజనీరింగూ, వైద్యమూ వేరే చదవాలిసిందేగదా! నూటికి ఒకడుకూడా ఉద్యోగాలు చెయ్యడు. చాలామంది వృత్తులు చేసుకుంటారు. వ్యవసాయం, వడ్రంగం, కుండలూ కూజాలూ చెయ్యటం, నేయటం, నగలు చెయ్యటం మొదలైనవి నేర్పేటందు కెక్కడన్నా ఒక్కబడిఉందా? లేదు. ఈ బళ్ళలో ఎవరికీ పనికిరాని చదువు నేర్పుతారు గనకే మనదేశంలో చదువింత తక్కువ. మనజాతిని నిర్జీవంచేసి ఎందునాకాకుండా చెయ్యటానికే ఇంగ్లీషువారీ చదువు ప్రవేశపెట్టారు....పైపెచ్చు, దేశచరిత్ర అని పేరుబెట్టి అబద్ధాలు రాశారు. బ్రిటిషువాళ్ళను ఎదిరించిన మనరాజులనందర్నీ వొట్టి దుర్మార్గులుగానూ, బ్రిటిషువారికి సాయపడ్డ అధములందర్నీ చాలా గొప్పవాళ్ళగానూ చరిత్రలో రాస్తారు. మన కర్మగాలితే మనం దేశభక్తి చూపించాలంటే దేశద్రోహులనందర్నీ ఆరాధించాలిసినగతి పట్టింది ఈ పాపిష్టిచదువువల్ల."

తన ఈ ఉపన్యాసాన్ని ఆడవాళ్ళూ, పిల్లలూ ఎంతవరకు అర్థంచేసుకున్నారో శేషగిరికి తెలీదుగాని ఆయనమాత్రం ఇప్పట్నుంచే ఉపన్యాసానికి తయారు తింటున్నాడు.

* * *

మామూలుగా పెళ్ళిళ్ళకూ, పడుగులకూ, శోభనాలకూ పెట్టినట్టుగానే జాతీయవిద్యాలయానికి పంచాంగం చూసి ముహూర్తం పెట్టారు. సత్రానికి సున్నంవేసి, తోరణాలూ, రంగుకాగితాల తోరణాలూ కట్టారు. సన్నాయి పెట్టారు. శేషగిరీ, కామేశ్వరీ పీటలమీద కూచుని మంత్రోక్తంగా విద్యాలయ ప్రారంభం చేశారు. అప్పుడే విద్యాలయానికి పన్నెండుమందిపిల్లలూ, ఒక మేష్టరూ ఏర్పడ్డారు. తరవాత బీదకీ బిక్కికీ అన్నదానం జరిగింది.

సాయంకాలం గ్రంథాలయం ప్రారంభోత్సవమూ బహిరంగసభా.

సుందరానికి ఇదంతా చూస్తుంటే ఏదో పెద్దఎత్తున జరుగుతున్నట్టూ, అందులో తానుకూడా పాల్గొని అలిసిపోతున్నట్టూ అనిపించింది.


సాయంకాలపు సభకు దాదాపు ఊళ్లోవాళ్ళంతా వచ్చారు. ఊళ్లోవాళ్ళూ, పై ఊళ్ళవాళ్ళూకూడా వచ్చిమాట్లాడారు. శేషగిరి జాతీయవిద్యనుగురించి ఇంట్లో ఇచ్చిన ఉపన్యాసమే మరింతసేపు ఇచ్చాడు. మిగిలినవాళ్ళు శేషగిరి త్యాగాన్నీ, దీక్షనూ, కృషినీ ప్రశంసించారు. ఒక్కొక్క ఉపన్యాసకుడే తన మామయ్యను మెచ్చుకుంటున్నకొద్దీ ఆయనలో తనకు తెలియని కొత్త గొప్పతనం కనిపిస్తున్నట్టుగా తోచి, సుందరం అయిదునిమిషాల కొకసారి శేషగిరి మొహంకేసి చూడసాగాడు. కాని శేషగిరి ఇదంతా వినిపించుకుంటున్నట్టులేదు. హడావుడిగా తిరుగుతూ ఎవరెవరితోనో ఏమేమిటో మాట్లాడుతున్నాడు, క్షణంతీరకుండా.

ఆ మర్నాడు విదేశవస్త్రదహనం. శేషగిరి భార్యకు చాలా ఖరీదైన చీరెలున్నాయి. శేషగిరికి ఖరీదైనకోట్లూ, మల్లుపంచెలూ ఉన్నాయి. వీటన్నిటినీ తగలబెట్టాలనేసరికి కామేశ్వరి కంట నీరుపెట్టింది. సీతమ్మగారికూడా ఇది చాలా అఘాయిత్యంగా కవిపించింది.

"ఆదేమిటర్రా, చక్కని బట్టలు తగలేసుకోవటం? పోతే మళ్ళీవస్తాయా? ఎంతేసి డబ్బుపోసి కొనుక్కున్నవో గదా! మీరు కట్టుకోకపోతే పెట్టెలో దాచి ఉంచండి. లేదూ, ఎవరికన్నా ఇవ్వండి," అన్నది సీతమ్మగారు.

"భ్రమ! కేవల వ్యామోహం! మహాత్ముదేమన్నాడు? కుళ్ళిపోయిన పండని ఇంకొకరికిస్తామా? చాలా తప్పు. కల్మషం. దీన్ని దహించవలసిందే. అప్పుడుగాని మన ఆత్మల్లో అంటిపెట్టుకున్న స్వార్థం కడిగేసుకుపోదు," అన్నాడు శేషగిరి.

ఇంకా చాలామంది ఇళ్ళనుంచి విదేశవస్త్రాలు వచ్చాయి. అన్నిటినీ చెరువుగట్టున పోగేశారు. బీదా బిక్కీ వచ్చి కాస్సేపు మొరపెట్టుకున్నారు, తమ కేమన్నా ఇప్పించమని. కాని ఆ వస్త్రాలు



దగ్ధమై తీరాలిసిందే. దగ్ధమే అయాయి. ఆ మంటలు చూస్తున్న సుందరానికి జాతీయోద్యమమంటే ఏదో వికారభావం కలిగింది. "ఇది తప్పు! దారుణం! అన్యాయం!'' అని వాడి అంతరాత్మ చెప్పసాగింది. ఈ మాటలే ఊళ్లో చాలా మంది నోట ధ్వనించాయి.

జాతీయ విద్యాలయం - అందరూ పిలిచేది "స్వరాజ్యం బడి" - గురించి చిక్కులు ఆరంభమయాయి. అందులోకి అస్పృశ్యులను చేర్చుకోవాలా వద్దా అనే విషయం ఇళ్ళల్లోనూ, అరుగులమీదా, సత్రంలోనూ, ఆఖరుకు శేషగిరి మేడ మీదా మీటింగులు జరిగాయి.

"ఇందుల్లోకి ఈ అస్పృశ్యులను ఎందుకు తెస్తావు, శేషగిరీ? వాళ్ళ సంగతి తరవాత చూస్తాం. వాళ్ళకు కావాలంటే వేరే బడి పెడదాం. ఇందులోకి వాళ్ళను చేర్చకు."

శేషగిరి కిది ఆదర్శపతనంగా కనిపించింది.

''ఇంకా స్పృశ్యులూ, అస్పృశ్యులూ ఏమిటి? అంతా గాంధిమయమై పోతుం టేనూ? అంతా గాంధిమయం - జగమంతా గాంధిమయం."

"అయితే వద్దన్నదెవరూ? ఇప్పుడు మనం అస్పృశ్యుల్ని తెచ్చిపెట్టామో, సంసార్ల పిల్లలు ఒక్కరు చేరరు. కార్యవాదం కావాలి. మనం ఏ పరిస్థితి రావాలని కోరుతున్నామో అది వచ్చేసి నట్టే పనిసాగిస్తే మొదలుకే చెడుతుంది."

ఈ వాదాన్ని సమర్థిస్తూ నలుగురూ నాలుగు మాటలూ మాట్లాడారు.

"సంస్కారం మెల్లిగా వస్తుంది. తొందరపడరాదు."

"అసలే ప్రజలలో ఇంకా జాతీయోద్యమం నాటుకోలేదు. పంచములు లేక పోయినా పిల్లలు వచ్చేట్టులేరు. ఈ ఊళ్ళో వాళ్ళకు ఏ చదువూ ఇష్టంలేదు."

"ఇప్పుడే అస్పృశ్యులు చదువు కావాలని ఏడుస్తున్నారా ఏమిటి? ఏమిటో! ఉట్టిపుణ్యానికి లేని కలతలు తెప్పించటంగాని!"

శేషగిరి అందర్నీ కోప్పడ్డాడు. సంకుచితత్వం విడవకపోతే దేశాన్ని ఉద్ధరించలేమన్నాడు. మార్పుకు జడిస్తే ఎప్పటి పరిస్థితులకు భిన్నం ఉండ దన్నాడు. పంచముల్ని చేర్చుకోకుండా ఉండటానికి ఒప్పుకున్నాడు. అందరూ తృప్తిపడి వెళ్ళిపోయినారు.

శేషగిరి సీతమ్మగారినీ పిల్లల్నీ ఇంటి దగ్గిర దిగవిడిచాడు. తన అన్న గృహ జీవితంలో కలిగిన గొప్ప మార్పును గురించి ఆవిడ ఇరుగుపొరుగు వాళ్ళతో ఈ విధంగా చెప్పింది:

"ఇదెందుకొచ్చిందో గాని మా అన్నయ్యమాత్రం వొట్టి పిచ్చివాడల్లే అయిపోయినాడు. తెల్లారిలేచింది మొదలు పడుకోపోయేదాకా గాంధీ గొడవా, స్వరాజ్యం గొడవానూ! శుచీ ఆచారం లేదు కొంపలో. ఇంటో ఎక్కడ చూసినా గోనెపట్టాలల్లే ఈ ఖద్దరు బట్టలే. మడికీ అవే, మైలకూ అవే. బయట తిరగటానికి పోయి ఆ గుడ్డల తోనే అన్నానికొచ్చుంటాడు మా అన్నయ్య. నానా అయోమయంగానూ

ఉంది. ఉద్యోగం మానేశాడు గదా! పిల్లాడి చదువు కాస్తా పోయింది! ఏం కానుందో ఏమో!"

* * *

సహాయనిరాకరణోద్యమంలో శేషగిరి ఆరునెల్లపాటు జైలుశిక్ష అనుభవించాడు. ఆయన జైల్లో ఉన్నకాలంలో సీతమ్మగారు పిల్లలతో వదినెగారిని చూడవెళ్ళింది. కామేశ్వరి, వకీలు సీతారామయ్యను బాగా తిట్టిపోసింది.

"ఈయనకు ఈ పాడు ఆలోచన లన్నీ ఆ సీతారామయ్యే పెట్టాడు. చివరకు జైలుకు వెళ్లాలిపొచ్చేటప్పటికి ఈయన ఒక్కరే అయినారు. ఆయన తన ప్లీడరీ చేసుకుంటూ హాయిగా తింగురంగా అని కూచున్నాడు. ఆయన ఉద్యోగం ఒకరు తీసేసేదా, రాజీనామా ఇచ్చేదా? మాకివి శనిరోజులు, వదినా, నానాఅగచాట్లూ పడుతున్నాం. పిల్ల దేమిటిగాని నరుసు బొత్తిగా చెడిపోతున్నాడు. ఎంత చక్కగా చదువుకునేవాడు! బీడీలు కాలుస్తూ గొడ్లగాసే పిల్లలతో తిరుగుతున్నాడు. వాడికిప్పుడు చదువురంధేలేదు. ఎంతసేపటికీ సంగీతాలూ, పద్యాలూ, పాటలూనూ. ఊళ్లో పనిలేనివాళ్ళని పోగుచేశాడు. ఇప్పుడీన నాటకాలాడతాట్ట! వాళ్ళ నాన్న ఆడిన నాటకం చాలనట్టు! ఆ జైలు తిండి ఆయనకు పడలా. రక్తవిరేచనాలు పట్టుకున్నాయిట. ఇరవై పౌన్లు తగ్గానని రాశారు. ముందేం కానుందా అని తలుచుకుంటే భయంగా ఉంది." అని కామేశ్వరి కంటనీరు పెట్టుకున్నది.

సీతమ్మగారు వేదాంతం చెప్పింది. అంతా భగవంతుడి అధీనం. మనం దేనికీ కర్తలంకాం. ఎట్లాకావలిసుంటే అట్లా కాకమానదు.


తన అన్న కుటుంబానికి ఏదో కోరదగని పరిణామం జరుగుతున్నట్టూ, తను ఎంతో అదృష్టవంతురాలు కావటం చేత తనకూ తనపిల్లలకూ అది తప్పినట్టూ సీతమ్మగారు ఊహించుకున్నది. అన్నకోసం విచారంతోబాటు ఈ సంతృప్తికూడా ఆవిడకు కలిగింది.

సుందరంకూడా తల్లి నానుకుని కూచుని అత్తయ్య చెప్పిన మాటలన్నీ విన్నాడు, వాడికి మిగిలినవేవీ పట్టలేదుగాని నరుసువిషయం చాలా విచారం కలిగింది. ఇదివరకల్లా నరుసు తనకంటె రెండు క్లాసులు ముందున్నవాడు, ఇప్పుడు వాడు తనకన్న రెండుక్లాసులూ మూడుక్లాసులూ, నాలుగుక్లాసులూ వెనకపడిపోతాడు. తను బియ్యే, ఎమ్మేకూడా పాసయిపోతాడు, నరుసు మాత్రం మూడోఫారం సహం చదివి మానేసిన వాడుగానే ఉండిపోతాడు. ఈ ఆలోచన వల్ల సుందరానికి అవగింజంతైనా సంతృప్తి కలగలేదు.

సీతమ్మగారూ పిల్లలూ చేరిన కొద్దిసేపటికి నరుసు ఇంటికివచ్చాడు.

"ఏంరా, ఎప్పుడొచ్చారు?" అన్నాడు నరుసు.

కిందటిసారికీ ఇప్పటికీ వాడు చాలా మారిపోయినాడు. వెనకటి బెట్టులేదు. చాలారోజులకు సుందరాన్ని చూసిన ఆశ్చర్యంలేదు.



"ఇంతకుముందే వచ్చాం." అన్నాడు సుందరం, తనకన్న చాలా పెద్దవాడితో మాట్లాడినట్టుగా. నిజానికి నరుసుకు వయసులాంటి దేదోవచ్చింది.

"రా, మేడమీదికిపోదాం." అంటూ నరుసు మేడ మెట్లమీదికి వెళ్లాడు. నరుసు తనను ఆజ్ఞాపించినట్టే భావించుకుని సుందరం పైకివెళ్లాడు.

మేడమీద నాలుగు మంచాలూ, వడ్ల బస్తాలూ తప్ప ఇంకేమీలేవు. నేలమీద చాపపరిచిఉంది. దానిమీద హార్మోనియం ఒకటి పెట్టిఉంది.

మేడమీది డాబాలో ఒకమూల ఆరుబయట రాటం పడిఉన్నది.

"నూలు తియ్యటంలేదా?" అన్నాడు సుందరం.

"ఎన్నాళ్ళయిందో నూలుతీసి?.... పాడనా? వింటా? అయితే అట్లా కూచుని తిత్తిపొయ్యి."

నరుసు మాటలధోరణీ, వాలకమూ అంతా మారిపోయింది. వాడిమీద పల్లెటూరిముద్ర బాగా పడింది.

సుందరం గాలిపోస్తుంటే నరుసు రెండుచేతులా హార్మోనియం వాయిస్తూ నాటకాల్లో పద్యాలు - హరిశ్చంద్రలోవీ, చిత్రనళీయంలోవీ, గయోపాఖ్యానంలోవీ - పాడాడు.

"నీకు రాగాలు తెలుసా?" అన్నాడు నరుసు. సుందరానికి తెలీదు. నరుసు పాట సుందరం చెవులకు చాలా గొప్పగా ఉన్నది. నాటకంలో వాళ్లు పాడినట్టుగానే ఉన్నది.

"ఎవరుమాత్రం ఇంతకన్న బాగా ఎట్లా పాడతారు? ఎంతబాగా నేర్చుకున్నావురా? ఈ హార్మోనియం వాయించటం ఎట్లావచ్చిందీ?" అన్నాడు సుందరం.

నరుసు సంతోషించాడు. సుందరం మనస్ఫూర్తిగా తనను మెచ్చుకుంటున్నట్టు వాడు గ్రహించాడు.

"వెధవ ఆరుమోయినం వాయించటానికి నేర్చుకోవాలికూడానా? ఇంకా పాటన్నావ్? అది చాలా నేర్చుకోవాలి. వచ్చేయేడు చూసుకో ఎట్లా పాడతానో. నాటకబృందం ఒకటీ తయారుచేస్తున్నాలే. మనమాట వినే పిల్లకాయలున్నారు" అన్నాడు నరుసు.

నరుసు మాట్లాడుతుంటే వాడు ఎవరినో ఎందుకో అపహాస్యంచేస్తున్నట్టు సుందరానికి తోచింది. తననుచూసి తానే నవ్వుతుంటున్నాడేమోకూడా సుందరానికి తెలియలేదు. నిజానికి నరుసు మనఃప్రవృత్తి ఎట్లా పరిణమించిందీ ఊహించగల స్థితిలోలేదు సుందరం. నరుసుకివాళ దేనిమీదా పెద్ద విశ్వాసంలేదు.

ఇప్పుడు వాడు తన ఆనందంకోసం తనలోనే వెతుక్కుంటున్నాడు. వాడిలో ఉన్న పట్టుదల ఇప్పుడు మామూలు మార్గాలు వదిలేసి కొత్తమార్గాలు పడుతున్నది. లేకపోతే కొద్దిమాసాలలో వాడు ఇంత సంగీతసాధన చేయటం సాధ్యంకాదు.

నరుసు ప్రయత్నాలలో ఇంకో విశేషంకూడా ఉన్నది. వాడిప్పుడు అచ్చగా తనవిషయమే చూడటంలేదు. తన ఈడువాళ్ళని కూడగట్టి వాళ్ళందరితోనూ కలిసి ఏదో చెయ్యాలనిచూస్తున్నాడు - నాటకాలాడటమే కానీగాక!

సుందరం కార్యక్రమంలో పెద్దపరీక్షలు పాసుకావటమూ, పెద్దఉద్యోగాలు చెయ్యటమూవంటివి ఉన్నాయిగాని నలుగుర్నీ కూడగట్టి చేసేపని అందులో ఒక్కటీ లేదు. అయితే ఈ తేడా సుందరం అర్థంచేసుకోలేదు. బహుశా నరుసుక్కూడా తనకూ సుందరానికి గల తేడా అర్థమైఉండదు. అయినా తాను చేస్తున్నపని వాడికి చాలా స్వాభావికంగా కనిపించింది, సుందరానికి మటుకు నిరర్థకమనిపించింది. నరుసు ఎంత పాట పాడి, ఎన్ని నాటకాలాడించినా అవి మామూలు నాటకాల్లా ఉండవనీ, ఏదో పల్లెటూరి అమాయిక ప్రజలు వీధినాటకం చూసినట్టు చూసి సంతోషించటానికి మాత్రమే పనికివస్తాయనీ సుందరం నమ్మకం. ఈ నమ్మకాన్ని బయటపెట్టి సుందరం నరుసును నొప్పించలేదు.

నాలుగైదు రాగాలుమీద పద్యాలు పాడి విశ్రాంతి తీసుకుంటూ నరుసు జేబులోనుంచి బీడీతీసి అంటించాడు.

"నిజంగా బీడీలు కాలుస్తున్నావుట్రా?" అన్నాడు సుందరం ఆశ్చర్యంతో.

"ఆమాత్రం ఉండాల్లే", అన్నాడు నరుసు. వాడి ఉద్దేశం సుందరానికి అర్థంకాలేదు.

"నువు పాడతావా ఏం? కాస్సేపు వాయిస్తా", అన్నాడు నరుసు.

"అబ్బే, నాకేంరాదు", అన్నాడు సుందరం.

"ఏదో పాట రాకుండాఉంటుందా ఏం? ఏమీరాకపోతే అప్పనాతనామనా పాడు."

సుందరానికి లోపలినించి ఏదో దడ పుట్టింది. పాట వినటమంటే ఎంతో ఆసక్తికలవాడు కనక వాడికి కొన్ని పాటలు వచ్చినమాట నిజమే. కాని నరుసు తనను పాడమంటాడేమోనని సుందరం వొణికిపోయినాడు.

నరుసు, వాడి ధర్మమాఅంటూ బలవంతం చెయ్యలేదు.

## పధ్నాలుగో ప్రకరణం

సెకండుఫారంలోకి వచ్చినప్పటినుంచీ సుందరం క్లాసులో రాణించటం లేదు. అదివరకెన్నడూ వాడి "ప్లేసు" పది దాటేదిగాదు. ఇప్పుడు పదిహేనూ, ఇరవై మధ్య ఉండటమేకాక, క్లాసులో తనకన్న చురుకైనవాళ్లూ, తెలివిగలవాళ్లూ చాలామంది ఉన్నట్టు వాడికితోచసాగింది. దీనికి కారణమేమిటో వాడు చాలారోజులు ఊహించలేకపోయినాడు.



"నాకీయేడు మంచి ప్లేసు రావటం లేదమ్మా," అన్నాడు సుందరం, తన సమస్య ఆవిడేమో తీరుస్తుందన్నట్టు.

"నువు సరిగా చదవటంలేదు గామాలూ! కాకపోయినా ఆ నాగేశ్వ్రరావూ నువ్వూచేరి ఒకరిచదువు ఒకళ్లు చెడగొట్టుకుంటున్నారు. ఒక్కడివీ చదివినప్పుడే నయం," అన్నది సీతమ్మగారు.

ఆవిడ నాగేశ్వ్రరావుమీద తప్పు తోయటమూ, తమ స్నేహాన్ని కించపరచటమూ సుందరానికేమీ ఇష్టంలేకపోయింది. కాని "ప్లేసు" రావటం లేదన్న చింత అట్లాగే ఉండిపోయింది. "క్వార్టర్లీ" లోనూ, "హాఫియర్లీ" లోనూ ఈ చింత మరింతయింది. సుందరానికి పాడుమార్కులు వచ్చాయి. పాసుమార్కు లయితేమాత్ర మేం?

"ఈపరీక్షల్లోనే ఇట్లా మార్కులొస్తే అసలుపరీక్షల్లో పాసుకావటం ఎట్లారా?" అన్నాడు సుందరం నాగేశ్వ్రరావుతో.

"నూటికి యాభైలూ, అరవైలూ ఎంతమందికి వచ్చాయో చూశావా?" అన్నాడు నాగేశ్వ్రరావు.

దీనికంతకూ కారణమేమిటో నాగేశ్వ్రరావు అన్న చెప్పేదాకా వాళ్లకు తెలియదు.

వాళ్ళ క్లాసుటీచరుకు ఇంటిదగ్గర వేరే బడిఉంది. అందులో నలభైమంది దాకా చదువుతారు. వాళ్లల్లో సగానికి పైగా ఆయన క్లాసుపిల్లలే. బళ్ళోలాగే ఈపిల్లలు ఆయనకు నెలకు రెండున్నర చొప్పున ఇచ్చుకుంటారు. ప్రతి రాత్రీ ఆయన ఒక గంటసేపు వాళ్ళచేత మర్నాటి పాఠాలు చదివిస్తాడు. తాను మర్నాడు క్లాసులో వెయ్యబోయే ప్రశ్నలూ, ఇయ్యబోయే లెక్కలూ వాళ్ళకు చెప్పి నూరుతాడు. చాలామంది పిల్లలు క్లాసులో మంచిమార్కులు తెచ్చుకుంటారు. ఇంతనూరినా క్లాసులో తెల్లమొహాలు వేసే మొద్దులూ వున్నారు. ఆయనకు స్కూలువాళ్ళు ఎంతజీతం ఇస్తారో అంతా ఆయన ప్రైవేట్లతో సంపాదిస్తాడు.

స్కూలుపిల్లలు కాక ఇతర విద్యార్థులుకూడా ఆయనదగ్గిర చదువుతుంటారు. వాళ్ళలో ఎక్కువభాగం ఏబీసీడీలుకూడా రాని మచ్చు. వాళ్ళేంచేస్తారంటే ఆయనదగ్గిరచేరి ఒక ఏడాదిలో ఫస్టుఫారం స్టాండర్డుకు వస్తారు. రాకపోయినా ఇబ్బందిలేదు; సెకండుఫారంలోకి బయటినుంచి వచ్చి చేరేవాళ్ళను చేర్చుకునేది ఆయనేగనక తనదగ్గిర ఏడాదీ, ఆరునెల్లూ చదువుతున్నవాళ్ళని

సెకండుఫారంలో చేర్చుకుంటాడు. ఆయేడల్లా కూడా ఆయన వాళ్ళను తన ట్యూషన్‌కిందే ఉంచుకుంటాడు. సెకండుఫారం ఆఖరుపరీక్షలు వచ్చే సమయానికి సెకండుఫారం పరీక్ష పేపర్లు సెట్ చేసేవాళ్ళలో వీలయినంతమందిని మంచిచేసుకుని వాళ్ళిచ్చేప్రశ్నలు తెలుసుకుని తన ప్రైవేటు విద్యార్థులకు చెప్పి వాళ్ళు థర్డుఫారంలోకి తోసుకుపోవటానికి వీలైనంతవరకు తోస్తాడు. ఆతరవాత వాళ్ళపాట్లు వాళ్ళుపడతారు.

ప్రతి రాత్రీ తొమ్మిదిగంటలయేసరికల్లా లాంతర్లతోసహా, కప్పుకునే బట్టలతోసహా ఈ పంతులు ఇంటికి తయారయే విద్యార్థుల తూగిడీలు చూడ ముచ్చటగా వుంటాయి.

ఈసంగతులు కొంతవరకు సుందరం ఆదివరకు ఎదుగునుగాని క్లాసులో తాను ప్లేసు సంపాదించక పోవటానికీ వీటికీ సంబంధం వున్నదని వాడికి తట్టలేదు.

* * *

నాగేశ్వర్రావు అన్న ఎక్కడినుంచో తెలుగుపుస్తకాలు తెచ్చేవాడు చదువుకోటానికి. కనపడిందల్లా చదివే అలవాటు సుందరానికున్నది. ఈ అలవాటు నాగేశ్వర్రావు సుందరందగ్గిరే నేర్చుకున్నాడు. ఇద్దరూ కలిసి "కన్యాశుల్కం" నాటకం చదవసాగారు. ఆ నాటకం మొదటినుంచి చివరదాకా వాళ్ళకు నవ్వొస్తూనేవుండేది. అందులో వున్న పాత్రలూ, శిల్పమూ, హాస్యపు లోతులూ వాళ్ళ కర్థంకాకపోయినా సంభాషణలు చాలా తమాషాగా, అచ్చగా మనుషులు మాట్లాడినట్టే వుండేవి. ఇదే వాళ్ళకు సహం నవ్వొచ్చేది. వీరేశలింగంగారి నాటకాలుకూడా వాళ్ళకు చిన్న చిన్న పుస్తకాలుగా దొరికాయి. అవి మామూలు నాటకాలకు దగ్గిరిగావున్నా అవికూడా నవ్వొచ్చేవి.



ఆధునిక సాహిత్యంతో సుందరానికిది తొలిపరిచయం. కాని దానిప్రభావం వాడిమీద దాదాపు ఏమీ లేకపోయింది. ఆ పుస్తకాలు చదివినట్టే కొన్ని అపరాధ పరిశోధక నవలలూ, విదేశీ నవలల అనుకరణలూకూడా సుందరం చదివి ఆనందించేవాడు. ముఖ్యంగా డిటెక్టివు నవలలు చదువుతుంటే ఎప్పటికీ విసుకెత్తేదికాదు.

శేషగిరి చిక్కి శల్యమై గుర్తించటానికిలేకుండా మారిపోయి జైలునుంచి విడుదలై ఇంటికిపోతూ కనిపించివెళ్ళిన తరవాత సుందరం మనస్సులోనుంచి రాజకీయాలు పూర్తిగా మాయమై జీవితం మళ్లీ యథాప్రకారమయింది. ఈ జీవి

తంలో ముఖ్యమైనవి స్కూలు విషయాలు, వినోదమైనవి సుందరంచదివే పుస్తకాలు, విడ్డూరాలు సినిమాలూ, సర్కసులూనూ.

ఎందుకంటే ఈ తరుణంలోనే సుందరం మొట్టమొదటిసారిగా నిజమైన మృగాల సర్కసు చూశాడు. సర్కసుకు పోవటానికి డబ్బులిమ్మంటే సీతమ్మగారు ఎట్లాగూ ఇచ్చివుండేదికాదు. కాని నాగేశ్వర్రావు ఇంటో అందరూ బయలుదేరుతూ సుందరాన్ని కూడా తీసుకువెళ్ళారు. మిగిలినవాళ్లంతా ఏనుగులూ, గుర్రాలూ, పులులూ, సింహాలూ చూసి సంతోషించారుగాని, సుందరానికి ఆ "ఫీట్స్"లోవుండే స్వారస్యం అర్థంకాలేదు. ఆ ఫీట్సునుగురించి ఎవరన్నా వర్ణిస్తే ఎంత తృప్తికలిగేదో చూస్తున్నా అంతే తృప్తికలిగింది. అన్ని ఫీట్సుకన్నా సర్కసు బఫూనులు వాడికి బాగా నచ్చారు. వాళ్లను జ్ఞాపకంచేసుకుని వాడు చాలారోజులపాటు నవ్వుకున్నాడు. అయినా, సర్కసు వెళ్ళిపోయినతరవాత సుందరం ఇతరపిల్లలతోబాటు కర్రలకు పొడుగాటి తాళ్లుకట్టి, సర్కసులో గుర్రాలూ, ఏనుగులూ ఆడించేవాడల్లే తిరిగాడు.

ఈసారి సుందరం చూసిన సినిమా కూడా నిజమైన సినిమాయే. ఎలెక్ట్రిక్ దీపాలూ — వాటంతట అవే వెలిగి ఆరేవి—వాడుచూడటం ఇదే మొదలు. ఈ సినిమాలో కథలున్నాయి——శ్రీరామజననం, శ్రీకృష్ణజననం, లంకాదహనం, మైరావణ, సతీతులసీ, కంసవధ మొదలైనవి. తల్లిని ఎట్లాగో ఒప్పించో, నాగేశ్వర్రావుతో కలిసో, తల్లి తనకెప్పుడన్నా కొనుక్కోవటానికిచ్చేకాన్లు దాచో సుందరం చాలా సినిమాలు చూశాడు. వాడికవి "అద్భుతం"గా ఉండేవి. హాలులోకి పోయి కూర్చోటమే ఎంతో ఆనందంగా ఉండేది. రీలుకూ, రీలుకూ మధ్య లైట్లు వచ్చినప్పుడు ముళ్ళమీద వున్నట్టుండేది. కథ చెప్పేవాడొకడుండేవాడు. వాడు కథ చెప్పటంలో ప్రత్యేకతఏమీ లేకపోయినా వాడిగొంతు వినిపిస్తుంటే పరమానందంగా వుండేది. వాడు ఆప్తుడల్లేవుండేవాడు. ఇటువంటి భావాలు అచ్చగా సుందరానికి ఒక్కడికే కలుగలేదు. ఒకరోజు సుందరం మధ్యాన్నంపూట స్కూలుకు పోతూండగా వాడితో వస్తున్న స్నేహితులు కొందరు ఒకళ్ళ నొకళ్లు గిల్లుకుని "అడుగో, సినిమాలో కథ చెప్పే శేషయ్య." అన్నారు. శేషయ్య కిల్లీకొట్టుదగ్గిర నిలబడి బీడీలు కొంటున్నాడు.

* * *

సెకండుఫారం పరీక్షలో సుందరం పాసయినాడు. మధ్య పరీక్షల్లో కొద్ది మార్కులే వచ్చినా ఈ ఆఖరుపరీక్షలో మార్కుల ప్రకారం యాభైలూ, అరవైలూ వచ్చినై. లెక్కల్లోమటుకు ఎనభైకి పైగావచ్చాయి. తన క్లాసు మేష్టరు తొమ్మిది నెలలపాటు తనకు చేసిన అన్యాయాన్ని సుందరం పూర్తిగా గ్రహించనూగ్రహించాడు, క్షమించనూ క్షమించాడు.

సుందరానికి తన క్లాసుమేష్టర్లని ద్వేషించటం ఎన్నడూ అలవాటులేదు. కాని మూడోఫారం మేష్టర్ని ఆరాధించటం మొదలుపెట్టాడు. అంతకు పూర్వం ఏమేష్టరూ వాణ్ణి అంతగా ఆకర్షించలేదు. ఆయన పాఠం చెబుతుంటే తన ఒక్కడికే చెబుతున్నట్టుగా ఉండేది. ఆయన అచ్చగా పాఠం చెప్పటమేకాదు, చదవటంలోనూ, ఇతరులతో సరిగా ప్రవర్తించటంలోనూ ఆసక్తిపుట్టించేవాడు. పుస్తకాలలో అర్థం చేసుకునేదీ, అన్వయించుకునేదీ కూడా ఉంటాయని సుందరానికి తలకెక్కేటట్టుచేసినది ఈ మేష్టరే.

అయితే ఈ మేష్టరు మూడునెల్లయినా ఉండకపూర్వమే ఆయనకు ఉద్వాసన చెప్పారు కమిటీవారు. ఈకమిటీలో ఎక్కువమంది బ్రాహ్మలే. కాని అంతా నియోగులుకారు. ఒకప్పుడు స్కూలును పైకి తీసుకువచ్చినవాళ్ళంతా పెద్దస్థితిలో ఉండిన నియోగులే! అయితే రానురాను పెద్దలు దాటిపోయారు. స్కూలు వ్యవహారాలు నిర్వహించటానికి కొత్తకారు వచ్చింది. వీరిలో వైదీకులు ఎక్కువున్నారు. వైదీకి రాజకీయాలు తెచ్చిపెట్టాలని వీరికి కలిగింది. ఈ కక్షరాజకీయాలకు మొట్టమొదటగా బలి అయినది సుందరం క్లాసుమేష్టరు.

దీనితో ప్రారంభమైన మర్కట పరిపాలనలో కొత్తమేష్టర్లు రావటమూ, పోవటమూ, ఎంతో కాలంగా ఉన్న మేష్టర్లను పిచ్చిసాకుమీద పంపెయ్యటమూ ప్రారంభమయాయి. సుందరం క్లాసుకువచ్చిన కొత్తమేష్టరు సుందరం దృష్టిలో వట్టిచవట. అంతమంచి మేష్టరునుతీసేసి ఈయననుపెట్టినందుకు హైస్కూలు అధికారులపైన సుందరానికి చాలా అసహ్యం పుట్టుకొచ్చింది.

ఈ అసహ్యంకూడా సుందరానికి ఒక్కడికే కలగలేదు. అది పిల్లలమధ్య దానంతటఅదే ఏర్పడింది. మేష్టర్లమీద పిల్లలకు కలిగే సదభిప్రాయాలూ, దురభిప్రాయాలూకూడా ఇట్లాగే క్రమంగా ఒక స్వరూపానికి వస్తాయి. ఆ అభిప్రాయాలు మొట్టమొదట ఒకడికే కలగవచ్చు, వాటికి ప్రచారంకూడా జరగవచ్చు. కాని వాటికి అంతో ఇంతో ఆధారంలేకపోతే అవి పిల్లలను పట్టుకోవు.

పిల్లలు చాలామంది మేష్టర్లకు మారుపేర్లుపెట్టారు—డైమన్ రాణీ, సీమసున్నం, విసనకర్ర, పొడుంచిప్ప ఇత్యాది. సుందరం ఇటువంటి నామధేయాలను సాధారణంగా ఎన్నడూ తన నోటితో ఉచ్చరించేవాడుకాడు, ఇతరులు ఉచ్చరిస్తే కాదనేవాడూ కాడు. కాని తనకు మంచిమేష్టరని తోచినవాణ్ణి గురించి విసుగులేకుండా నలుగురిలోనూ ప్రచారంచేసేవాడు. ఇట్లా ప్రచారం చెయ్యటంలో ఒక్కొక్కప్పుడు సుందరానికి తన సదభిప్రాయం భ్రమ అని కూడా తెలిసేది.

తెలుగుమేష్టర్లంటే చులకనగాచూసే అలవాటుకూడా సుందరానికి లేదు. అయితే వాళ్లు ఇతర మేష్టర్లల్లే పిల్లలను నిగ్రహించక వాళ్ళకెందుకు అలు

సిస్తారో సుందరానికి తెలిసేదికాదు. సుందరానికి మూఢోఫారంలో తెలుగు చెప్పిన శాస్త్రుల్లుగారు తెలుగు పుస్త కాలలో సుందరానికి ఆసక్తికలిగించాడు. కాని ఈ ఆసక్తి ఎందుకూ ఉపకరించ లేదు. శాస్త్రుల్లుగారు గొప్పగా చెప్పిన తెలుగు పుస్తకాలు తనకు సులభంగా దొరికేవికావు. అయినప్పటికీ సుందరం మూడో ఫారం పూర్తిచేసినతరవాత వేసవి శలవుల్లో కుచేలోపాఖ్యానం టీకా తాత్పర్యసహితం కొనుక్కొచ్చి అందులోఉన్న పద్యాలన్నీ బట్టీ బట్టి వాటి అర్థం తెలుసుకున్నాడు.

* * *

ఈ శలవుల్లోనే సుందరం ఒంటరిగా తన మేనమామగారి ఊరువెళ్లాడు. తాము ఫలానితారీఖున "హరిశ్చంద్ర" ఆడుతున్నామనీ సుందరం తప్పక వచ్చిచూడాలనీ నరుసు మరీమరీరాశాడు. తను కోరినప్రకారం సుందరం వచ్చి నందుకు నరుసు చాలా సంతోషించాడు. కొంతకాలంకిందట తాను గుంటూరు వెళ్ళి హరిప్రసాదరావు "హరిశ్చంద్ర" చూసివచ్చిన సంగతి అంతులేకుండా చెప్పాడు నరుసు. హరిప్రసాదరావు పొడుంముక్కుతో "హా చంద్రబతీ"అని ఎట్లాఅంటాడో కూడా చూపించాడు.

"ఒరే ఇవాళ హరిప్రసాదరావు హరిశ్చంద్రుడి పద్యాలు ఇమిటేట్ చేస్తే బెల్లంకొండ నరిసింహారావు చెయ్యాలి, లేదా నేను చెయ్యాలి. అంతే!" అన్నాడు నరుసు. ప్రతి శీనప్పపాటనూ, దాశరథి పాటనూ కూడా తెగమెచ్చుకున్నాడు. దురదృష్టవశాత్తూ సుందరం వాళ్ళ నెవర్నీచూడలేదు, వీళ్ళనుగురించి వినలేదు.

కాని నరుసు ధైర్యంచెప్పాడు.

"ఎల్లుండి రాత్రికి నేను హరిప్రసాద రావు బాణీ దించేస్తాగా?" అన్నాడు వాడు.

కాని సుందరం "ఎల్లుండి రాత్రి" దాకా ఆగ నవసరంలేకుండానే ఆ పద్యా లను అరడజనుసార్లు వినటం జరిగింది.

ఆ పల్లెటూళ్ళో సుందరానికేమీ తోచలేదు. నరుసు ఎంతసేపైనా కబుర్లు చెప్పగలడుగాని సుందరం చదువుతున్న చదువు ప్రభావం చాయలు అప్పుడప్పుడే తలఎత్తుతున్నాయి. తిమింగలం అర గంటకో గంటకో నీటిమీదికివచ్చి గాలి పీల్చుకుని మళ్ళీ నీటిలోకి వెళ్ళిన విధంగా, సుందరం ఆటేసేపు బాహ్య ప్రపంచంలో, యధార్థవ్యక్తులమధ్య ఉండి సంతృప్తిపడలేకపోతున్నాడు. అదే "తోచకపోవటం" రూపేణా బయట పడుతున్నది. వాడికి కావలిసిన "గాలి" పుస్తకాలలోనూ, కథలలోని పాత్రల లోనూ లభిస్తుంది - ఎటువంటి చెత్త పుస్తకమైనాసరే వాడికి "తోచేటట్టు" చేసేది.

"ఏంరా, నరుసూ? మీ లైబ్రరీకివెళ్ళి చదువుకోవటానికేమన్నా పుస్తకం తెచ్చుకుందాం?" అన్నాడు సుందరం.

"లైబ్రరీలో ఏంపుస్తకాలున్నై? ఏమీ లేవే?" అన్నాడు నరుసు.

"వెనక నే వచ్చినప్పుడు చాలా పుస్తకాలుండెనే? పానుగంటి ఆయన

సాక్షి, నాటకాలూ, డిటెక్టివు నావెల్సూ అవీ చాలా ఉండాలిగా?" అన్నాడు సుందరం.

"అన్నీ ఎవరిదారినవా రెత్తుకుపోయి నారు. మేష్టరే లైబ్రరీకూడా చూస్తూండే వాడు. బడి మూసేసి ఆయన వెళ్ళి పోగానే ఎవరికందినపుస్తకం వాళ్ళు ఎత్తుకుపోయినారు".

"బడి అయిపోయిందా?" అన్నాడు సుందరం.

"అయిపోకేం జేస్తుందిరా? లేని వాళ్ళకు జీతంలేకుండా చదువు చెబుతా మంటే ఉన్నవాళ్లుకూడా ఊరికేనే చెప్ప మన్నారు. జీతం అడిగితే పిల్లల్ని పంపించంఅన్నారు. కొందరు బడికి చందా లిచ్చారు చూడూ, వాళ్ళపిల్లలూ, వాళ్ళబంధువుల పిల్లలూ జీతాలుకట్టలా. వాళ్ళని అడగాలో అడగరాదో తెలీలా. బీదవాళ్ళ పిల్లలుకూడా బడికిరావటం మానేశారు. ఇళ్ళకు వెళ్ళి ఎందుకు రావట్రా అని అడిగితే, మా అబ్బాయికి బట్టలులేవని ఒకరూ, పుస్తకాలులేవని ఒకరూ. ఒరే నువు నమ్మవుగాని, ఎదురుడబ్బిస్తేతప్ప పిల్లల్ని పంపమన్న వాళ్ళున్నారు.... ఈ బడి కాదుగాని ఊళ్లో సహాంమంది కిప్పుడు మా నాన్నంటే పడదు. కొందరు, నీ మూలంగా మా పిల్లల్ని పాడుచేశాం, వాళ్ళ చదువు పాడుచేశాం అన్నారు. మరికొందరు మా నాన్న చాలా పెద్ద పేరుతెచ్చుకుందామని ఇదంతా చేశాడని కూడా అన్నారు. తిట్లుతినటంమాటా, కాళ్ళు పడేటట్టు చందాలకోసం తిరగటం మాటా అటుంచు, చేస్తూ చేస్తూన్న ఉద్యోగం మానుకుని మా నాన్న ఈ చందాలమీద కుటుంబం పోషిస్తున్నా డని వదంతులు పుట్టించినవాళ్లున్నారు. మా నాన్న తప్పుకూడా ఉందిలే. ఇంత త్యాగంచేశాను, అంత త్యాగంచేశాను, మీరేం చేశారు అని అందర్నీదెప్పాడు. వకీలు సీతారామయ్యకూ నాన్నకూ ఇప్పుడు మాటల్లేవు తెలుసా?....అదెట్లా వచ్చిందంటే, మా చలమయ్యమీద దాయాదులు దావావేస్తే అవతలివైపు వకాల్తీ సీతారామయ్య పుచ్చుకున్నాడు. చలమయ్యకూడా మానాన్నల్లేనే జైలుకు వెళ్లినవాడేగా మరి? 'ఇటువంటివన్నీ పెట్టుకుంటే అవుతుందా?' అన్నాడు సీతారామయ్య. మా నాన్న ఆయన్ని నానామాటలూ అన్నాడు. అంతే, ఇద్దరూ మళ్లీ మాట్లాడుకోలేదు .... నాలుగునెల్లపాటు మానాన్నే బడి పోషిం చాడు. ఆ తరవాత వొదిలేసి ఊరు కున్నాడు. ఒక్కడు ఎంతదూరమని దేకుతాడు చెప్పు?"

సుందరాని కిదంతా వింటున్నకొద్దీ కంపరం ఎత్తింది. ఈ ఉదంతంగురించి ఇన్ని వివరాలు తెలుసుకోవలిసిన అవ సరం లేదనీ, ఒక్కముక్కలో శేషగిరి మామయ్య తనజీవితమూ, పేరుకూడా భ్రష్టుచేసుకున్నా డనుకుంటే సరిపోతుం దనీ సుందరం అనుకున్నాడు.

ఇందులో నేర్చుకోవలిసిన నీతికూడా ఏమీఉన్నట్టుకనపడలేదు సుందరానికి— దేశంకోసం ఒళ్లు విరుచుకోవటం వృధా అని తప్ప.

ఆ సాయంకాలం నరసూ, సుందరం కూడా సత్రంకేసివెళ్ళారు. అక్కడే రోజూ నాటకం రిహార్సల్సు. సత్రం మీద మాసిపోయిన నీలం అక్షరాలతో "జాతీయ విద్యాలయం" అనీ, పక్క గది తలుపుమీద తెల్ల అక్షరాలతో "లైబ్రరీ" అనీ ఇంకా కనిపిస్తున్నది....

సుందరం నాటకంచూశాడు. నరసు హరిశ్చంద్రుడివేషం వేశాడు. పాడాడు, అభినయించాడు. ఆ నాటకమూ, ఆ తెరలూ, నాటకం చూడటానికివచ్చిన అమూకాచూస్తే ఏమనుకోవాలో సుందరానికి తెలీలేదు. ఈనాటకం చూస్తుంటే, నాటకం చదివితే వచ్చే ఆనందంలో నూరోవంతు రాలేదు. నరసుకూడా ఏదో తెచ్చిపెట్టుకుని నటిస్తున్నట్టూ, చూసేవాళ్ళ తెలివితేటలను అపహాస్యం చేస్తున్నట్టూ ఉన్నదిగాని తాను ఒక అనుభవాన్ని సృష్టిస్తున్నట్టు లేదు. ఈ నాటకాల గొడవపెట్టుకుని నరసు ఎందుకూ కొరగాకుండా పోతున్నాడని సుందరం నమ్మాడు.

నాటకం అయినతరవాత నరసు, "ఎట్లావుంది మా తోలుబొమ్మలాట?" అన్నాడు.


సుందరం, ఈమాటకు కాస్తధైర్యం వచ్చి, నాటకం ఏమీ బాగాలేదనీ, ఇంకా బాగా ఉండవచ్చుననీ అన్నాడు.

నరసు ఆ మాటతో ఏకీభవించి ఊరుకోక, ఎక్కడ లోపాలుజరిగాయో, ఎక్కడ ఎవరు బాగాచేశారో, ఎక్కడ ఎట్లా పాడుచేశారో, తాను ఎక్కడ బాగాచేశాడో, ఎక్కడ చెయ్యలేకపోయినాడో, ఎందుకట్లా అయిందో సవిస్తరంగా చెప్పనారంభించాడు. సుందరం లోలోపల విసుక్కుంటూ అంతా విన్నాడు.

సహృదయుడుకావివాడితో మాట్లాడుతున్నానని నరసు కొంచెం అనుమానించినా ఈ వివరాలు మాట్లాడివుండడు. సుందరం వినోదంకింద మాత్రమే పరిగణించే కళను నరసు తన జీవితాశయంగా పెట్టుకున్నాడు. అందుచేత ఇద్దరూ కలిసిమాట్లాడేది ఏమీలేదు. (సశేషం)



# సాము



జగజ్జేగీయమానంగా ఉంది, - స్వామి వారి-మోహినీవేషం! పూర్వాశ్రమంలో సువాసినులుగా ఉన్న ధోవతి మేలిముసుగులుమాత్రం, - కనులపండువుగా ఆ వైభవాన్ని చూసిపోతున్నాయ్: అవరణలో,అసువైనచోటల్లా చదికిలబడి, పిల్లతల్లులు ఆపసోపాలుపడుతున్నారు: మరీ దోరపడుచులు, ఒకరినొకరు రాచుకుంటూ ఒకచోట కాలు నిలువకుండా, అరప్రదక్షిణాలూ, పావు ప్రదక్షిణాలూ చేస్తూ, మళ్ళీ మొదటికి వస్తున్నారు:

బుచ్చన్నకు, ఆయేడే బొడ్డు ఊడింది: సెనక్కలుతిని, చేతులు కాళ్ళకు రాచుకుని, - మామ్మని అడిగాడు - దేవుడు మొగాడుకదా ఆడవేషం ఎందుకు వేశారని - ఆవిడ, ముక్తసరిగా అంతే అంది: మళ్ళీ అడిగాడు - నోరు ముయ్యమంది!

మామ్మకే తెలియనప్పుడు - యింట్లో వాళ్ళను ఎవరినడిగినా లాభం లేదనుకున్నాడు! మర్నాడు యకాయకిని వెళ్ళి, నంబికొండయ్యను అడిగాడు: ఆయన, - ఎందుకన్నాడు: వీడు,తడుముకోకుండా,- బళ్ళోపాఠం! అన్నాడు: అయితే సరేనని, విడమరచి, - పైచదువులకుకూడా పనికివచ్చేట్లు, - విష్ణుమూర్తిని, ఫాలాంకయ్యా పెట్టిన రభసా అంతా చెప్పాడు: చెప్పిచెప్పి - ఎలా ఉందన్నాడు- వాఁనారంగా అన్నాడు బుచ్చెన్న -

ఓనాడు, - వాళ్ళ అక్కయ్య నడిగి,- లంగా, ఓణీ వేయించుకున్నాడు - అక్కయ్య, - మామ్మదగ్గరకు జరజరా లాక్కునివెళ్ళి - యీ పిల్లెవతో చెప్పుకోవే అంది!-ఆవిడ, నీకిదేం పొయ్యేకాలంరా భడవా!-ఇంట్లోఉన్న సంచు చాలకనా!- అని కసిరింది! - పరికిణీ అయితే కట్టావు కాని, - జుట్టు పట్టిచ్చిందిరా అబ్బిగా! అని నవ్వుకుంది, - తల్లి! - అంతేకద, -పెంచుకుందామనుకున్నాడు.

నాన్న నోరెత్తితే - తిరుపతిపేరెత్తాడు; ఆయన చెంపలు వేసుకుని ఊరుకున్నాడు;

బుచ్చన్నకు పెరిగిపోతూంది: జుట్టు,- జులపాలుకూడా - ముడిలో కలిసిపోయినాయ్ - మొగచెంపలొచ్చినాయ్ -

బుచ్చన్నకు అస్తమానం అదేపని - ఆడది కంటపడగానే అట్టె పరకాయించి చూడటం - ప్రతివంపూ, పుస్తకం చదివినట్టు చదువుకోడం - ఒంటిగా ఏచెట్టు క్రిందోకూర్చుని, - అవన్నీ వర్ణించడం- ఒంటపట్టించుకోవడం - గొంతు వంచుకోవడం-

మల్లాది రామకృష్ణశాస్త్రి

ఇలా ఇలా, - జరగ్గా - రేపల్లెవాడలో గోపెమ్మలందరూ యశోదమ్మతో యాగీ చేసినట్లు, - ఊళ్లో ఆడపుటకలన్నీ, బుచ్చన్న తల్లిని దూయబట్టుకున్నాయ్- అవిడ, చాటుగా మాటుగా, - ఇది తగదురా నాయనా! - అని బుజ్జగించి చెప్పిచూసింది. అనోటా అనోటా తండ్రి దాకావచ్చి, ఇలాటి వెధవ వేషాలు మానేదాకా, యింట్లో తిండిపెట్టొద్దు - అని, అయన తేగేసిచెప్పాడు.

చెప్పేనాటికి, బుచ్చెన్నకు పరికిణీ వయసు దాటింది: నరేననుకున్నాడు: తల్లి చీరా రైకా చేతబట్టుకున్నాడు: గుళ్లోకి వెళ్లి కట్టేసుకున్నాడు: ఓయిన్ని ముద్దగన్నేరు పూలు సిగలో పెట్టుకున్నాడు: అసలు తాలూకు పంచా, వల్లే, మంటపం ఎలిసెలో దాచేశాడు: టింగు రంగా మంటూ మేనమామగారి ఊరికి బయలుదేరాడు:

సరిగా మిట్టమధ్యాహ్నానికి, - ఆ యింటికి చేరుకున్నాడు: గుమ్మంలో కాలుపెడుతూనే - ఏం మామయ్యా: అన్నాడు: అయన ఉలిక్కిపడి - ఎవరమ్మా అన్నాడు! - నేను-మాచాంను అన్నాడు బుచ్చన్న. అంటూనే పక్కను కూర్చున్నాడు - మామయ్య కొంచెం జంకుగా బుజంమీద చెయివేసి, - అని నీకదుపుడకా, నీవుటే - అమ్మా వాళ్లేరీ? అంటూ, నిలుచునేయత్నంలో ఉన్నాడు-

ఎవరూ - రాలేదు :-

రాక ? -

నేను, పారిపోయివచ్చా, మామయ్యా:-

ఆహాఁ -

అఁ - తెలిస్తే - రానిస్తారా ? - ఉన్న సయోధ్య తెలియకనా ? -

అయితే - ఎందు కొచ్చావే? -

పెళ్లి చేసుకునేందుకు : -

ఎవరిని ? -

తమరినే! -

- మామయ్య యీ మాటతో, గోడకు జారగిలపడ్డాడు -

- అవును మామయ్యా! - నాకన్నీ తెలుసు! - నేను పుట్టగానే నాపెళ్లాం పుట్టిందిరో అని, - సంబరపడ్డావుట కాదూ? - మానాన్న కాదనడంతో - రాక పోకలే లేకుండా పోయినాయే! మా అమ్మకైతే ఉందికాని,-అయింటో అవిడ మాట సాగుతుందా? - యిన్నాళ్లూ పడుంది - నాకు కాస్త బుద్ధితెలియగానే యిదీ సంగతి అని చెప్పింది - అమ్మే యీ ఉపాయం చెప్పింది! మంచి రోజు చూసి రెండో కంటివారికి తెలియకుండా పంపేసింది! - మూడుముళ్లూ పడిన తరువాత - నాన్న ఎంత గింజుకుంటే - మటుకు ఏంచేయగలడు: మహాచేస్తే - అమ్మను తన్ని తగిలేస్తాడనుకో! - మా బాగే! — వచ్చి, మనదగ్గిరే ఉంటుంది!—

—మామయ్యకు, యీ పథకం నచ్చింది! - అరాత్రికి రాత్రే - పక్క ఊళ్ళో గుళ్ళో, - మామయ్య ఓయింటివాడైనాడు:

నాన్నమీద నాకసీ నీకసీ, - యిప్పటికి తీరింది: యిక నేను వెళ్లివస్తా మామయ్యా! - అన్నాడు బుచ్చెన్న.

ఎక్కడికి ?

మా పుట్టింటికి! -

ఎందుకూ ? -

భాగవతం అప్పుడే అయిపోయిందా!- నేను, ఏమీ ఎరుగనట్లు వెళ్ళిఉంటా.

రేపీపాటికి మంచిరోజుచూచుకుని, నీవ వచ్చి,-నాపెళ్ళాన్ని పంపించమని మామ గారి మొగాన్నే అడిగేయ్! - ఆలగోలూ బాలగోలూ అయితేమట్టుకు, - కట్టిన సూత్రం తెంపలేడుకద! - నలుగురిలో బుద్ధిచెప్పి నన్ను నలక్షణంగా తెచ్చుకో!-

మామయ్యా, - నరే అన్నాడు కాని,- ఒక్కతెనూ పంపడం ఎలా? - ఊరి పొలిమేరదాకా సాయం వస్తానన్నాడు: ఇల్లాలు చెప్పినట్టు వినడం - ఇప్పటి నుంచే నేర్చుకోవాలని హెచ్చరించి,- యిల్లాంటి పతివ్రతకు, - ఎప్పుడూ పంచ భూతాలూ తోడుగా ఉంటాయని, నమ్మించి, - బుచ్చన్న వెళ్లిపోయినాడు. వెళ్ళిపోయి. - మూడేళ్లు నిండినాయ్ - అచ్చన్నగారు - అనగా బుచ్చన్న తండ్రి,- భావమరిది, పెళ్ళికొడుకల్లే వచ్చి అడ గటంతోనే, - కొడుకుచేసిన దురాగతం యిదీ అని తెలిసినా,-గుక్కతిప్పుకోలేక,- పెళ్ళాం త్రాచల్లేలేవడం - అసలు పిల్లది మెత్తబడడంతో, - ఆ పెళ్ళి అబద్ధ - యీ పెళ్ళి నిబద్ధి అనిపించి, - అక్కను ఉండ బట్టలేక, - జంధ్యాలు తెంపుకున్నంత అఘాయిత్యంతో, - కాశీకంటూ యింటి నుంచి లేచిపోయి,-ఓనాడు రెండు చేతులా సంపాదించిన ప్రాణమో, - కాశీ మాట మార్గమధ్యంలోనే మరచిపోయి, - మళ్లీ ఓవిడత నంస్థానాలచుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ - దక్కిన వరుమానం ముద్ర శుద్ధిగా యింటికి పంపిస్తూ - నువారపు భోజనాలతో, - కొత్తనత్తువ పట్టి, - నిగ నిగవచ్చి - యింటిమీద ధ్యానమళ్ళీ వస్తూండగా-

త్రోవలో, - ఓ తగుపాటి జమీందారీ తగిలింది: అక్కడ మళ్ళీ దుశ్శాలు వలూ, - దోసెడు వరహాలూ మూటకట్టు కున్నాడు: నిందునభలో ఓ చిన్నది నాట్యంచేయడం చూశాడు: చూసి తల క్రిందులైనాడు: వేదంకూడా చెప్పుకున్న పిడుగు కనుక - వెనుకాముందూ అంచా యించకుండా, - తిన్నగా, ఆ చిన్నదాని విడిదికి వెళ్ళాడు:

పండితుణ్ణి - దయచేశానని హజారం లోకి కబురుచేశాడు: దయచేయవలసిం దని - బదులు వచ్చింది:

—వచ్చి, ఎదుట నిలుచుని, నవిన యంగా నమస్కరించింది, ఆ చిన్నది:

దీవించిపోదామని వచ్చా - నన్నాడు:

దీవించడమే - తమవంతు - చిన్నది చనవుగా నవ్వింది:

అచ్చన్న గొంతు నవరించుకొని, - వల్లించిన పననలన్నీ ఓక్షణం మరచి పోయి, - విక్రమోర్వశీయంలోంచీ, అమరుకంలోంచీ, ఒకటో ఆరో శ్లోకాలు చదివి,-ఓపిక ఉన్నంత అర్థం చెప్పడం ప్రారంభించాడు:

చిన్నది - విన్నంతసేపూ, నవ్వు ఆపకుండా - లోపలికివెళ్లి,-దోసిలినిండా మొహరీలు తెచ్చింది:

నేను సంభావనకు రాలేదు! - అని రుంజుకున్నాడు:

- ఎందు కొచ్చారో తెలుసు! - కాని వట్టిచేతుల్తో ఎలా పంపను? -

పండితుణ్ణి - ఏకపత్నీవ్రతుణ్ణి - ప్రాధేయపడుతున్నాను -

- పడుతున్నారని, - పాపం అని కనికరిస్తే - అది ప్రణయం అవుతుందా స్వామీ! - నేను పతివ్రతను కానుగాని,- పురుషులంటే పరమ - ఏవగింపే!-

అదేమిటి?

బ్రహ్మ అలా వ్రాశాడు: నేనూ, అమ్మ అయ్యకు కన్నబిడ్డనే, - చిన్నతనంలో, నన్నో రంభ చేరదీసి, - తనంత వానికి తెచ్చింది! - నన్ను ప్రేమించింది! - ఎప్పుడూ కౌగిలి ఏమిరనిచ్చేదికాదు-

దానిపేరు వాత్సల్యం!-

నేను పెట్టిన పేరు ప్రేమ - అనాటి నుంచీ, - ఈ గడియదాకా, ఛప్పన్న దేశాలూ తిరిగాను: విద్యలో సెబాస్ అనిపించుకున్నాను! ఎందరో కన్నెలను వారుకోరినతీరున: ప్రేమించాను; ఎవరిచేతా కాదనిపించుకోకుండా, అచ్చటా ముచ్చటా పడి వచ్చాను: రాక రాక మీవంటినజ్జనులు, - ఈ కలాపానికి రావడం - నేను ఔనని ఆదరించేందుకు నోచుకోలేకపోవడం - బాధగానే ఉంది; కాని, ఏంచేయడం? - ఇలా పుట్టాను! - అంతగా కాదు కూడదంటే, మన సిస్తాను గ్రహించండి.

దాన్ని ఏం జేసుకోను, - నాకు ఏమిటి తారకం?-

నన్ను తలచుకుంటూ ఇంటిపట్టునే - ఆ మక్కువ తీర్చుకోండి!-

అనంభవం! - ఇక్కడే తపస్సుచేస్తూ కూర్చుంటాను!

అదీ మా బాగే! - సెలవైతే అమ్మగారినికూడా రప్పించి,-మీదంపతులను అనుదినం సేవించుకుంటుంటాను! - చేతనైతే-ఏవైనా చూసి నేర్చుకుంటాను-

నన్ను - ఎందుకిలా చంపుతావ్!-

ఎంతమాట!-ఎందుకు చంపుతాను!- అంతులోనూ, మిమ్మల్నా?

అయితే రక్షించు!-

అచ్చన్న పట్టుతప్పి అమాంతం మీదకు ఉరికి కౌగిలించుకున్నాడు - ఎమికలు విరిగాయ్ - నాన్నా! - అని బుచ్చన్న కెవ్వుమన్నాడు!-





# నేపథ్యం

ప్రేక్షకులందరూ రంగస్థలంవైపు ఏకాగ్రతతో చూస్తున్నారు. నటకుని నటనాచాతుర్యం అందరినీ తన్మయుపరుస్తోంది. ఒకరినొకరెరుగని వందలాదులూ ఒకే విచారభావంతో రసైక్యతను సిద్ధించుకుంటున్నారు.

కాని మూర్తి రంగస్థలంవైపు చూడట్లేదు. ఇద్దరికావలనున్న ఆమె ముఖమే ఇప్పుడతనికి మనోహరమైన రంగస్థలమైంది. ఆమె నాటకం శ్రద్ధగా చూస్తోంది. ఈ అపరిచితుని చూడలేదు.

మూర్తి మధ్యమధ్య పక్కనే కూర్చున్న భార్యను పరికించుతూనే ఉన్నాడు. సావిత్రి తోటిప్రేక్షకులతోపాటు కల్పిత మాధుర్యంలోనే మగ్నమైఉంది. కథ, నటన ఆమెకు బాగానచ్చి, అప్పుడప్పుడు కళ్లు తుడుచుకుంటోంది. భర్తకనునటన ఆమెకు తెలియదు.

ఒకింతసేపు మూర్తి మనశ్చాపల్యాన్ని గర్హించుకొని, తదేకదీక్షతో రంగస్థలంవైపుచూశాడు. కాని అతని అధికారానికి అంతరాత్మ తలొగ్గలేదు. అతని యావచ్ఛక్తినీ పరాజయంలోముంచి, రెండు కళ్లూ ఆ చంద్రబింబంవైపే రెప్పలు వాల్చకుండా చూస్తున్నయ్.

ప్రేక్షకులలో ఎంతమంది స్త్రీలులేరు? వాళ్ళందరికేసి తాను తెగబడి, సంస్కారవిహీనునిలా చూశాడా? అసలీ నేత్రానందం మూర్తి కంత ఇష్టంకాదు. అన్యోన్యమైన దాంపత్యసుఖంలో అతనెప్పుడూ పరస్త్రీ కింత పరాధీనుడై ఉండలేదు. కాని ఈసారి ఈ అపరిచిత ఎవ్వరో అతనికి కొత్తగా అక్షరాభ్యాసం చేయిస్తోంది.

పరపురుషుడు తనకేసి చూస్తూండటం ఆమె ఒకసారి గమనించింది. అది గ్రహించి మూర్తి లజ్జపడ్డాడు. అవమానంతో అంతరాత్మ వ్యథపడ్డది. తనకి సౌందర్యవిక్రీడ అభిమతంకాదు. ఆపద్మవ్యూహంలో తానింతవరకూ ఎప్పుడూ ప్రవేశించలేదు. సభల్లో, సమావేశాల్లో, రైలుస్టేషన్లలో, టీపార్టీలలో నేత్రాల స్వైరవిహారమతనికితెలుసు. కాని తాను కూడా ఈరాత్రి సౌందర్యానికి పరవశుడై,

వి. సహజానంద

ఆయువతిని నిశ్శబ్బంగా. మధురంగా కళ్లతో పలకరించాలని చూస్తున్నాడు.

ఈ అపరిచిత ఎవ్వరో? భర్తతోగాని, సోదరులతోగాని, ఎవరితోగాని కలసి వచ్చినట్టులేదు. ఒంటరిగానే వచ్చింది.

అతని మనస్సు నిలకడ తప్పింది. నాటకం సాంతంకాకముందే మూర్తి లేచాడు. భార్య ఉలిక్కిపడ్డది. అసంతృప్తితో, అయిష్టంగా భర్తవెనుక వెళ్లింది. రసభంగం జరుగుతోందని పక్కవాళ్లు, వెనకవాళ్లు పెదవులు విరుచుకున్నారు - తమ మధ్యనుంచి వెళ్తున్న దంపతులనుచూసి.

మధ్యలోనే ఆ అపరిచిత పురుషుడు వెళ్లినందుకు ఆమె తృప్తిచెందింది. కాని అతనొక్కడేకాదు, పలువురు తనకేసి చూస్తున్నారు. తను ఈ ఉద్రిక్తనేత్రాల కాహుతి అవటం తప్పదు. పడగల్పెత్తిన ఈ పురుషవాంఛలకు గురి అవటం లజ్జాకరం.

కొంతసేపయాక ఆమె కూడా లేచి వెళ్లిపోయింది. ఈసారీ ప్రేక్షకులు పెదవులు విరిచారు. కాని నాటకాని కామె అడ్డువచ్చిందనికాదు. మధ్యలోనే తమ కళ్ళ కందకుండా వెళ్ళిపోయిందే అని.

*　　*　　*

నాటకం బాగాలేదని మూర్తి నంజాయిషీ చెప్పాడు భార్యకు - మధ్యలో వచ్చేసినందుకు. సావిత్రి ఒప్పుకోలేదు. "అదేమిటండీ! అత నంత బాగా నటిస్తుంటె? నిజంగా నా కళ్ళలో నీళ్లు గిర్రున తిరిగినయంటే నమ్మండి" అంది.

కాని మూర్తి తను చూసినవిషయం గురించి వాదానికి పూనుకోలేదు.

'ఆ! ఏం నాటకాలు....విసుగుపుట్టు తోంది" అని కళ్లుమూశాడు.

సావిత్రికి నిద్రపట్టింది. మూర్తికళ్లకు కునుకు రావట్లేదు. కనుపాపల్లో పరాయి స్త్రీ ప్రతిబింబాలు నిత్యం మెదులుతూనే ఉన్నయ్. ఆమె కళ్లు...ఆ ముక్కుతీరు.... ఆ ఛాయ....అందం అతన్ని అతన్నుంచి దూర సుదూరసీమల్లోకి పెనవైచి లాక్కుపోతున్నయ్. ఆమెను చూసినప్పటి నుంచి ఏదో నిద్రమత్తులోంచి మేల్కొన్నట్టుంది. గుడ్డివాని కొక్కసారిగా తటిత్తున కళ్లువచ్చినట్టు.

మనోదౌర్బల్యానికి నిందించుకున్నాడు. ఈవిషయం సావిత్రి పసిపట్టితే? ఇదేదో దుర్విధి పన్నిన వల! ఈ అయిదేళ్ళ కాపురంలోనూ దాంపత్యంలో ఏవిధమైన విరక్తిగాని, విముఖత గాని లేదు. ఏ పరస్త్రీకూడ తన్నింతగా ఆకర్షించలేదు. ఏ పరస్త్రీ సాంగత్యం కోసమూ తను కలవరించలేదు. కాని ఈరాత్రి అనుకోకుండా, అనివార్యంగా మనస్సు ఇంకో గుమ్మంవైపు తనకాళ్ళ నీడుస్తోంది.

ఛస్! ఎంతమంది నిత్యం కనబడటం లేదు. ఈమెకన్నమటుకు అందకత్తెలు ఉండరూ? ప్రతి అందకత్తెనూ వాంఛిం

చటమేనా? నిద్రపోయిలేస్తే, ఏదో పిచ్చి కలవచ్చిపోయినట్లుంది. తెల్లవారితే, మళ్లీ తనమనస్సు తన అధీనంలో ఉంటుంది.

నిశిరాత్రి దాటాక సావిత్రి మెలకువ వచ్చి లేచేటప్పటికి, మూర్తి కొంచెం కంగారుపడ్డాడు. కిటికీ కానుకొని చీక ట్లోకిచూస్తున్న భర్తను సావిత్రి అడిగింది. "ఇంకా నిద్రపోలేదేం....ఏమిటీ ఆలో చిస్తున్నారు?" అని.

"అబ్బె....ఏంలేదు. ఏదో పీడకల" అని మూర్తి, భార్యవేసిన లైటుతీసి పడు కున్నాడు.

కాసేపటికి సావిత్రి మళ్లీ గుర్రుకొట్టు తోంది. కాని మూర్తి చీకట్లో కళ్లుతెఱచే చూస్తున్నాడు. ఆ అజ్ఞాతసుందరి ఒక్కత్తే కాదు,. అత నిదివఱలోచూసిన సుంద రులు కొంతమందికూడా అతనికా చీకట్లో కనబడుతున్నారు. అన లతని యావత్తు దృష్టి, ధ్యాసా ఎరిగిన, చూసిన స్త్రీలపైనే ఉన్నయ్. అంతేకాదు, అనుక్షణం వాంఛాపిపాస తీవ్రమవుతోంది. విస్మృతి యొక్క శయ్యాగారంలో నిద్రించిఉన్న ఈ పరస్త్రీలంతా ఇప్పుడు ఒక్కొక్కరే మేల్కొని, తమ మనోజ్ఞమైన, అలభ్య మైన సౌందర్యంతో సమ్మోహపరుస్తు న్నారు. ఆమె ఒక్కతే అద్వితీయసుందరి అని తన మనస్సు ఆమెనే ధ్యానించ ట్లేదు. పంజరమునుంచి తప్పించుకొన్న పిట్ట చెట్టునుంచి చెట్టు కె[illegible], ఒక కొమ్మవిడిచి మరొక కొమ్మపై [illegible] సర్వత ఎగురుతోంది. తన నియమము, నిగ్రహము తనకే నవ్వువచ్చినయ్. బుద్ధి మంతుడు, పెద్దమనిషిఅన్న బిరుదులు హాస్యాస్పదమలైనయ్.

కాని ఎంత హాయిగాఉంది ఆమెను చూస్తున్నంతసేపూ! ఎంత సుఖం! అయి దేళ్ళ దాంపత్యసుఖాన్ని ఒక్కక్షణంలో మఱపించిన హాయి! చీకటింట గభు క్కున దీపాలు వెలిగినట్లు. శూన్యా కాశంలో హఠాత్తుగా రమణీయంగా మేఘాలు కమ్మినట్టు....కళ్ళకు కట్టవచ్చి నట్టు ఏమివెలుగు ఆ ముఖంలో! ఆమే అలా ఆయిష్టంగా చూసిఉండకపోతే! జన్మతరించేది. కమ్మని పాట వింటు న్నట్టు, మనోహరమైన దృశ్యము చూస్తు నట్టు....కాని....చూడగూడని చూపు. తలచగూడని తలపు. కోరకూడని కోరిక. ఈ ఉత్తుంగతరంగాల్లోంచి, సుడిగుండా ల్లోంచి బైటపడి ఒడ్డుకుచేరేవా రరుదు.

పక్కనే ఆవల మంచంలోనే సావిత్రి పరున్నా, మూర్తి ఆమెకు యోజనాల దూరంలో ఉన్నాడు. తెల్లవారి లేచి ఆమెతో మాట్లాడినప్పుడుకూడా, ఆ మాటలు తన కెక్కడినుంచో, అర్థరహి తంగా వినబడుతున్నయ్. ఆమె ముందు అతనిముఖం మామూలుగాలేదు.

* * *

"ఏమండీ అలా ఉన్నారు?"

"ఎలా ఉన్నా...తలనొప్పి..." అన్నాడు మూర్తి.

"అమృతాంజనం....

"ఏమివొద్దుగానీ, కాస్సేపు పలకరించకు" అన్నాడు మూర్తి.

ఇంతకన్న భార్యాత్వానికి దుర్భరం మరొకటిలేదు. వెంటనే అందుకుంది.

"ఏమి చిత్రమండీ....నేను మాట్లాడితేనే మీకు తలనొప్పి వచ్చేట్టుందే!"

"అబ్బ...."

"ఇదివఱకటి ధోరణిలేదు....ఎప్పుడూ మౌనం...ఎక్కడకో చూడటం..ఏమన్నా అంటి మందు అక్కరలేని ఈ తలనొప్పి ఒకటి....బాగానే ఉంది."

"అయితే ఏమంటావు?"

"చెప్పమంటాను - ఈ గొడవ అంతా ఏమిటో....మొన్న మా అన్నయ్యవచ్చి, 'ఇదేమిటే .... బావ ముభావంగా ఉంటున్నాడు. మీమధ్య సరిగా ఉండట్లేదా?' అన్నాడు" అంది సావిత్రి.

మూర్తిగుండె ఒక్కసారి కలుక్కుమంది. అతనికళ్ళు బాధతో రెండుమూడు సార్లు తొందరతొందరగా ఱెప్పలు వాల్చినయ్.

"ఏంలేదే సావిత్రీ....ఎప్పుడైనా నీమీద కోప్పడ్డానా?" అన్నాడు.

"ఛీ....అబద్ధం ఎలా చెప్పతాగాని.... మరెప్పుడైనా ఇలా అన్యమనస్కంగా ఉన్నారూ! ఏమైనా ఉద్యోగపు బెడదా? ఏమిటి మరి...." అంది.

"ఏంలేదుగాని వెళ్ళి త్వరగా వంట చేద్దూ! 'ట్రాన్సుఫర్' చేస్తానంటున్నాడు ఆఫీసరు. ఏంచేస్తాడో గోల" అన్నాడు మూర్తి"

"ఇదా విషయం. దీనికింత కంగారెందుకూ? అయితే ఎక్కడకూ" అంటూ సావిత్రి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

మాటవరసకు ట్రాన్స్ఫర్ అన్నాడు గాని, అయితేనే బాగుండేట్టుంది. ఆమె తరుచు తనకు అక్కడక్కడ ఒంటరిగా, భర్తతో కనబడుతూనేఉంది. కనబడ్డప్పుడల్లా తనలో కోరికలు భగ్గున మండుతూనే ఉన్నయ్. ఈ ఊరినుంచి మారితే ఈ పరిస్థితి తప్పవచ్చు. ఊరికే తోచిన ట్రాన్సుఫర్‌గురించి ఆలోచించటం ఆరంభించాడు. ఆ రాత్రి భర్త సరసాల్లో గాఢాలింగనంలో సావిత్రి నిశ్చింతగా నిద్రపోయింది.

* * *

అతనక్కడతిరిగి, స్నేహితులతో కబుర్లు చెప్పి, తొందరతొందరగా బస్సుకోసం నడవటం ఆరంభించాడు. వీధిఅంతా నిర్జనంగా ఉంది. పదడుగులు ముందుకు రాగానే కొంచెం దూరంగా ఏవో నీడలగపడినయ్. ఎవరో తనలాగానే బస్సుకోసం తొందరపడుతున్నారు. మఱింత తొందరగా నడవటం మొదలుపెట్టాడు.

ఎలక్ట్రిక్ దీపంవెల్తురులో ఎవ్వరో స్త్రీగా తన్పించింది. ఆమెముందు ఎవరో పురుషుడు....

అతను గభుక్కున నిలబడిపోయాడు. ముందున్నపురుషుడు ఆమెకడ్డంగా తిరి

గాడు. ఆమె అటు ఇటు చూస్తోంది. తను వాళ్ళ కగపడట్లేదు. చెట్టునీడలో తను నుంచున్నాడు. ఆమె వెనక్కి తిరిగింది.

ముందు నడుస్తున్న ఆ పురుషుడు కూడా వెనక్కి తిరిగి, మళ్ళీ ఆమెకు అడ్డంగా వచ్చాడు.

మూర్తి నాలుగడుగులు ముందుకు వేశాడు. ఆమె కంపితస్వరం స్పష్టంగా వినబడ్డది. గబగబా వాళ్ళవైపు వెళ్ళాడు. ఈ పరాయివాని అలికిడివిని ఆ మనిషి అంతకుమునుపు వెళ్తున్నవైపే చరచరా వెళ్ళిపోతున్నాడు.

ఆమె ఆవేశంతో, భయం తగ్గుతున్న సంతోషంతో, ప్రమాదంలోంచి తప్పుకున్నామనేస్వరంతో "దేవుడిలావచ్చారు. నమస్కారం" అని తలెత్తి అతన్ని చూసింది. కృతజ్ఞతతో విప్పారిన ఆ విశాలనేత్రాల నతడు స్పష్టంగా చూశాడు. ఆకళ్ళల్లో, సంతోషాన్ని వెలిగక్కుతున్న ఆ కళ్ళలో ఆ క్షణంలోనే నివ్వెరపాటు, ఏదో భంగపాటు - వెంటనే కనుపించినయ్. ఆమెముఖం ఆశ్చర్యజనితమైన భయంతో వెలవెలబోయింది. ఉద్వేగంతో వెలువడుతున్న స్వరం మధ్యలో ఠక్కున ఆగి, జీరవోయింది.

అతనిగుండె చివుక్కుమంది. ఆమె వాలిన నేత్రాల్లోంచి, ఆ తెల్లవోయిన చూపుల్లోంచి ఏదో శూలం దూసుకొవచ్చి గుండెలో గుచ్చుకున్నట్టయింది.

ఆ సంతోషం, కృతజ్ఞత తనముఖాన్ని చూచేసరికి ఆమెలో మాయమై, తల వాల్చుకుంది. అవమానం అతని హృదయాన్ని నులిమివేస్తోంది. తను ఆమెను పరపురుషునినుంచి రక్షించినవాడేకాదు. అతని కళ్ళముందు ఒక్కుమ్మడిగా రంగస్థలము, ప్రేక్షకజనము, తను, ఆమె....అన్నీ తటిత్తున గోచరించినయ్.

"పదండి....ఇంటివద్ద దింపుతాను" అన్నాడు జీవంలేని స్వరంలో.

ఆమె క్షణమాత్రం మాట్లాడలేదు.

"భయంలేదు. మిమ్మల్ని దింపి నే వెళ్తాను" అన్నాడు.

అతని స్వరంలో వ్యథ ఆమెకు విన్పించింది.

ఇద్దరూ ఒకరివెనకాలే ఒకరు వెళ్లారు.

మధ్యలో పలకరించాలనుకున్నాడు. కాని ఆమె అలా తలవాల్చుకొని నడుచుకొపోతుంటె, సాహసించలేకపోయాడు.

మధ్య పెద్దచెట్టు ఒకటివచ్చి, చీకటిగా ఉంది. ఆమె ముఖాన్ని, ఆ అద్వితీయ సుందరముఖాన్ని, ఒక్కసారి చేతుల్లోకి తీసుకొని, ఆవిశాలనేత్రాల్లోకి చూడాలనుకున్నాడు. అనుకోకుండా, ఒంటరిగా ఈ అపూర్వసుందరి తనకు దగ్గరైనా, అతనికింకా అలభ్యంగానేఉంది. అంతేకాదు, ఉభయులమధ్య అగాధప్రవాహ మొకటి భయంకరమైన నిశ్శబ్దంతో ప్రవహిస్తూ, తను ఒక ఒడ్డున, ఆమె మరొక ఒడ్డున ఉన్నట్టుంది.

ఆమెభుజంపై, చెయ్యివెయ్యాలనుకున్నాడు. కాని తన గుడ్డిసాహసానికి తనకే నవ్వూ, సిగ్గూ కలిగినయ్. "దేవుడిలావచ్చారు" అంది తనను. ఇంతకన్న వజ్రాఘాతం లేదు తనకు.

ఆమె వెనక నడుస్తున్న అతనికి అడుగులు బరువుగా పడుతున్నయ్. ఆమెను ఊహించుకొన్నంత మాత్రానే వళ్ళు పులకరించిన అతని కిప్పుడు ఆమెతో నడవటం నిప్పులమీద నడచినట్టుంది. రోజులకొద్దీ కలలు కంటున్న ఆమె సాక్షాత్కరించింది. కాని ఆమెతో మాట్లాడలేకపోతున్నాడు. తనహృదయపు స్వాగతము విన్పించలేకపోతున్నాడు. వరం కోరలేకపోతున్నాడు.

దుర్భరమైన, కఠోర, వ్యథాభరితమైన మౌనం అంతులేని చీకటిగుహలా ఉంది. క్షణమొకయుగమై మణుగులబరువున్న ఇనుపసంకెళ్ళను మోస్తూ, నేల అంచు వరకూనడిచి, పాకాడవలసిన క్రూరశిక్ష ఏదో విధింపబడినట్టుంది అతనికి. ఏవిధి అయితే తనకామెనుచూపించి, తన్ను పరవశపతిచిందో, ఆ మహావిధే తన్నామె వెనక రక్షకునిగా నడిపిస్తూ, తన్ను రెండుగా చీలదీసి, తనలో అంతర్యుద్ధాన్ని చెలరేగగొట్టుతోంది. అంతర్యుద్ధ మెంత దారుణం? వందలకొలది విరోధిసైనికుల శరాఘాతములకు గురిఅవవచ్చు. కాని తను రెండై, తనపైకితాను విసిరే శర పరంపర దుస్సహము. హృదయము చిట్టడివియై, ఆకలిగొన్న మదసివంగుల గర్జనలతో ప్రతిధ్వనిస్తుంది! సప్త సముద్రము లొక్కుమ్మడి ఘోష పెట్టుతయ్.

ఆమె ఇంటిముందు ఆగి, తలుపు తట్టింది. పైనుంచి నౌకరువచ్చి తలుపు తీశాడు.

ఆమె తలెత్తి, "ఠండి పైకి" అని మెట్టుపై, కాలు పెట్టింది.

ఆ నిర్జీవ నేత్రాల్లో బలవంతంగా తెచ్చుకుంటున్న ప్రసన్నత అతను గమనించాడు. ఆపిలుపు మర్యాదకేనని అతనికి తెలుసు.

"నేనువెళ్తా" అని అతను గుమ్మం ముందేఆగి, లోపలకడుగుపెట్టక, వీధి మెట్లుదిగి, వెనక్కు రోడ్డు మీదికి వచ్చేశాడు. నౌకరు తలుపులువేసి పైకి పోయాడు.

మూర్తి కడుగులు పడట్లేదు.

పైనుంచి మాటలు వినబడుతున్నయ్.

"ఎవర్ని పైకి రమ్మంటున్నావు?"

"ఎవరేమిటి? ఆయనే రాకపోతే, ఇవ్వాళ నాగతిఏమయ్యేదో? ఎవడో నా వెంటబడ్డాడు. ఒక్కళ్లులేరు. పాపం. అప్పుడు ఆయన దేవుడులా అడ్డు వచ్చారు."

"అహా....అదా విషయం....ఆ ఏడుపెందుకు....ఎవడితోనో తిరిగివచ్చానని చెప్పకూడదూ! నాటకం అనే సాకెందుకూ?"

"ఛా....అదేమిటండీ....ఎప్పుడూ మీ కనుమానాలే...."

ఆమె కంపిత, హీనస్వరం మూర్తికి విన్పించింది.

ఒకసారి తలెత్తి, పై అంతస్తుకేసి చూశాడు. దీపాలన్ని వెలుగుతున్నయ్. భర్త ఏదో తీవ్రంగా మాట్లాడుకుపోతున్నాడు. మూర్తి మెల్లగా దారిపట్టాడు. వెనకనుంచి సన్నగా ఎలుగు వినబడుతోంది.

* * *

సావిత్రి ఈడు చుట్టం ఒకామె చూడటానికి వచ్చింది.

"ఏమే సీతా....మీఆయన ఎలాఉంటున్నాడిప్పుడు?" అని అడిగిందిసావిత్రి.

"ఆ! ఏమని చెప్పను. నన్నుచూస్తే పడదు. నా పొరుగు గిట్టదు. బైటకి పెళ్ళాం అని నేను, మొగుడు అని ఆయన తప్ప, దాంపత్యమూలేదు,పాడూ లేదు" అంది సీత.

"ఇంకా అలాగే ఉన్నాడా!" అని సానుభూతిగా అడిగింది సావిత్రి.

"ఆ! ఏమీ మార్పులేదు. ఎప్పుడూ ఎవరో స్నేహితుడుట వాళ్ళింట్లోనే పడివుంటారు. మరి ఆ ఇంటాయన ఎలా ఊరుకుంటున్నాడో...." అంది సీత.

క్షణంసేపు ఊరుకుని సావిత్రి అంది.

"పోనీ మీ అన్నయ్యచేత ఒకసారి చెప్పించిచూడు. నేనూ వారికి చెప్తాను."

"ఎవరిచేత చెప్పించీ లాభంలేదే సావిత్రీ...అనకూడదుగాని పుర్రెలోపుట్టిన బుద్ధి పుడకల్తో నేపోవాలి" అంది సీత.

గదిలో నిద్ర ఇంకా పట్టని మూర్తికి మాటలు చివుక్కుమనిపించినయ్.

సీత మళ్ళీ అరంభించింది.

"చూడు....ఎంతో ముచ్చటగా ఉంది మీ దాంపత్యం. ఎంతో అన్యోన్యం. మా అన్నయ్య నీమీద కోపబడటంగాని.... ఏమీ లేదు గదా....అదృష్టవంతురాలివి సావిత్రీ...." అంది సీత.

మూర్తికి నవ్వువచ్చింది. తన్ను గురించి సీత చేస్తున్న ప్రశంస, సావిత్రి పడుతున్న గర్వం చాటునుంచి వింటూ, నిద్రపోయాడు - ఆ అలభ్యసుందరి గురించి కలలుకంటూ.

తన నవ్వులు, చిఱునవ్వులు, సరస సల్లాపాలు, కౌగిళ్ళు వీటి తెఱచాటున నేపథ్యంలో అదృశ్యంగా, అజ్ఞాతంగా, రహస్యంగా జీవిస్తున్న మరొక మూర్తిని సావిత్రి ఎరుగదు. అంతేకాదు వ్యక్తము కన్న అవ్యక్త మెక్కువ నిజమని ఆమె కేమితెలుసు! బాహ్య, వ్యక్తజీవితపు సంతృప్తి, అసంతృప్తికన్న నేపథ్య, అవ్యక్తజీవితపు సుఖదుఃఖములు, విఫల వాంఛలు, రాగద్వేషములు ఎక్కువ ప్రాణప్రదములని ఈ అమాయికుల కేమితెలుసు?





రంగారామ్ ఎన్నో ఫిలుముల్లో నటించాడు. ఎందరో డైరెక్టర్లూ, ప్రొడ్యూసర్లూ అతనికి తెలుసు. వాళ్ళందరికీ తలకాయలున్నా, అవి సరుకులేని ఉత్తి సొరకాయలే అని అతని అభిప్రాయం.

అతని తెలివివల్లనో, వాళ్ళ తెలివి తక్కువవల్లనో అతనికి ప్రతీఫిలుముతోనూ ఆదాయపుపన్ను చెల్లించవలసినంత పెద్దమొత్తాలే ముట్టేయి. సొమ్ము చేరుతున్నకొద్దీ సొంతంగా ఫిల్ములు తియ్యాలనీ, 'ఆదర్శ దర్శకుడు' అనిపించుకోవాలనీ ఆసక్తి కలిగింది.

తెలుగు తమిళాలలో ఇంతవరకు ఎవడూ తలపెట్టని థీముతో ఫిలుము తియ్యాలనిపించిందతనికి. పల్లెటూరి బైతుల్నిమాత్రం ఆకర్షించే అసభ్యపు చెత్తాకారీ ఫిలుములకుమల్లేగాక చదువూ సంస్కృతీ ఉన్నవాళ్ళచే 'శభాష్' అనిపించుకోతగ్గ కథ తీసుకోవాలని ఆలోచించాడు. ఆలోచించి ఆలోచించి, ఏమీ పాలుపోక నిద్రపోయేసరికి కలలో అతనికి కాంతిపుంజమొకటి కనపడింది. అది క్రమంగా ఒక ప్రశాంతమైన ముఖంగా మారింది. ఆ ముఖం అతనితో మాట్లాడితే ఏం చెప్పిఉండేదో గాని, అతనికి మెలకువవచ్చేసింది.

సాయిబాబాదై యుంటుందా? కాదు; ఐనా సాయిబాబా ఫిలుము ఎవరో మొదలెట్టేరు. రమణమహర్షా? ఉహూ. హరనాథబాబాయేమో? ఎంతమాత్రం కాదు. మరెవరు?

అతడున్న వీధికి పుదుచ్చేరి బొమ్మలు అమ్మకానికొచ్చాయి. అమ్మదెచ్చినవాడు గంప దింపేసరికి అందులో రంగారామ్‌కి బుద్ధవిగ్రహం ఒకటి కనపడింది. తక్షణమే అతడు తన కలలో కనపడ్డది బుద్ధుడే అని నిశ్చయించుకున్నాడు.

ఆ నెలాఖరుకు వెలువడ్డ సినిమా పత్రికలలో, రంగారామ్ అనే ఆయన బుద్ధభగవానుడి చరిత్ర ఫిలుముగా తీయదలచినట్లు ప్రకటింపబడింది. బుద్ధుణ్ణి పోలిన నటుడు ఎవరైనా ఉంటే, ఇంటర్వ్యూకి రావలసిందనికూడా ఆ ప్రకటనలో ఉంది.

రంగారామ్‌కు తక్కిన తారాగణమంతా సంకల్పమాత్రంలో సమకూరిందే గాని కథానాయకుడే ఎక్కడా కనపడలేదు. 'ఏమిటి గత్యంతరం?' అని అతడు దిగాలుపడి చూస్తోంటే, ఆ బుద్ధభగవానుడే పంపించినట్లుగా అతనివద్దకొక మనిషి వచ్చాడు. వాడంతట వాడు రాలేదు; ఎవరో తీసుకొచ్చారు.

పాలంకి వెంకటరామచంద్రమూర్తి

రంగారామ్ సంతోషించి, 'మీ రేటు ఎంత?' అని అడిగేడు. ఆ 'బుద్ధుడు' ఏదో చెప్పబోతూంటే మధ్యవచ్చిన ప్రబుద్ధుడు వాణ్ణి మాట్లాడనివ్వక అడ్డు తగిలి, 'రంగారామ్‌గారూ, మీకు తెలియని దేముంది గనక? మరొకచోట పుచ్చుకుంటూన్న రేటుప్రకారం మీరు ఇప్పించండి!' అనేశాడు.

రంగారామ్, 'మీరుచెప్పిందిన్యాయమే అనుకోండి. కాని ఈయనెవరో ఇంకా ఫీల్డులో కొత్తగదా?' అన్నాడు.

'దానికేం లెండి. మీచేతిలో నలిగితే మూడునిముషాలలో ముల్లోకాల్లోనూ మించిన నటుడౌతాడు.' అన్నాడు. ఆ స్తోత్రం రంగారామ్‌కు గిలిగింత పెట్టింది. ఐతేం, డబ్బువిషయంలో కొంచెం జాగ్రత్తగా ఉండాలి. ఫిలిం తియ్యటం సామాన్యమా? తన సొమ్ము అంతా నటుల జీతాలకే పెట్టేస్తే తక్కిన ఖర్చుల మాటేమిటి? 'అయ్యా, నేను కళాభిరుచితో తీస్తున్నానీ ఫిలిము తారాగణం, పవివాళ్ళూ నాతో సహకారంచేసి, ఏదో కొద్దిజీతాలతో తృప్తిపడాలి. తర్వాత లాభాలొస్తే చూసుకోవచ్చు. ప్రస్తుతం ఈయనకి నెలకు వెయ్యిరూపాయలిస్తాను.' అన్నాడు.

ప్రబుద్ధుడు ఏదో అనబోయాడుగాని 'బుద్ధుడు' వప్పేసుగున్నాడు. మధ్యవర్తికి కోపంవచ్చింది. వచ్చినట్లు రంగారామ్‌కూడా గ్రహించాడు. "ఈ వేడి చల్లారకుండా 'బుద్ధుడి'చేత కాంట్రాక్టు సంతకం చేయించి పుచ్చుగోడం మంచిది. లేకపోతే ఈ మధ్యవాడు చెడగొడతాడు" అని తోచి, వెంటనే సంతకం పెట్టించాడు.

ఆ 'బుద్ధుడూ', 'ప్రబుద్ధుడూ' 'మళ్ళీ దర్శనంచేస్తామ'ని చెప్పి సెలవుతీసుకొని వెళ్ళిపోవటంతోనే, రంగారామ్ కాంట్రాక్టుమీద ఉన్న చేవ్రాలు యాధాలాభంగా చూశాడు. 'సుబ్బాయుడు వ్రాలు' అని ఉంది. సంతకంలో 'రా' లోపించిందని తెలియటంతోనే, 'అయ్యో, ఈ సుబ్బారాయుడు అంతగా చదువుకున్నవాడులా కనపట్టంలేదు. తను నటించబోయే భగవానుని జీవితచరిత్ర ఇతడు ఫస్టుఫారం హిస్టరీలోనైనా చదివుండడు' అని తెల్లమై అతగాడి గుండె గతుక్కుమంది. మధ్యవర్తి లేకుండా చూసి, అతడు 'బుద్ధుణ్ణి' కలుసుకున్నాడు. సుబ్బారాయుడు తన గతం అంతా మర్మంలేకుండా చెప్పేడు. "అయ్యా, నేను చదువుకున్నవాణ్ణికాదు. ఏలూరు హేమావతిమేళంలో ఫిడేలు వాయించి పొట్టపోసుకునేవాణ్ణి. హేమావతిని సినిమావాళ్లు తన్నుకుపోవటంతోనే ఆ మేళం చెదిరిపోయి, ముఖ్యంగా నేను ఇబ్బందిలో పడిపోయాను, 'నా గతేంగాను?' అంటూ హేమావతికి జాబురాయించాను. 'ఫిలుముల్లోకూడా ఫిడేలు వాయించేవాళ్లు కావఅసిఉంటారు, ఇక్కడకు రా' అని జవాబు వ్రాయించింది. నా వాయిద్యం ఇక్కడ ఎవళ్ళకీ నచ్చలేదు. 'రైలు టిక్కట్టుకి హేమావతినే యాచించి తిరుగుదారి పడదాం' అనుకుంటూంటే, రోడ్డుమీద ఎవరో ఒకాయన నాకు ఎదురై ఎగాదిగా పరి

కించటం మొదలెట్టేడు. 'ఏమిటి బాబూ? అలాచూస్తున్నారు?' అని నేను అడిగే సరికి, 'నువ్వు సినిమాలో యాక్టుచేద్దువు గాని, నాతో రా' అంటూ మీవద్దకు తీసుకొచ్చాడు.... మీరు ఇస్తానన్న జీతానికి నేను వప్పుగున్నందుకు నన్ను చాలా కూకలేశాడు. ప్రతీనెలా ఈ వెయ్యి రూపాయిల్లోనూ నేను వాడికి కొంత ఇవ్వవలసుంటుందిట! నిజమేనా బాబూ?" అన్నాడు 'సుబ్బాయుడు.'

'ఆదర్శ దర్శకుడు' రంగారామ్‌కి ఏంచెయ్యాలో తోచిందిగాదు. జ్ఞానదేవుడైన బుద్ధభగవానుని భూమికను ఈ అజ్ఞానవిథికా ఇవ్వటం? కాని గత్యంతరం యేమిటి? వీణ్ణి కాస్తా జారవిడిస్తే అలాంటి ముఖం మళ్ళీ దొరకదు. కవిగారితో చెప్పి, ఇతగాడికి సాధ్యమైనంత వరకూ డైలాగులు లేకుండాచేస్తే సరి! కాని కథానాయకుడాయె! నోరు విప్పనివ్వకుండా ముఖం చూపించి ఊరుకోడానికి వీలా? ఏదో తంటాలుపడాలి! ఆదర్శంగా ఫిలుము తీద్దామనుకుంటే గొప్పచిక్కే వచ్చింది! ప్రథమ కబళంలోనే మక్షికాపాతం!.... ఐతేం, ఒకందుకు తృప్తిగాఉంది రంగారామ్‌కి. సుబ్బారాయుడు బుద్ధుడికిమల్లేనే కనపట్టమేకాకుండా, బుద్ధుడికిమల్లేనే మర్మం ఆడంబరంలేని మనిషి! ఉన్న దున్నట్టుగా చెప్పేశాడు! సాత్వికుడు! ఎక్కడికక్కడికే తృప్తిపడాలిమరి! అన్నిగుణాలూ ఒక మనిషిలో పట్టమంటేపడతాయా?

కాని సుబ్బారాయుడికి తరిఫీజు ఇవ్వటంలో రంగారామ్ యేమీ శ్రమపడవలసిన అవసరం లేకపోయింది. ఏమంటే అసలు తరిఫీజు ఇవ్వటందాకా రానేలేదు. రంగారామ్‌కి ఆర్థికంగా సహాయంచేస్తానని ఆదిలో వాక్సహాయం చేసినవాళ్లొక్కొక్కరూ ఈ ఆదర్శ దర్శకుడు తమన్ని తుదకి ఏ గోతులో దింపుతాడో అన్న అనుమానంతో తమ రూపాయిల సంచుల్ని బయటకు తియ్యలేదు. రంగారామ్ సొంతసొమ్ము తారాగణం, ప్రమథగణాల మొదటినెల జీతాలకి సరిపోయింది. అతగాడు ధనాన్వేషణలో నిమగ్నుడై, రైలుప్రయాణాలు చేస్తుంటే వాళ్ళందరూ ఎవరి దారి వాళ్లు చూసుకోటం మొదలెట్టేరు.

మరో అలజడికూడా బయల్దేరింది. భారత దేశంలోకాదు; సింహళంలో. అక్కడివాళ్ళ కెలా ఉప్పందిందోగాని 'తమ' బుద్ధభగవానుని చరిత్రను ఇండియాలో ఫిలుముతీస్తున్నారని తెలిసింది! ఫిలుముతీస్తే తమ మతం అపవిత్రం ఐపోతుందని వారు మహజర్లు పంపేరు. దానితో కవిగారికికూడా ఆశవదిలిపోయి, 'బుద్ధం శరణం గచ్ఛామి' అనటం మానేశాడు. ఎవరో "పేదరాశి పెద్దమ్మ" ఫిలుంతీస్తున్నారని తెలిసి, అక్కడికి పోయి ఆ "పెద్దమ్మ" శరణుజొచ్చాడు.

సుబ్బారాయుడు ఏమైనదీ తెలీదు. అతగాణ్ణి రంగారామ్‌వద్దకు మొదట తీసుకువెళ్ళిన ఆ మధ్యవర్తిమాత్రం అతడికోసం కొన్నాళ్లు వృథాగా వెతికేడు.

ఒక పుష్కరం గడిచింది. రంగారామ్ ఏ ఫిలుమూ తియ్యలేకపోయినా అనుభవంమాత్రం పుష్కలంగా గడించాడు. 'చింత చచ్చినా పులుపు చావద' న్నట్లు ఫిలుం తియ్యాలన్నసరదా అలాగే

ఉండిపోయిం దతనిలో. తనచేత ఫిల్ము తీయించమని, వెళ్ళి వెంకునాయుణ్ణి ఆశ్రయించాడు.

"తీయిస్తానుగాని, బుద్ధుడూ, గిద్ధుడూ అంటే భత్యాలు కిట్టవు! డాన్సులూ, హాస్యం, ఎక్కువగా పెట్టి తియ్యాలి! మడిగట్టుక్కూచోకుండా పచ్చిపచ్చిగా, దోరదోరగా శృంగారంపెట్టాలి! అధమం ఒక బలీ, ఒకడో ఇద్దరో విలన్లూ ఉండాలి. కథ విషాదంగాఉండి సుఖంగా అంతమవాలి. ఏదో సందర్భంలో మహాత్మాగాంధీ సిద్ధాంతాలు తీసుకురావాలి!" అన్నాడు వెంకునాయుడు.

'అలాగే' నని రంగారామ్ తారాగణాన్ని సేకరించటం మొదలెట్టేడు. ఇదివరకు కథ తయారుచేయించి, పిమ్మట నటీనటులకోసం వెతికేడు.


"మొదట తారలను చూడు. 'బుక్' ఐనవాళ్ళ సామర్థ్యాలనుబట్టి. కథఅల్లవచ్చు. హీరోయిన్ పాత్రకు మా విద్యుల్లత ఉంది. తక్కిన విలనూ వగైరాలను చూడు" అన్నాడు వెంకునాయుడు. 'సరే' అని రంగారామ్ యాక్టర్లను ఇంటర్వ్యూకి పిలిపించాడు.

ఇంటర్వ్యూకి వచ్చిన విలనులందరిలోకి ఒకడి ముఖమే రంగారామ్‌కి నచ్చింది. "మిష్టర్, మిమ్మల్ని 'బుక్కు' చేస్తున్నాను. నెలకు ఐదువందలు జీతానికి వప్పుదలైతే ఇప్పుడే కంట్రాక్టు సంతకం పెట్టవచ్చు" అన్నాడు.

ఆ'విలను', "సంతకానికేం, పెడతాను కాని నా దొక్క మనవి" అన్నాడు.

"ఏమిటి ?"

"నా రేటుసగానికిసగం తగ్గించేశారు!"



"అంటే?"

"పన్నెండు సంవత్సరాలక్రితం మీరే నన్ను బుద్ధుడి పాత్ర నటించటానికి వెయ్యిరూపాయలచొప్పున బుక్కు చేసుకున్నారు."

రంగారామ్ విభ్రాంతపోయాడు. "ఆ సుబ్బారాయుడివేనా నువ్వు?"

"ఔను సార్."


"నేను నమ్మలేకుండా ఉన్నాను! ఆనాటి నీముఖం ఇంకా నాకు కళ్ళకు కట్టినట్లుంది. అది ప్రశాంతమైన ముఖం. ఆ చూపుతీరే వేరు. ఆ విగ్రహమే వేరు. చూసినప్పుడే నీకు ప్రణమిల్లాలి అనిపించేటట్లుండేది. ఇప్పుడో, నిన్ను పోల్చుకోటానికే వీలులేకపోతోంది! ఈనల్లబడిపోయిన ముఖం, ఈ లోతుకళ్లూ...."

సుబ్బారాయుడు నవ్వేడు. "డైరెక్టరుగారూ, మీకు సందేహం అక్కర్లేదు. నేనే అతణ్ణి. అవతారారం మారిపోయిందంతే. అప్పుడు బుద్ధావతారం, ఇప్పుడు గద్దావతారమున్నూ....చాలా కథ ఉందిలెండి. సావకాశంగా మరొకమాటు చెబుతాను. మీరు అప్పుడు ఇచ్చిన ఆ వెయ్యిరూపాయిలనూ పసిగట్టి, బెల్లంమిఠాయిమీద మూగే ఈగలకుమల్లే నాచుట్టూ స్నేహకోటి చేరింది. త్రాగుడు, జూదం, ఇంకొటి—ఇలాంటి విద్యలన్నీ నేర్పటంలో నా కొక్కొక్కడూ ఆచార్యత్వం వహించి, గురుదక్షిణక్రింద ఆ సొమ్ము వమ్ముచేయించారు. మళ్ళీ నెలజీతం వస్తోందికదా అనుకునేసరికి ఆ ఆశలేకుండా ఏం జరిగిందో మీకే తెలుసు. ఆతరవాత, సొమ్ముకోసం నేనెన్నిపాట్లుపడ్డదీ ఆ భగవంతుడికి తెలుసు, అన్నీ కాకపోయినా కొన్నిపాట్లు పోలీసువాళ్ళకి తెలుసు. చాలాసార్లు తప్పించుకుంటూ వచ్చానుగాని కాలం ఎప్పుడూ ఒకేలాగ వెడుతుందా? ఒకమాటు పట్టుబడ్డాను. జైలుజీవితం గడిపాను. పాత అఫెండరుగా వాళ్ళ లిస్టులో చేరిపోయినాను. నా నేరాలమాట అటుంచి ఎవడు నేరంచేసినా పోలీసుల దృష్టి నామీదే పడుతోంది. కనుక ఇంక బుద్ధిమంతుణ్ణవక తప్పదు. ఏం దారి అని ఆలోచిస్తోంటే, మీ ప్రకటన పడింది....ఇదివరకు బుద్ధుడి పాత్ర నటించవలసిన సందర్భంలో మీకు ఎటువంటి శ్రమ ఇచ్చేవాణ్ణో చెప్పలేనుగాని, ఇప్పుడు మీరు నాకు ఇవ్వబోయే విలను పాత్రలోమటుక్కు యే శ్రమా ఇవ్వనని ఘంటాపథంగా చెప్పగలను! ఏ సన్నివేశమైనా అవలీలగా అర్థంచేసుకుని, చూసేవాళ్ళ రక్తం గడ్డకట్టుకుపోయేటట్లు నిర్వహిస్తాను....చెప్పవచ్చేదేమిటంటే, నాకు ఇప్పుడుకూడా ఆ వెయ్యిరూపాయిలచొప్పున ఇప్పించండి."

"మిస్టర్ సుబ్బారాయుడూ, వెంకునాయుడుగారితో సంప్రదిస్తేగాని, చెప్పలేను. ఐదువందలకే నాకు అధికారం ఉంది."

"వారితో మాట్లాడేచెయ్యండి. రేపు మళ్ళీవచ్చి తమదర్శనం చేస్తాను" అని, సుబ్బారాయుడు లేచాడు. ఒకరెండు అడుగులువేసి తిరిగొచ్చి, రంగారామ్‌తో, "ప్రస్తుతం కొంచెం ఇబ్బందిలో ఉన్నాను. ఒక్క టెన్ రూపీస్ఇవ్వండి. లెక్కల్లో మినహాయించుకుందురుగాని" అని, పుచ్చుకుని వెళ్ళిపోయాడు.






జంగమశివరావు ఆవేళే విశాఖపట్టణం నుంచి సిరిపురం చేరాడు. తాను వస్తున్నానని చెప్పి ముందే తండ్రికి ఉత్తరం రాయడం వల్ల, ఇంటిలో అందరూ అతనికోసం అనుక్షణం ప్రతీక్షిస్తున్నారు. ఇంటివాకిటిలో జట్కాబండి వచ్చి ఆగింది. జంగమశివరావు తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, మేనల్లుళ్ళు, మేనగోడళ్లు ఇత్యాది పిల్లమూక అంతా బండి చుట్టు పోగయింది. బండిలోంచి దిగాడు జంగమశివరావు. అంతా దొరగారిలాగు ఉన్నాడు. దొరటోపీ తలనిఉంది. ఇస్త్రీచేసిన కాలరు కోటు, పంట్లాము, నెక్‌టై, కళ్ళకిజోడు, కాళ్ళకి నిగనిగలాడే పేటెంటులెదరు జోళ్లు, చేతిలో పొగరాజుకొంటూ సిగరెట్టు. రథాన్ని తీసుకొనివచ్చినట్లుగా అతన్ని లోపలికి తీసుకువచ్చారు. ఇంటిలో నౌకరు బండివాడుకలిసి సామానులు ఇంటిలో పడవేశారు. బోలెడంత సామాను! ఒకగదినిండా పరిచివేశారు! ఒకరకమేమిటి! పుస్తకాల పెట్టెలు, బట్టల పెట్టెలు, అలంకరణ సామగ్రి, ఆటలాడే సామగ్రి, ఒకటేమిటి! అంతా నవీనం! సరికొత్తవి! సిరిపురం శుద్ధపల్లెటూరు అవడంచేత జంగమశివరావు తెచ్చిన సామగ్రినంతా వినోదంగా చూశారు. ఇంటిలోవాళ్ళకి ఆరోజు పండగలాగు ఉంది.

జంగమశివరావు వేసంగి సెలవులకి ఇంటికి వచ్చాడు. మళ్లీ ఆంధ్ర యూనివర్సిటీ కాలేజి తీసేదాక ఏబాధాలేదు.

జంగమశివరావు తండ్రిపేరు సురూప శాస్త్రి. శాస్త్రికి నలుగురు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. భార్య ఇంకా కాన్పు ఎత్తిపెట్టలేదు. శాస్త్రిది పూర్వాచారంగా ఉంటూన్న కుటుంబం. అతని కాలంలో ఇంగ్లీషు చదువు మీద మోజు బాగా ఉండేది. కాని అందరికీ అందుబాటులో లేకపోయింది. ఊళ్ళో ప్రాథమికపాఠశాలేనా లేదు. అతని సంతానమంతటిలోకీ పెద్దవాడు జంగమశివరావు. కొడుకు చదువుకొన్నంతమట్టుకు ఇంగ్లీషు చదువు చెప్పించదలుచుకున్నాడు శాస్త్రి. కొత్తగా సిరిపురంలోనే ప్రాథమికపాఠశాల వెలిసింది. అందుచేత అయిదోతరగతి వరకు బాధలేదు. అటుతర్వాత దగ్గరలో ఉన్న చీపురుపల్లిలో తనకి తెలిసినవాళ్ళు ఉంటే, వాళ్ళ ఇంటిలోనే జంగమశివరావుని అట్టేపెట్టి అప్పటివరకూ

---

టేకుమళ్ల కామేశ్వరరావు

ఉన్న మిడిల్ స్కూలులో మూడో ఫారం వరకు చెప్పించాడు. కుర్రవాడు చదువు ఆడ్డి పోకుండా గెంటుకువస్తున్నాడు. దానిమీద శాస్త్రికికూడా ఉత్సాహం వృద్ధి అవుతూ వచ్చింది. హైస్కూలు చదువుకి విజయగరం వెళ్ళవలసివచ్చింది. తండ్రి శ్రమపడి మహారాజావారి సత్తరవులో పద్దువేయించాడు. స్కూలు ఫైనలులో ఉత్తీర్ణుడయాడు. కొడుకు పైచదువుకి అక్కడేఉన్న కళాశాలలో చేరమని తండ్రి పట్టుపట్టాడు. కొడుకుమాత్రం విశాఖపట్టణం వెళ్ళి చదువుతానని కొమ్మెక్కి కూర్చున్నాడు. 'సరే, ఇంటిదగ్గిర మనమే శ్రమపడదాం' అనుకొంటూ తండ్రి కొడుకుని విశాఖపట్టణంలో యూనివర్శిటి కాలేజీలో ప్రవేశపెట్టాడు.

జంగమశివరావుకి పల్లెటూరిలో కాలక్షేపమవటమే కష్టమయిపోయింది. కాలంవచ్చి పెనుభూతంలాగు మెడలమీద కూర్చుంటూందా అనిపిస్తూంది. పగలంతా పుస్తకాలతో కాలక్షేపం చేస్తాడు. సర్వసాధారణంగా ఇంగ్లీషుపుస్తకాలతోనే! అన్నీ సరికొత్త పుస్తకాలు! నవలలు, నాటకాలు, చిన్న కథలు, విలాసగ్రంధాలు, మాసపత్రికలు, ఇత్యాది వాఙ్మయం. వాటిలో మూడువంతుల ముప్పాతిక ప్రణయ రచనలే! సాయంత్రమయేక అయినా ఊళ్ళోకి ఎక్కడికిపోతాడు! నవనాగరికుడు! షోకుగా సిగరెట్టుకాలుస్తూ, గాలిపీలుస్తూ, తిరగడానికి ఇక్కడ సముద్ర తీరమా? లేక, సినీమాకు పోదామంటే సినీమా హాలా? లేక, ఏటెన్నీసో ఆడుకొందామంటే కోర్టా? ఇకమీద తాను ఏదేనాసృష్టించేదాకా సాయంకాలాలు ఇలాగువ్యర్థమవవలసిందే!

సురూపశాస్త్రి కుమారుడి పెళ్ళికోసం తొందరపడుతున్నాడు. కొడుకు ఇంటర్ పరిక్ష ఈఏడాదే ఇచ్చాడు. దైవానుగ్రహంవల్ల ప్యాసవుతాడనే అందరి అభిప్రాయమున్నూ. ఇంతవరకు అన్నితరగతులలోను నెగ్గుకు వస్తూన్నందువల్ల, చదువుసంధ్యలనిబట్టి కొంతవరకు ముందే చెప్పవచ్చుకదా!

సంప్రదాయం ప్రకారం తండ్రి కట్నం కానుకలకోసం ఎదురుచూస్తూన్నాడు, కాని వాటినే ముఖ్యంగాపెట్టుకోలేదు. ఎందుచేతంటే ఈకాలంలో పిల్లలయొక్క అభిప్రాయాలని సాధ్యమైనంతవరకు గణించాలనే బాపతు మనిషి. అందుచేత అతను అనుకూలమైన పిల్లకోసం ముఖ్యంగా చూస్తున్నాడు. తతిమావిఅన్నీ రెండోపక్షం.

విజయనగరంనుంచి ఒకసంబంధం వచ్చింది. పిల్ల రూపసి. మంచి సంప్రదాయంగల కుటుంబం. కట్నంకానుకలు సామాన్యం. మాటలువిన్నంతమట్టుకు సురూపశాస్త్రికి నచ్చింది. ఇహ కొడుకుతో సంభాషించి, ముందుకు సాగుదామనుకొంటున్నాడు. జంగమశివరావు తల్లికూడ సంబంధంగురించి విని సంతోషించింది. ఆమె కూడ కొడుకుతో ముచ్చటించ దలచింది.

పొద్దున్న అందరూ కాఫీ పుచ్చుకొన్నారు. సురూపశాస్త్రి సంభాషణ కదిపేడు.

"అబ్బాయికి వచ్చిన సంబంధం విన్నావు కాదుటే!" అన్నాడు భార్యతో.

"విన్నాను. బాగానేఉంది!" అని ఆమె తన ఆమోదాన్ని తెలియజేసింది.

"కుర్రవాడు విన్నాడా?" అని అడిగాడు సురూపశాస్త్రి.

సంభాషణ వింటున్నాడు జంగమశివరావు. మనస్సులో ఏమీ ఇష్టంగా లేదు.

"ఇంకా ఎవరమూ చెప్పందే!" అంది భార్య.

"సంబంధం చాలా మంచిది! వాళ్ల విశేషం ఆస్తిపరులు కారుగాని పిల్ల చక్కదనాలభరిణట!" అన్నాడు తండ్రి.

తండ్రిమాటకి ఎదురుచెప్పడానికి సందేహిస్తున్నాడు: తండ్రి వట్టి పూర్వాచారపరాయణుడని మనస్సులో నిందించుకొంటున్నాడు. కొడుకు. భర్త చెప్పిన మాటలకి భార్య 'ఊఁ' కొట్టింది.

"అబ్బాయికూడా పిల్లని ఒకమాటుచూస్తే మంచిదికదా!" అన్నాడు తండ్రి.

"ఔను!" అంది తల్లి.

"ఏమిరా ఒకమాటువెళ్లి చూసివస్తావేమిటి?" అని ప్రశ్నించాడు తండ్రి.

"ఏమిటి, అమ్మాయినా?" అన్నాడు జంగమశివరావు.

"ఔనురా!" అన్నాడు తండ్రి.

"ఇంకా ఆరకం పెళ్ళిళ్ళేమిటినాన్నా?" అన్నాడు కొడుకు, అభిప్రాయాన్ని సూక్ష్మంగా సూచిస్తూ.

కొడుకు ఆలోచనలు కాస్తో కూస్తో ఇతరులద్వారా వింటూన్నవాడు కాబట్టి తండ్రి అంతగాఆశ్చర్యపోలేదు. తల్లి మూసిముసినవ్వు నవ్వుకొంది.

"ఏమిటిరా నువ్వు మాట్లాడడం!" అన్నాడు తండ్రి.

"ఈకాలంలోకూడా అలాంటి పెళ్ళిళ్లేమిటి నాన్నా! పాశ్చాత్యదేశాలుచూడు, ఎవరికి వాళు స్వేచ్ఛగా ఎలాగు వరించుకొంటారో!" అన్నాడు కొడుకు ఇష్టంతో.

"ఇంటిలో అలాగు అంటే అన్నావు కాని బైటమట్టుకు అనకుసుమా! వట్టి వెర్రివాడికింద కట్టేస్తారు. ఇంతచదువూ చదువుకొని!" అని సలహా చెప్పాడు తండ్రి.

"ఈ సంఘం, ఈ దేశం, ఇవన్నీ మారిపోవాలి!" అన్నాడు కొడుకు, మనస్సులో ఆగని వాంఛని బైటపెడుతూ.

"నీ మాట వినేవాడెవడురా అబ్బాయీ!" అన్నాడు తండ్రి.

"ఒకడు చెప్పడం, ఒకడు వినడం ఎందుకు? ఎవడిమట్టుకువాడు అలాగుచేస్తేసరిపోతుంది!" అన్నాడు కొడుకు సూక్ష్మపద్ధతిగా.

అవన్నీ అర్థంలేనిమాటలు, అప్రస్తుతపు పదాలకింద కట్టివేశాడు తండ్రి. తల్లికి అసలే బోధపడలేదు.

"ఆ మాటలకేంగాని నువ్వువెళ్ళి పిల్లని చూసిరా!" అన్నాడు తండ్రి.

"అది కాదు నాన్నా! ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్ళు ఎంచుకొంటే ఎంత బాగుంటుందో చూడు!" అని తన ఆలోచనలలోంచి విడివడలేక మళ్ళీ తెలియజేశాడు కొడుకు.

కొడుక్కి కాస్త నచ్చచెప్పుదామని తోచింది తండ్రికి. "ఏమి బాగుండడం! వాళ్ళదేశాలలో ఉండే విడాకులలెక్క నీకేమైనా కనబడుతూందా?" అన్నాడు.

"ఇష్టంలేకపోతే ఎవరేంచేస్తారు!" అని సమాధానం చెప్పాడు కొడుకు.

"చేసుకోకముందేమో ఇష్టంఉంది! చేసుకొన్నతర్వాతేమో హరించిపోయిందీ!" అన్నాడు సురూపశాస్త్రి హేళనగా.

"అది కాదు నాన్నా!" అని కొడుకు ఏదో చెప్పబోతూండగా, తండ్రి అడ్డువచ్చి

"పాశ్చాత్యదేశాల ఆచారాలు పాశ్చాత్యదేశాలవి, మనదేశానివి మనవి! వాళ్ళు పాలు, రొట్టె తింటారు. మనమో? రోగం వచ్చినప్పుడుకాని తినం. వాళ్ళది చలిదేశం, మనది ఉడుకుడుకుదేశం! వాళ్ళఆడవాళ్ళు గౌనులు వేసుకొంటారు, మన ఆడవాళ్ళో మరి? వాళ్ళు చెంచాలతో తింటారు, మనం చేతులతో తింటాం! ఇలాగే దేశానికోపద్ధతీ, ఆచారమంటూ ఉంటాయిరా అబ్బాయీ!" అన్నాడు తండ్రి.

ఇంకా ఏదో చెప్పబోతున్నాడు కొడుకు. తండ్రి అడ్డువచ్చి "చదవవేస్తే పుట్టినబుద్ధులా ఇవి!" అన్నాడు గట్టిగా.

తనమాట సాగేటట్లు కనబడలేదు జంగమ శివరావుకి. పైగా, తండ్రి వట్టిమూర్ఖుడు అని అతని దృఢాభిప్రాయం! ఒక్కతండ్రేకాదు హిందూసంఘమే అటువంటిది! ఇంకా చెప్పవలసివస్తే హిందూదేశమే అటువంటిది అని అతని విశ్వాసం. తండ్రిమాటకి ఎదురు చెప్పలేకపోయాడు. మనస్సు తిరగబడినా నోటికిరాకుండా మధ్యనే ఆగిపోతున్నాయి మాటలు.

కొడుకుమాటలు ఈకాలపు యువకుల వెర్రిసంభాషణకింద కట్టివేశాడు తండ్రి. అర్థంగాక ఊరుకొంది తల్లి.

విమలాక్షి పధ్నాలుగేళ్ళ అమ్మాయి. వాళ్ళది విజయనగరం. ఇంగ్లీషుచదువు నేర్చుకోడానికి అవకాశాలు ఉన్నాయి. తండ్రి విద్యావంతుడు. కాబట్టి పిల్లకి చదువు చెప్పించాడు. ఇప్పుడు ఆ అమ్మాయి మ్యునిసిపల్ హైస్కూలులో నాలుగోఫారం చదువుతూంది.

సురూపశాస్త్రి రాసిన ఉత్తరం విమలాక్షి తండ్రికి చేరింది. అతను భార్యతో "సిరిపురం నుంచి సంబంధయువకుడువచ్చి అమ్మాయిని చూసుకొంటాడు. కాబట్టి మనం సిద్ధంగా ఉండాలి" అని చెప్పాడు. "అలాగే" అంది భార్య.

మంచిరోజుచూసి సురూపశాస్త్రి జంగమ శివరావుని విజయనగరం పంపించాడు. జట్కాబండి విమలాక్షి ఇంటిదగ్గిర ఆగింది. ఇంటిలోవాళ్ళు ఇవతలకి వచ్చారు. ఒకరిద్దరు వేసిన ప్రశ్నలనుబట్టి జంగమశివరావు సిరిపురంనుంచి వచ్చినట్లు తేలగా, సంబంధ యువకుడని తెలుసుకొని, అతన్ని ఆహ్వానించి, కుర్చీలో కూర్చోపెట్టారు. ఇంటిలో అంతా తొందరపడ్డారు. కాఫీఫలహారాలు తెప్పించిపెట్టారు.విమలాక్షిని అలంకరించారు.

"మీ తండ్రిగారుకూడ దయచెయ్యలేదేమి?" అంటూ విమలాక్షితండ్రి, జంగమ శివరావుని ప్రశ్నించాడు.

"ఆయనకూడ బయలుదేరుదామని తలచారు. కాని ఆఖరిక్షణంలో పొలంపనుల తొందరవచ్చి రాలేకపోయినందుకు మిమ్మల్ని క్షమించమని కోరమని నాతో చెప్పారు" అన్నాడు జంగమశివరావు.

"ఎంతమాట! వశంలో లేకపోయేక ఎవరేంచేస్తారు!" అన్నాడు విమలాక్షి తండ్రి.

విమలాక్షివచ్చి చాపమీద కూర్చుంది. జంగమశివరావు చూశాడు. షోకుగానే కనబడింది. ముంగురులు నుదుటిమీదికిపడకుండా తలపిన్నులు పెట్టుకొంది. సీతాకోకచిలకలు తలమీద వాలినట్టుగా చెంపపిన్నులు పెట్టుకొంది. మొహం పౌడిఅద్దుకొంది. జడకి

జలతారు రిబ్బను. గదిఅంతా ఘుమఘుమ లాడిపోతూంది. ఆ అమ్మాయి పాట, పద్యం చదవగా జంగమశివరావు సంతోషించాడు. కొంతసేపుండి ఆ అమ్మాయి ఇంటిలోకి వెళ్ళిపోయింది. విమలాక్షితండ్రి సంబంధ యువకుణ్ణి అనేకప్రశ్నలు వేశాడు. వాటి అన్నిటికి చక్కగానే సమాధానమిచ్చాడు జంగమశివరావు. అతను వెళ్ళి వస్తానంటూ బయలుదేరాడు. సంబంధం బాగానే ఉందని భావించారు విమలాక్షి తరఫువాళ్ళు.

సంబంధంపుటమ్మాయినిగురించి సురూప శాస్త్రి తన కొడుకుని అనేకప్రశ్నలు వేశాడు. సమాధానాలు విన్నాడు. కొడుకు అభిప్రాయం అనుకూలంగా ఉన్నట్లే తలచి ఇంటిలో అందరు సంతోషించారు. జంగమశివరావు తనలో ఈలాగు తలచాడు, "నా తండ్రి ప్రయత్నంవల్లగాకుండా విమలాక్షి నాకు నేరుగా పరిచయమయుంటే ఎంత బాగుం డును. మేము చక్కగా ప్రేమించుకొనే వాళ్ళం. అనేకవిధాలుగా ప్రేమలేఖలు రాసు కొనేవాళ్ళం. మేము చిల్లరమల్లర కానుకలు ఇచ్చుకొనేవాళ్లం. సినీమాలకి వెళ్ళేవాళ్ళం. విలాసంగా ప్రయాణాలు చేసేవాళ్ళం. ఇప్పుడు అటువంటివేమీ కుదరవు! పెద్దవాళ్ళ ద్వారా గాని ఈ సంబంధంసంగతే నాకుతెలియదు! పోనీ నేను ఇప్పుడు ఆ అమ్మాయికి ప్రేమ లేఖలురాస్తే, నేను నిన్నుప్రేమించాను. నీవు నాకు తిరిగి ఉత్తరాలురాయవలసింది అంటూ? అదేకాదుటయ్యా పరమారడంఅంటే! అదే కాదుటయ్యా పెళ్లికిముందు జరగవలసిన తంతు! కొన్నిప్రేమలేఖలు నడచి, మాకు తృప్తిని కలిగించేక - లేకపోతే మళ్లీ ఎవళ్ళ దారివాళ్ళదే - అప్పుడు కాదుటయ్యా పెద్ద వాళ్ళు జొరబడి మిగత వ్యవహారమంతా జరపాలి! ఇదంతా కుదిరితే ఎంత బాగుం డును! నేనుచదివిన ఇంగ్లీషు నవలలు, నాటకాలు, కథలూ, ఇదే కదా ఘోషి స్తున్నాయి. అందుచేత ఏమిచేస్తే మంచిది?" అని అతడు రెండుచేతులూ దవడల్లకింద మోపి ఆలోచించాడు. "ఏదయినా ఒక ప్రణయలేఖ రాసిచూస్తాను. ఈకథ ఇలాగు విడిచిపెట్టెయ్యెను" అని తీర్మానించు కొన్నాడు.

విజయనగరంనుంచి అనుకూలమైన లేఖ కోసం ఎదురుచూస్తున్నాడు సురూపశాస్త్రి.

విమలాక్షి తండ్రి తనకూతురుకి అప్పటి వరకు వచ్చిన సంబంధాలలో ఏది మంచిది అని ఆలోచించాడు. భార్యతోకూడా మంతనం చేశాడు. తన బంధుకోటిలోనేఉన్న ఒక సంబంధం చాలాబాగుందని ఇద్దరూ తలచారు. దానికి కారణాలేమిటంటే, - వాళ్ళకుటుంబం అంత పెద్దదికాదు, పైగా వాళ్ళదీ విజయ నగరమే. రాకపోకలకి సుళువు, ఇదివరకే తెలిసినవాళ్ళు, తామంటే కొంత మర్యాద ఉన్నవాళ్లు, దాహంకూడా విపరీతంగాలేదు. అందుచేత సంబంధ యువకుడైన లక్ష్మీనాధ రావుకే విమలాక్షిని ఇయ్యదలుచుకొన్నారు.

లక్ష్మీనాధరావు విశేషం ఆస్తిపరుడుకాడు. ఇంటర్‌పరీక్షకి వెళ్ళాడు. తల్లిదండ్రులయెడ భక్తిశ్రద్ధలున్నవాడు. మనిషి అంత అంద గాడుకాడు.

విమలాక్షి తండ్రి తన కుమార్తెపేరవచ్చిన ఉత్తరం అందుకొన్నాడు. "తిన్నగా మా పిల్లకి ఉత్తరం ఎవరు రాశారబ్బా!" అని

ఆశ్చర్యపోయాడు. కవరు విప్పి, చదివి, నిర్ఘాంతపోయాడు. జంగమశివరావు రాసిన ప్రణయలేఖ! "ఇంకా నయమే! వీడింత పిచ్చివాడని అనుకోలేదు! పొరపాటున ఈ సంబంధమే స్థిరపడిఉంటే గోతిలో పడిపోయేవాణ్ణే! మనిషినిచూస్తే పైకి వెర్రి కళలు కనబడవే! ఇదొకరకంపిచ్చా ఏమిటి చెప్మా! మనవాళ్లు మదపిచ్చి అంటారు, అతాలూకుది కాదుకదా!" అని తలచి "ఈ ఉత్తరం ఇంకా పిల్లచేతిలో పడలేదు. అదీ అదృష్టమే!" అని ఎంతోసంతోషించి "దీనికి సమాధానం రాయడమా, మానడమా? రాస్తే ఎవరికిరాయడం? మానేస్తే ఉండే లాభనష్టాలేమిటి? వాళ్ళ తండ్రికి తెలియజేస్తేనో? లేకపోతే, ఉత్తరం మనకి అందనట్టుగా ఊరుకుంటేనో? ఊరుకుంటేనే ఉత్తమం!" అని చిట్టచివరకి తలచి, దాని ప్రమేయమే ఎత్తుకోలేదు.

విజయనగర సంబంధంగురించి సురూపశాస్త్రి వాకబుచేస్తూనేఉన్నాడు. వాళ్ళు వేరే సంబంధం చూసుకొన్నట్టుగా ఆనోటా ఆనోటా విన్నాడు. కొన్ని తబిసీళ్ళుకూడా తెలిశాయి. సురూపశాస్త్రి భార్యతో చెప్ప దలుచుకొన్నాడు. పైగా, తనకొడుకు కొన్ని ఏళ్ళు విజయనగరంలో ఉన్నత పాఠశాలలో చదివేడు కాబట్టి ఒకవేళ అతనికి ఆ కుర్రవాణ్ణిగురించి ఏమేనా కొంత తెలిసిఉంటే ఉండవచ్చునీతలచి, ఊరికే మాటవరసకి అడగదలచుకొన్నాడు. భార్య, కొడుకుకూడ ఉండగా సురూపశాస్త్రి "విజయనగరంవాళ్ళు మరొక సంబంధం చూసుకొంటున్నారుట!" అన్నాడు.

జంగమశివరావు అదిరిపడి చూశాడు.

తల్లి ఏమంత పట్టించుకోలేదు.

"ఎవరో ఆ ఊరిపిల్లవాడేట! వాడికి ఇస్తారని తెలుస్తూంది!" అన్నాడు సురూపశాస్త్రి.

కొడుకు పంచేంద్రియాలూ కేంద్రీకరించి వింటున్నాడు.

తల్లి విని ఊరుకుంది.

"నీకేమేనా తెలుసుట్రా? నువ్వూ ఆ ఊళ్ళోనే చదివేవుకదా! ఎవడో లక్ష్మీనాధరావుట!" అన్నాడు తండ్రి.

"ఆఁ ఆఁ" అని అదుర్దాపడ్డాడు జంగమశివరావు.

"నీకు తెలుసా ఏమిటి?" అన్నాడు తండ్రి.

"ఊఁ. నేనూ, వాడూ కలిసి ఆరోఫారం వరకు చదివేము. మాసెక్షనే! కాని వాడి గ్రూపు వేరు, నాగ్రూపు వేరు. ఒకేసెక్షన్‌లో వాళ్ళమేకదా!" అన్నాడు జంగమశివరావు.

"వాడికిట ఇస్తారు!" అన్నాడు తండ్రి.

జంగమశివరావు గుండెలలో రైళ్ళు పరుగెత్తాయి.

తల్లి మనస్సుకి అంతగా పట్టించుకోలేదు. "చూసిన సంబంధమెల్లా కుదురుతుందా ఏమిటి!" అని ఒక్కమాట అనివేసి ఊరుకొంది.

తండ్రిమాత్రం మనస్సులో కొంచెం విచారించాడు, సలక్షణమైన సంబంధం, తాను ఇష్టపడినది తప్పిపోగా నొచ్చుకొన్నాడు.

జంగమశివరావు తనగదిలో పక్కమీద విశ్రమించాడు. "నేను వలచిన కన్నెకి పోటీగా వస్తున్నాడా లక్ష్మీనాధరావు. ఇంతకీ ఆ అమ్మాయి వాడిని ఇష్టపడవద్దూ! అప్పిడే

అయిందీ పెళ్ళి! అది కల్ల! నామనోహారిణి వాడిని ఎంచుకొంటుందని ఎప్పటికీ నమ్మ నక్కర్లేదు! ఇంతకీ మరొక ఉత్తరం ఆ అమ్మాయికి రాస్తాను కావలిస్తే. వాణ్ణి ప్రేమించవద్దనీ. ప్రేమహంస ఇన్నిచోట్ల కెగరకూడదనీ, నాలాగు స్థిరమైన భావంతోనే ఉండాలనీ, అంతేకాకుండా లక్ష్మీనాధరావుకి కూడా, నాకు ప్రణయవ్యవహారాలలో ప్రత్యర్ధిగా రావద్దనీ, అది బాగా లేదనీ, ఇంతకీ మనం స్నేహితులమనీ, కాబట్టి ఒకరిక్షేమం ఒకరంకోరి అటువంటి వ్యవహారలకి దిగవద్దనీ, నాప్రేమమార్గాన్ని అరికట్టవద్దనీ, ఒక ఉత్తరం గట్టిగా రాస్తాను. దానితో విమలాక్షితండ్రి అటకట్టిపోతుంది. వచ్చినట్లు నాకాళ్ళదగ్గిరకే వస్తాడు. అటు విమలాక్షి తనతండ్రిని పొడుస్తూఉంటుంది. కావలిస్తే లక్ష్మీనాధరావుకే 'నాకు ఆ పిల్ల అక్కరలేదనీ, నా మిత్రుడికి పోటీగా నేను దిగననీ' ఉత్తరం ఒకటి విమలాక్షితండ్రికి రాయవలసిందనికూడా ముక్కఒకటి చేరుస్తాను. ఇన్నివిధాలుగా తక్కినమార్గాలు కట్టివెయ్యగా, కుందేలు మాఇంటిలోనే జొరబడుతుంది!" అని జంగమశివరావు ఆలోచించాడు. ఆ చహర్థామీదే విమలాక్షికి, లక్ష్మీనాధరావుకి ఉత్తరాలు రాశాడు.

తన మిత్రునితగ్గిరనుండి వచ్చిన ఉత్తరం చూశాడు లక్ష్మీనాధరావు. ఆశ్చర్యపోయాడు. "నాకు ఈ సంగతి ఇదివరకే తెలిసుంటే ఎంత బాగుండును! ఇప్పుడేమిచెయ్యను? వ్యవహారం ముదిరిపోయింది. పెద్దవాళ్ళ చేతులలోకి పోయింది. నామిత్రుడికి అడ్డురావటం భావ్యంకాదు. కాని భావి ఎట్లుందో ఏమి చెప్పను!" అని తలచి తనకివచ్చిన ఉత్తరం తనతండ్రికి ఇచ్చాడు. ఆలేఖని ఆతను చదువు కొని "దీనికి ఇంత వ్యవహారం ఉందన్న సంగతి నాకేమితెలుసు! పూర్వగాధ పెద్దదే! ఏదయినా ఇప్పటికి మించిపోలేదు! 'అసలు సంగతి,-ఈ ఉత్తరం విచిత్రంగా ఉంది. దీని సంగతి సందర్భాలన్నీ విమలాక్షి తండ్రి తెలియజెయ్యవలసిందేకాని నాకు బోధపడదు. కాబట్టి అతనికేరాసి కనుక్కొంటాను. అని విమలాక్షితండ్రికి అజాబుని, తనజాబుకూడా కలిపి పంపించాడు.

జంగమశివరావు విమలాక్షిపేర రాసిన ఉత్తరం ఆ అమ్మాయి తండ్రిచేతిలో పడింది. అతను విప్పి చూసుకొన్నాడు. ఈమాటు ఆశ్చర్యంతోపాటు, కోపంకూడా వచ్చింది. "ఏదో ఒకమాటు ఉత్తరం రాస్తే, పోనీ ఏదో వెర్రివెంగళప్ప రాసేడనుకొని ఊరుకొన్నాను. కాని మళ్ళీ మళ్ళీ రాస్తూంటే! ఇది ప్రమాదకరంగా తయారవవచ్చు! కాబట్టి ఆ యువకుడి వెర్రిధోరణి తెలియజేస్తూ అతని తండ్రికే-అంటే, సురూపశాస్త్రికే, గట్టిగా రాస్తాను. దీనితోకాని ఈజాడ్యం వదలదు!" అనుకొని తెగబారెడు ఉత్తరం తయారుచేసి తపాలాకచ్చేరిలో పడవేసి ఇంటికివచ్చాడు. కాబోయే వియ్యంకుడి దగ్గిరనుంచి వచ్చిన ఉత్తరం బల్లమీద సిద్ధంగా ఉండగా "ఓహో!" అనుకొంటూ సంచీ విప్పాడు. పరమాశ్చర్యపోయాడు. అత్యుగ్రుడై పోయాడు. వట్టి వెర్రివాడిలాగు కనపడతాడే, ఈ జంగమశివరావుగాడు! వీడివెర్రికి అంతం కనపడదేం! వీడొకడు దాపరించాడు! వాడెవడు, మేమెవళ్ళం, పైగా లక్ష్మీనాధరావు

ఎవరు? ఎవళ్ళకెవళ్ళకేమి సంబంధం? వీడికి మతిపూర్తిగా లోపించింది. వీడికి పిచ్చి గాని మరొకటేమీ కాదు. మీరెప్పుడూ వాడి మాటలూ, లేఖలూ లెక్కచెయ్యవద్దంటూ ఒకఉత్తరం లక్ష్మీనాధరావుతండ్రికి రాసి పడవేస్తాను.... పోనీ మరొకఉత్తరంకూడా సురూపశాస్త్రికి రాసిపడవెయ్యనా?" అనుకొని "ఇప్పుడేకాదుటయ్యా బేడడబ్బులు దండగ పెట్టుకొని ఒకలేఖ అతనికి రాసిపారేశాను. మళ్ళీ ఇప్పుడే ఎక్కడ ఏడవను! పని దండగా, కాలంవృధా!" అని విసుగుకొన్నాడు. అతను ఉత్తరమొకటి లక్ష్మీనాధరావుతండ్రికి రాసిపడవేస్తూ "మనం ఒక్కఊళ్ళోనే ఉంటూ ఉత్తరముఖంగా తేల్చుకోడమేమీబాగాలేదు. నన్ను వెంటనే రేపుకలుసుకోవలసింది. నాకు వీలైతే నేనే కలుసుకొంటాను" అని ఒకముక్క చేర్చాడు.

లేఖ అందుకొని లక్ష్మీనాధరావుతండ్రి విమలాక్షి తండ్రిని కలుసుకొని మాట్లాడాడు. జంగమశివరావు వట్టి వెర్రివాడని తీర్మానించుకొన్నారు. పెండ్లిముహూర్తం ఏర్పాటుచేశారు. శుభలేఖలు అచ్చుకొట్టించారు.

విమలాక్షి తండ్రి రాసిన ఉత్తరం సురూపశాస్త్రికి చేరింది. అతను విప్పిచూసుకొని కలవరపడ్డాడు. "ఇది ఏమిటి! ఈ తప్పుడు పనులు!" అనుకొని, కొడుకుని పిలిచి అడిగాడు.

జంగమశివరావు "నాకాపిల్లంటే ఇష్టం!" అన్నాడు.

"ఇహ నోరుమూసుకో! నలుగురూవింటే నవ్విపోతారు!" అన్నాడు తండ్రి ఆశ్చర్యపోతూ.

"పాశ్చాత్యదేశంలో ఇలాగే పెళ్ళిళ్ళవుతాయి నాన్నా!" అన్నాడు కొడుకు.

"నోరుమూసుకోరా అంటే! సిగ్గు! సిగ్గు! చదువుకొన్నవాడివి! నీకు గట్టిగా చెప్పుదామంటే పెద్దచదువు చదువుకొంటున్నావు! ఇటువంటి అపకతవకపనులుచేసి కుటుంబగౌరవం చెడగొట్టకు! తెలిసిందా? ఇహనైనా బుద్ధిగా మసులుకో! లేకపోతే నలుగురూ పిచ్చివాడులాగు కట్టేస్తారు!" అని కొడుక్కి గట్టిగా బుద్ధిచెప్పి, కుర్రవాడుచేసిన అవివేకపు పనికి తాను ఎంతో విచారిస్తున్నానంటూ విమలాక్షితండ్రికి ఉత్తరం రాశాడు. జరిగిన విషయమంతా తెలిసి తల్లికూడా కొడుకుని మెత్తమెత్తగా చీవాట్లుపెట్టి, వెర్రిమొర్రి ఆలోచనలకి పోవద్దని బుద్ధిచెప్పింది.

తన రహస్యప్రణయం నలుగురినోళ్ళలోనూ పడ్డందుకూ, చీవాట్లు తిన్నందుకూ జంగమశివరావుకి చాలా పౌరుషం వచ్చింది. కాని ఏవిధాన్నిఅయినా విమలాక్షిని పెళ్ళిఆడడం తప్పదని నిర్ణయించుకొన్నాడు. "నాప్రణయమార్గానికి అడ్డువస్తూన్న వాళ్ళమీద వీలైతే కసితీర్చుకొంటాను. అవసరమైతే ద్వంద్వయుద్ధంచేస్తాను. అంతగా పట్టింపులు వచ్చేయంటే ప్రాణం తృణప్రాయం. ప్రేమవ్యవహారాలలో తల లెగిరిపోతూంటాయి! ఏంచేస్తాం! మొన్నమొన్ననే కదా వార్తాపత్రికలో చదివేను, ఒక పాశ్చాత్య యువతిని ప్రేమించిన ఇద్దరుదొరలు తుపాకులతో యుద్ధంచేసి చచ్చేరని. మనదేశానికి తుపాకు లెక్కడ! కత్తిపట్టుకోడమే సరిగ్గా మనవాళ్ళకి తెలిసి చావదు! ఇహ తుపాకీ ఒకటా!" అని వెటకారంగా పకఫకనవ్వాడు.

జంగమశివరావుకి ఒక శుభలేఖ వచ్చింది. దానిమీది పసుపుగుర్తులుచూసి "లగ్గసరి కాబట్టి ఏమూలనుంచో ఒక ఆహ్వానపత్రిక వస్తూనేఉంటుంది! పూర్వకాలపు పెళ్ళిళ్ళు; పూర్వాచారపు మనుష్యులు! బ్రహ్మాజమానం, భజగోవిందం!" అనుకొంటూ సంచీ చింపి చూసుకోగా, అతనిచేతులు పట్టుదప్పి శుభలేఖ కిందపడిపోయింది. ఆలేఖ అతని మిత్రుడైన లక్ష్మీనాథరావుదగ్గరనుంచి వచ్చింది. అది శుభలేఖేకాక లేఖకూడాను. శుభలేఖ కింద వ్రాతలో 'నువ్వు తప్పకుండా వివాహానికి రావాలి' అని రాసి ఉంది. జంగమశివరావు ఒళ్ళు మండిపోయింది. పళ్ళు పటపటమని కొరికాడు. శుభలేఖ నేలనివేసి కొట్టాడు.

"ఈపెళ్ళిఅయితే నాచెవి కదపాఇస్తాను! నా కంఠంలో ప్రాణంయుండగా నా ప్రేమ కాంతని మరొకడి దారిచేస్తానా? కల్ల! ముమ్మాటికీ కల్ల! వాడు పరమమిత్రుడైనా సరే ఈవిషయంలో నాకు పరమశత్రువు!" అని హుంకరించి, గుప్పిళ్ల అడించాడు. వీరావేశం ఎత్తిపోయాడు.

జంగమశివరావు సామానుల కొట్టులోకి వెళ్ళి పనసకాయి కత్తిఒకటి తీశాడు. అది తుప్పుపట్టి అసహ్యంగా ఉండగా, దానినంతా శుభ్రంగా కడిగివేసి, రాతినివేసి చక్కగా పదునువచ్చేటట్లు నూరేడు. "అదేంపనిరా?" అని తల్లిఅడగగా, "పొలంలో పనిఉందిలే!" అని ముక్తసరిగా జవాబుచెప్పాడు, "సరే" అంటూ ఆమె ఊరుకొంది.

పెళ్లిముహూర్తానికి ఒకగంట ముందుగా పెళ్లిపందిరికి వెళ్ళదలుచుకొన్నాడు జంగమశివరావు. ఇంటిదగ్గిర తల్లితో "విజయనగరం వెళ్లిరావాలి. పనిఉంది" అని చెప్పాడు.

ఆమె "మీనాన్నకిచెప్పు" అంది.

"సరే" అన్నాడు జంగమశివరావు మాట వరసకి.

తండ్రి పొలంమీదకి పోయాడు. చీకటి పడ్డాకగాని ఆయనరాడు. జంగమశివరావు సాయంత్రం రైలు అందుకొందామని బయలు దేరాడు. రైలుబండి కొంచెం ఆలస్యంగా వచ్చింది. విజయనగరం చేరుకొన్నాడు.

సురూపశాస్త్రి చీకటిపడ్డాక ఇంటికివచ్చి ఇంటిదగ్గిర కొడుకులేడేమి? అని భార్యని అడిగాడు. ఆమె ఇలాగు ఇలాగు సంభాషణ జరిగిందని చెప్పింది. శాస్త్రి మరికొంత భోగట్టాచేసి, కొడుకు రైలుస్టేషన్ మార్గం పట్టినట్లు తెలుకొని "ఏమిటో ఈవిషయం అర్థంగాకుండా వచ్చిపడింది. అంత హఠాత్తుగా వాడువెళ్ళడానికి కారణమేమిటో! నాకుచెప్పకుండా ఎన్నడూ ఇలాగ చేసి ఎరగడే బిడ్డ!" అని కంగారుపడి, తాను కూడా విజయనగరం బయలుదేరాడు. జంగమశివరావు ఎక్కినరైలుగాక ఆతర్వాతి రైలు అందుకొన్నాడు.


రంగురంగుల విద్యుద్దీపాల వెలుగులతో, అలంకరణాలతో, బాజాలతో, పిన్నపెద్దలతో, పెళ్లిపందిరి కోలాహలంగా ఉంది. పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు పెళ్ళిపీటలమీద కూర్చున్నారు. పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు. పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు మధ్యకట్టినతెర తీసివేశారు. విమలాక్షి చిరునవ్వు నవ్వుతూంది. మంగళసూత్రాన్ని నలుగురూ చేతులతోపట్టుకొని చూస్తున్నారు.

జంగమశివరావు తాను అనుకొన్న వేళకి విజయనగరం చేరలేకపోయినందుకు విచారించాడు. 'పెధవరైలు ఆలస్యంగా వచ్చింది!' అనుకొన్నాడు. అతనికాలంవేరే వృధా చెయ్యక తిన్నగా పెళ్ళిపందిరిలోకి వెళ్లాడు. పెద్దబాజాలు మోగుతున్నాయి. మంత్రాలు వల్లిస్తున్నారు. లక్ష్మీనాధరావులేచి స్వహస్తాలతో విమలాక్షిమెడలో మంగళసూత్రాన్ని కడుతూండగా జంగమశివరావు కాళ్ళు పట్టు తప్పేయి. అతను ఒక రాటని ఆనుకొని, పట్టుకొని నిలబడ్డాడు. అంతకంటే ముందుగా రాలేకపోయినందుకు రైలుని దూషించి విచారించాడు. "కసితీర్చుకొనిగాని ఇహ ఇక్కడినుంచి కదలను!" అని నిర్ణయించుకొన్నాడు.

రాత్రిబండి అందుకొని సురూపశాస్త్రి విజయనగరం చేరుకొన్నాడు. కొడుకుకోసం నాలుగుమూలలూ వెతుకుతున్నాడు.

పెళ్ళితంతు పూర్తికాగా లక్ష్మీనాధరావు పల్లకీ ఎక్కి విడిదికి వస్తున్నాడు. చీకటిలో జంగమశివరావు వెంబడించాడు. కత్తి చేతితో పట్టుకొన్నాడు. హుంకరిస్తూ పల్లకీమీదికి పరుగెత్తుకొని వచ్చి, ఒక్కఉరుకు ఉరికి కత్తితో లక్ష్మీనాధరావుని ఒక్కటి వేశాడు. హాహాకారాలు పుట్టాయి. బోయీలు గాబరాతో పల్లకీకిందపడవేశారు. బాజాలవాళ్ళు కంగారు పడ్డారు. "దొంగ! దొంగ!" అన్నారు. "ఖూనీ! ఖూనీ!" అని అరిచేరు కొందరు. ఒక్కక్షణంలో పెద్దగుంపు పోగయింది. పరుగెత్తుకొని పారిపోయే జంగమశివరావుని వెంబడించి ఇద్దరుపట్టుకొని వెనక్కి లాగుకు వచ్చారు. అతనిచుట్టూ పెద్దగుంపుచేరింది. ఏడ్పులతోటి, పెడబొబ్బలతోటి పెళ్ళివారు చేరారు. ఈ గడబిడ ఏమిటో చూద్దామనుకొంటూ దారినిపోయే సురూపశాస్త్రివచ్చి సంగతి తెలుసుకొని, "ఎవరో ఈ మహాత్ముడు!" అనుకొంటూ గుంపుమధ్యకి తొంగి చూశాడు. హంతకుడు తన కొడుకే అని తెలుసుకొని నిర్ఘాంతపోయాడు. అతని నోట మాటలేదు. "దేవుడిదయవల్ల కత్తి చేతికి మాత్రమే తగిలింది లక్ష్మీనాధశాస్త్రికి!" అని అందరూ సంతోషించారు. ఇంతటిలో పోలీసువారు వచ్చారు. జంగమశివరావుని తమవెంట నడిపించుకు తీసుకుపోయారు.






"ఇంకా టాయిలెట్ పూర్తికాలేదూ? ట్రైయిన్ టైము కొస్తుందట. పావుగంటే వుంది-" అంటున్నారు క్రిందనుంచి నాన్న.

"వచ్చేస్తున్నా" అన్నాను మేడమెట్లు దిగుతూ.

అక్క వస్తోందంటే యిల్లంతా సంబరంగావుంది.

నాన్న పోర్టికోలో కారు తలుపు పట్టుకు నాకోసం ఎదురుచూస్తున్నారు. అమ్మ మెట్లమీద నుల్చునివుంది. ఈ మూడేళ్ళలో అక్క జీవితం ఒకదారిన పడివుంటుంది. కాని అక్క మనసో? మూడేళ్ళయింది అక్కని చూసి.

"ఊఁ, ఎక్కు" అన్నారు నాన్న.

అమ్మకీ నాన్నకీ ఎంతహాయి! బరువు దించిన తృప్తి. అక్కసంసారం యిలా నిశ్చింతగా నడుస్తుందని వాళ్ళు అనుకోలేకపోయారు. కాపరానికిపంపిన ఏడాది దాకా ఏనాడు అక్క తిరిగివచ్చేస్తుందో అని అమ్మ వులికి వులికి పడేది.

అక్క గమ్మత్తయిన మనిషి. అక్కకి సంబంధించిన ప్రతివిషయం నాకు తెలుసుననుకునేదాన్ని కాని.... జోగారావు వ్యవహారంతో అక్కని నేనెంతవరకూ అర్థంచేసుకున్నానా అన్న సందేహం మొదటిమాటు కలిగింది.

అక్క కాలేజిలో, నేను హైస్కూల్లో చదువుతున్నా మా యిద్దరిమధ్యా రహస్యాలు వుండేవికావు. అక్క నెమ్మదికీ నా హడావుడికీ సరిపోయేది. పెళ్ళిచూపులకి బావ వచ్చేదాకా అక్క జోగారావు విషయం నాతోకూడా అనలేదు.

జోగారావు అక్క క్లాస్‌మేటని విన్నానేగాని, అక్క అతన్నిగురించి వుత్సాహంగాకూడామాట్లాడినట్టుజ్ఞాపకం లేదు. అత్తకూతురు సుశీమటుకు అతను ముంగిలా వుంటాడని ఎద్దేవాచేసేది.

మాలతీ చందూర్

అలాంటిది, బావావాళ్ళు పెళ్ళిచూపు లకి వొచ్చినప్పుడు అక్క జోగారావుని తప్ప మరొకణ్ణి పెండ్లాడనని నాన్న ముఖంమీద అనేటప్పటికి ఆయన అగ్గి రాముడయిపోయారు.

ఆనాడు మేడమీద మా తర్జనభర్జన, అమ్మఏడుపు, నాన్నమర్యాద కాపాడ మని అక్కని నేను బ్రతిమలాడటం - పెళ్ళిమాట దేముడెరుగును, పెళ్ళివారికి మొహంఅయినా చూపించి నాన్నపరువు దక్కించమని నేను బ్రతిమలాడటం....

అక్క పెళ్ళివారికి నచ్చకపోవడ మేమిటి? ముహూర్తం పెట్టించమని నాన్నతో అన్నారు. అక్కపెళ్ళికిససేమిరా వొప్పుకోనంది. వారంరోజులు యింట్లో వుపవాసాలు. ఇల్లు నరకమైపోయింది.

ఆరాత్రి అక్కగదిలో కూచుని ఆమెను నెమ్మదిగా మాటల్లోకి దింపాను.

"ఎవరే ఆ జోగారావు?" అని అడిగాను.

"హృదయం వున్నమనిషి."

"ఈ పెండ్లికొడుకు ఫారెస్ట్ వెళ్లాట్ట. డార్జిలింగ్‌లో పనిట. తనకంటె పెద్ద ఆఫీసరని నాన్న మురుస్తున్నారు."

"నాన్న మురుస్తున్నారని చేసుకో మన్నావా?"

"అదికాదు - ఆ జోగారావులో...." ఏమనగలను జోగారావుని?

మరోవారం గడచినతర్వాత అక్క టఫీమని సంబంధానికి వప్పుకుంది. జోగారావుకి మా కుటుంబగౌరవం చెరపడం యిష్టంలేదుట - అవి అక్క చెప్పిన మాటలు. అక్క విధికి తలవొగ్గి బుద్ధిమంతురా లనిపించుకుంది.

పెళ్ళి మరుసటి నెలలో వైభవంగా జరిగింది. బావ ఫారెస్ట్ ఆఫీసరు. నెలకు ఎనిమిదివందలు జీతం. దూరాభారం అన్నమాటేగాని ఎంతదర్జా! అమ్మా నాన్నా వారించినా వినకండా పెండ్లికి ఒడబడిన మర్నాటినుంచి అక్క కాలేజీ మానేసింది. పెండ్లినాటినుంచీ అక్క మొఖంలో చిరునవ్వు మాయమయింది. ఒకవిధమయిన తీక్షణత బయలుదేరింది.

నిన్నసాయింత్రం సుశితో 'అక్క వస్తోంది' అనగానే, 'మీ బావకూడానా?' అంది సుశి. దానికెందుకో బావగురించి! బావ దాన్ని పెళ్ళాడక మాఅక్కని చేసు కున్నాడని ఎందుకో అంత వుక్రోషం. అత్తా వాళ్ళందరికీ అదే ఏడుపు. పెళ్ళి సంబంధం బెడిసిపోవాలని అక్క ఎంత కోరుకుందో వాళ్ళకేంతెలుసు?

ప్లాట్‌ఫారమ్ హడావుడిగా వుంది. రైలు కూత కూసి పొగలు కక్కుతూ వస్తోంది. అక్క ముఖం ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటులోంచి తొంగిచూస్తోంది. అదేమిటి? అలా వుందేం? ఆ కళ్ళు అంత విచారంగా వున్నాయి. ఎంతైనా అంత ప్రయాణ బడలికా!

అక్క ముఖంలోకి మరోసారి చూడ గానే రహస్యం తెలిసినట్టయింది. అక్క

యీ మూడేళ్ళనుంచి బావని వదలలేక కాదన్నమాట యిక్కడికి రాకపోవడం. స్మృతులనుంచి పారిపోవాలని మనుష లెంత ఘట్టిగా ప్రయత్నిస్తారు! అమ్మా నాన్నా పెళ్ళయితే చేశారుగాని - దాని హృదయాన్ని మార్చలేకపోయారు.

అక్క రైలు దిగింది. బావనవ్వుతూ పల్కరించారు. అక్క నాచేతిని తన చేతులోకి తీసుకు నొక్కింది. అలా నొక్కడంలో ఎన్నోసందేశాలు తెలియ జెప్పింది. అక్కా అందరిలాంటిమనిషే! ఆమెదీ గాయపడిన హృదయమే!

ఇంటికొచ్చింతర్వాత అక్క తన పూర్వపుగదిలోకివెళ్లి విట్టూర్పువిడుస్తూ-దూరానవున్న కొబ్బరిచెట్లనీ, సముద్రపు అలలనీ చూసింది. గబుక్కున నావైపు తిరిగి "అతనిగురించి ఖబుర్లేవేనా తెలిసాయా?" అంది.

"బి. ఎ. అయిన తర్వాత యీ వూరునుంచి వెళ్ళిపోయాడు.కొలంబోలో పనిట. సుశి అంటే విన్నాను."

"అల్లాగా" అంది నీరసంగా.

"నే నెప్పుడూ అతనితో మాట్లాడ లేదు" అన్నాను ఏమీ తోచక.

"నాకు తెలుసు" అంది అక్క లోతుల్లోంచి.

అక్కని దగ్గరగా తీసుకువోదార్చాలనీ, అర్థంచేసుకున్నానని ఏవేవో మాటలు చెప్పాలనీ నా స్త్రీహృదయం పెనగులాడింది. కాని హృదయాన్ని మాటల్లోకి మార్చడమే సంభవమయితే..

మర్నాడు అత్తా, సుశీ వచ్చారు. సుశి ఆవీ యివీ మాట్లాడి, బావతో నవ్వింది. అక్కని హాస్యాలాడింది. వెళ్ళబోతూ 'జోగారావుకి పెళ్ళయింది' అంది అక్కతో. ఎవరూ అడగలేదు సుశిని ఆసంగతి. నాకు లాగి లెంపకాయ కొట్టాలనిపించింది. కాని అక్క కళ్ళు నన్ను ఆపాయి. సుశి ప్రపంచంలో మాటలకి విలువలేదు. అవి వొట్టి గాలి మాటలు. ఆమెవి రుచీ, సందర్భంలేని మాటలు.

అక్క రెండునెలలు వుండాలని వచ్చింది. బావ వారంరోజులతర్వాత వెళ్ళిపోయారు.

పొద్దుట సుశి ఫోన్ చేసింది, నన్నూ అక్కనీ టీకి రమ్మని. నాకు సుశిఅంటే తలనొప్పి. 'వెళ్ళను బాబూ' - అన్నాను అమ్మతో.

"వస్తూ పోతూంటేనే బంధుత్వం" అని అమ్మ ఏమిటేమిటో మాట్లాడింది.

"అక్కను వెళ్ళమను" అన్నాను. అక్క నావంక జాలిగాచూసి, "వెళ్ళక పోతే నాకు గర్వం అని చెప్పుతారు. యిప్పటికే పడి ఏడుస్తున్నారు", అంది నెమ్మదిగా. ఏదో లోకంకోసమే బతుకుతున్నట్టు నిర్జీవంగా మాట్లాడింది అక్క.

మూడుగంటలవేళ వాళ్ళింటికి బయలు దేరాం, కారు పోర్టికోలో ఆగింది. మేడ మీంచి నవ్వులు వినిపిస్తున్నాయి. మెట్లు ఎక్కుతున్నాం, ముందు అక్కా, వెనక నేనూ.

హాల్లో గుమ్మం దగ్గిర అక్క అమాంతం ఆగిపోయింది. విరుచుకుపడి పోతుందేమో ననుకున్నాను. గబుక్కున వెళ్ళి వెనక నుల్చున్నాను. హాల్లో ఎదురుగ్గా కుర్చీలో జోగారావు, పక్క కుర్చీల్లో సుశీ, రాధా, అత్త. అక్కనీ జోగారావునీ గెల్చినట్టు పదేపదే చూస్తున్నారు వాళ్ళు.

అక్కని యీ మురికినుంచి చెయ్యి పట్టుకు లాక్కెళ్ళిపోవా 'లనిపించింది నాకు. సుశీ వాళ్ళు ఎంత సిగ్గులేని మనుషులు? అయినా జోగారావు ఎలా వచ్చాడు బుద్ధిలేక?

అక్క తెప్పరిల్లి, నవ్వుతూ లోపలికి ప్రవేశించి సుశీనీ, రాధనీ, అత్తనీ పల్కరించి, జోగారావుని కుశలప్రశ్నలడిగి, అతనిపక్కనున్న కుర్చీమీద వోపిక లేనట్టు కూలబడింది.

నా కుమ టుకు మహచెడ్డ వుడుకుమోత్తనంగావుంది. ఇందుకా సుశీ 'మేమురాము మొర్రో' అన్నా, బలవంతంచేసి రప్పించింది? అక్కని బాధపెట్టి, యిబ్బందుల్లో యిరికిస్తే దానికేమొస్తుంది? ఇది జెలసీకూడాకాదు. ఒట్టి నీచత్వం. జోగారావుకూడా యీ కుట్రలో భాగస్వామా? కాని అతని మొహం చూస్తే అత నలాంటివాడిలా కనిపించడంలేదే!

అక్కమాట్లాడితే సుశీవాళ్లు జోగారావువంకా, అతనుమాట్లాతే అక్కవంకా, పరిశీలనగాచూసి - తమలోతాము కళ్ళతో మాట్లాడుకునేవారు. అక్క చాలా గంభీరంగా నవ్వుతూ మాట్లాడింది. జోగారావు కాస్త తత్తరపడ్డాడు. సంభాషణ చాలా కష్టంగా సాగుతోంది.

పావుగంటయింది. సుశీ, రాధా టీ తీసుకొస్తామని కిందకెళ్ళారు. నేను మాట్టాడితే తిట్టేటట్టువున్నాను. అంచేత పెదవులు బిగించుకు కూచున్నాను.

అత్త వాళ్ళిద్దరివంకా చూస్తూ "యిప్పుడే వస్తా" అంటూ లేవబోయింది. అక్క గబుక్కున ఆవిడ చెయ్యి పట్టుకుని "నువ్వు వెళ్ళకుఅత్తా. మాచెల్లిది మంచి సాక్ష్యంకాదు. అయినా అది నాపక్షమే పల్కుతుంది." అంది.

"ఏమిటే?" అంది అత్త.

"ఏమిటేమిటి? మరి అతన్నీ నన్నూ సమావేశపర్చారా! తర్వాత పర్యవసానమేమిటో చూడరూ? నువ్వు కాపలా లేకపోతే మేము - ఒకప్పుడు ప్రేమించుకున్నవాళ్ళం కదా - అంచేత రెక్కలు కట్టుకు యీ కిటికీలోంచి ఎగిరిపోవచ్చు. అప్పుడు నువ్వు వొకరికికాదు, యిద్దరికి

జవాబుచెప్పాలి. అందులో మాఆయన అటవీశాఖోద్యోగి" అంటూ అత్త చెయ్యి వదలకుండా పట్టుకుంది అక్క.

నాకు బలే సంతోషమయింది.

"మీఆవిడ ఎక్కడుంది, జోగారావు?" అని అడిగింది అక్క, అత్త చెయ్యి యింకా వదలకుండానే.

"మా ఆవిడా - నాకు పెళ్ళికాలేదే!" అన్నాడు తెల్లపోయి.

"అల్లాగా! సుశి అయిందని అంటే అయిందేమో అనుకున్నాను. భార్యని చూడటానికి వచ్చావని చెప్పిందే!"

"అబ్బే. మానాన్నపోయారు. అందుకొచ్చానుయీవూరు. రేపువెళ్ళిపోతాను," అన్నాడు కాలివేళ్లు చూసుకుంటూ.

"I am sorry" అంది అక్క.

నాకు అతన్ని చూస్తే జాలేసింది.

జోగారావు అక్క మొహంలోకి చూస్తూ, "ఒక్కమాట చెప్తాను నమ్ముతావా? నువ్వు యీ వూళ్ళో వున్నట్టు కూడా నాకు తెలియదు. సుశీల టీకి పిలిస్తే వచ్చాను. కాని నాకు వీరి టీ వద్దు. నేను వెళ్ళిపోతున్నాను. ఇంకోసారి ఎప్పుడైనా యింతకంటె సవ్యమైన పరిస్థితుల్లో కలుసుకుందాం. ఈ కపట నాటకంలో నేను పాత్రధారిని కానని నువ్వు తెలుసుకుంటే నాకదేపదివేలు"- అంటూ, అంతవరకూ బెరుకుబెరుకుగా కూచున్న జోగారావు కుర్చీలోనుంచి లేచి, రివ్వున వెళ్ళిపోయాడు.


అత్తముఖం కందగడ్డలా అయింది. మెట్లదిగువని రాధా సుశీ గుసగుసలాడుతున్నారు. ఇంకా టీ ఏమిటి? అక్కా నేనూ యింటికొచ్చేశాము. అక్కని పల్కరిస్తే హిమాలయాలు కరుగుతాయేమోనని అనిపించింది.

కిమ్మనకుండా అక్క సరాసరి తన గదిలోకివెళ్ళి పడుకుంది. అంత తొందరగా వచ్చినందుకు అమ్మ ఆశ్చర్యపోయింది. అక్కకి తలనెప్పిగా వుందనీ, పల్కరించవద్దనీ అందర్నీ బ్రతిమాలాను.

రాత్రి భోజనానికి పిల్చేందుకు గది దగ్గిరికి వెళ్లానుగాని తలుపుకొట్టే ధైర్యం లేకపోయింది. అంతా పడుకున్నారు. పదకొండయింది. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. నెమ్మదిగా తట్టాను. లోపల గడియలేదు. తలుపు తెరుచుకుంది. చీకట్లో పక్కమీద అక్క పడుకుంది. ఆ చీకటిగదిని ఆమెకాటుకకళ్లు వెలిగిస్తున్నాయి.

అక్కని రెండుచేతుల్లోకి తీసుకుని, "అవమానాలు భరించాలి. మనం ఆడవాళ్ళం, భూదేవిలాంటివాళ్ళం" అన్నాను తల నిమురుతూ.

నా వడిలోకి మహాప్రవాహాలు పరిగెట్టాయి.



నాలుగు భాషలలో
# చందమామ

★

(తెలుగు) **చందమామ**

విడిసంచిక సాలుచందా : 4-8-0
0 - 6 - 0 రెండేండ్లకు : 8-0-0

(కన్నడ) **చందమామ**

విడిసంచిక సాలుచందా : 4-8-0
0 - 6 - 0 రెండేండ్లకు : 8-0-0

(హిందీ) **చందమామ**

విడిసంచిక సాలుచందా : 4-8-0
0 - 6 - 0 రెండేండ్లకు : 8-0-0

(అరవ) **అంబులిమామ**

విడిసంచిక సాలుచందా : 4-8-0
0 - 6 - 0 రెండేండ్లకు : 8-0-0

చందమామ పబ్లికేషన్స్
పోస్టు బాక్స్ 1686 :: మద్రాస్-1

Edited, Printed and Published by B. Nagi Reddy at B. N. K. Press